

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 8.00

సంపుటి: 15
సంచిక: 274

SUNDAY Special

ఆదివారం 18-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | BANGALORE | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ

భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఇండోనేసియా ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించారు. నేడు జరిగే ఫైనల్లో ఆరోన్-సో వుయ్ యిక్(మలేసియా) తో వీరు తలపడతారు.

- వివరాలు 12లో



ప్యాంక్రియాటైటిస్ వస్తే..!

దేహంలోని జీవక్రియల్లో ప్యాంక్రియాస్(క్లోమ గ్రంథి)ది కీలక పాత్ర. దీనికి ఇన్ఫెక్షన్ రావడాన్ని ప్యాంక్రియాటైటిస్ అంటారు. అలాంటి పరిస్థితి ఎదురవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

- వివరాలు 11లో



ఉగాండాలో రాక్షసక్రీడ

ఉగాండాలో తీవ్రవాదులు స్కూలుకు నిప్పుపెట్టారు. 38 మంది విద్యార్థులు సహా 41 మందిని ఊచకోత కోశారు.

వివరాలు 6లో ▸



బంధం మరింత బలోపేతం

జో బైడెన్ ఆహ్వానం మేరకు ఈనెల 21 నుంచి 24 వరకు ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించనున్నారు.

వివరాలు 6లో ▸



బోస్ ఉంటే విభజన జరిగేది కాదు

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవించి ఉంటే మన దేశం విడిపోయి ఉండేది కాదని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ అన్నారు.

వివరాలు 6లో ▸



ఆగని మణిపూర్ హింసాకాండ

మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతోంది. తాజాగా ఆయుధాగారాన్ని కొల్లగొట్టేందుకు ఆందోళనకారులు విఫలయత్నం చేశారు.

వివరాలు 6లో ▸

2డి, 3డి చిత్రాలు.. డిజిటల్ పాఠాలు

రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యలో స్మార్ట్ విప్లవం

స్మార్ట్ టీవీలు, ఫ్లాట్ ప్యానెళ్లతో ఆధునిక బోధన

- చిత్రాలు, గ్రాఫ్‌లతో కళ్లకు కట్టేలా అంశాలపై వివరణ
- నాడు-నేడు తొలివిడత స్కూళ్లలో ఏర్పాటు.. 15,713 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు సన్నద్ధం
- ఉపాధ్యాయులకు జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో శిక్షణ
- విద్యార్థుల తలరాత మార్చడంలో మరో ముందడుగు

నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి

ఒక్కసారి వినగానే, చూడగానే విద్యార్థుల మదిలో నిలిచిపోయేలా.. ఎప్పుడు ఆ అంశం ప్రస్తావన వచ్చినా పుట్టుపూర్వోత్తరాలన్నీ గుర్తుకొచ్చేలా 2డి, 3డి చిత్రాలతో డిజిటల్ పాఠాలు బోధించడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో విప్లవాత్మక టెక్నాలజీని అందుబాటులోకి తెస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక డిజిటల్ టెక్నాలజీతో విద్యా బోధనకు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే నాడు-నేడుతో సర్కారీ స్కూళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటంతోపాటు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను ఉచితంగా అందించిన రాష్ట్ర ప్రభుత్వం .. అగ్ర దేశాల్లో విద్యా బోధనకు వినియోగించే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా అందుబాటులోకి తెస్తోంది. తొలివిడత నాడు-నేడు పూర్తయిన 15,713 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వీటిని వినియోగించనున్నారు. వీటి వినియోగంపై

మిగతా 2వ పేజీలో ▶



ఇది కృష్ణా జిల్లా మొవ్వ మండలంలోని కాజా ఎస్పీఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ స్క్రీన్‌పై విద్యా బోధన ప్రారంభమైంది. వివరణాత్మకంగా, సమర్థవంతంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా చెబుతున్నారు. మోపిదేవి ఉన్నత పాఠశాలలో సైతం 8 ఐఎఫ్‌పీ స్క్రీన్లు అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు బోధన ప్రారంభించారు.

న్యూస్‌రీల్

సగం రాష్ట్రాలకు వడగాడ్పుల వెతలు



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ సహా విదర్భ ప్రాంతాల్లో వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరో 3-4 రోజులు ఈ పరిస్థితి ఉంటుందని తెలిపింది.

వివరాలు 6లో ▸

నర్సీపట్నంలో జీసీసీ కాఫీ యూనిట్!



నర్సీపట్నంలో కాఫీ గింజల ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు గిరిజన సహకార సంస్థ చర్యలు చేపడుతోంది. ఇక్కడ జీసీసీకి మూడు గోదాములున్నాయి. వీటిని యూనిట్‌కు అనుగుణంగా మార్పులు చేస్తే వీలైనంత త్వరగా ప్రాసెసింగ్ చేసేందుకు అవకాశముంటుందని జీసీసీ భావిస్తోంది.

వివరాలు 10లో ▸

నాడు భయం భయం.. నేడు భద్రతకు భరోసా

- టీడీపీ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా నేరాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమర్థంగా నేరాల కట్టడి
- సాంకేతికతతో దర్యాప్తులో పెరిగిన వేగం
- త్వరితగతిన విచారణ.. శిక్షలు

2లో

ఫ్యాక్ట్ చెక్

- మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు.. స్పష్టం చేస్తున్న ఎన్సీఆర్‌బీ నివేదికలు
- వాస్తవాలు దాచి ఎల్లో మీడియా విష ప్రచారం

ఏపీ నాకెంతో ప్రత్యేకం

- ఇంతటి ప్రేమాభిమానాలను నేను ఎక్కడా చూడలేదు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

2లో



సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఏపీకి 4 జాతీయ జల అవార్డులు

- జల సంరక్షణ, నిర్వహణలో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్థానం
- ఉత్తమ స్కూల్ విభాగంలో 2వ స్థానంలో నిలిచిన చాగలమర్రి కేజీబీవీ.. పరిశ్రమల విభాగంలో తిరుపతిలోని సీసీఎల్‌కు 3వ స్థానం
- అవార్డులను ప్రదానం చేసిన ఉప రాష్ట్రపతి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి

2లో



ఉపరాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న జలవనరుల శాఖ అధికారులు

తెలంగాణ

కేసీఆరే హ్యాట్రిక్ ముఖ్యమంత్రి

- తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్
- నవంబర్ లేదంటే డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు
- ప్రతిపక్షాల చిల్లర మాటలను కార్యకర్తలు తిప్పికొట్టాలి
- పీఎం మిత్రకు కాకతీయ టెక్స్‌టైల్ పార్కే స్ఫూర్తి
- వరంగల్ జిల్లాలో కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీకి భూమిపూజ

సాక్షి, వరంగల్: రాష్ట్రంలో నవంబర్ లేదా.. డిసెంబర్‌లో ఎన్నికలు ఉంటాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అయి మళ్లీ బాధ్యతలు చేపడతారని, ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు చెప్పే చిల్లరమల్లర మాటలను కార్యకర్తలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చా రు. వరంగల్ జిల్లా గీసుగొండ, సంగెం మండలాల పరిధిలో ఉన్న కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కులో కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీ ఏర్పాటు చేస్తున్న యూనిట్‌కి భారత్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా



రాయబారి హెచ్ఈ చంగ్ జే బాక్‌తో కలసి శనివారం మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు తెలంగాణలో అనుకూల వాతావరణం ఉందన్నారు.

తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నది

తెలంగాణ నేడు ఆచరిస్తున్నది.. భారతదేశం రేపు అనుసరిస్తున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. కేంద్రం తీసుకొచ్చే చాలా పథకాలకు తెలంగాణనే దిక్సూచి అయిందన్నారు. అంతకుముందు కొరియా రాయబారి హెచ్ఈ చంగ్ జే బాక్ మాట్లాడుతూ.. వస్త్ర పరిశ్రమకు తెలంగాణ పెద్ద కేంద్రంగా మారుతోందన్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు జయేశ్ రంజన్, నరసింహారెడ్డి, యంగ్‌వన్ కంపెనీ సీఈఓ కీహాక్ సంగ్ పాల్గొన్నారు.

కేంద్రం కాపీ కొట్టింది..

వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కేంద్రం అమలుచేస్తున్న పీఎం మిత్ర పథకానికి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కే స్ఫూర్తి అని కేటీఆర్ అన్నారు. 2017లో మెగాటెక్స్‌టైల్ పార్కుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తే.. ఇప్పుడు కేంద్రం దానిని కాపీకొట్టి పీఎం మిత్ర తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయం, టెక్స్‌టైల్ రంగాలతో మన రాష్ట్రంలో జీవనోపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఫామ్ టు ఫ్యాషన్ అనే లక్ష్యంతో ఇక్కడే సమగ్రంగా వస్త్రాలు తయారు కావాలన్న సంకల్పంతోపాటు గతంలో ఆజంజాహి మిల్లు ఉన్న సమయంలో వరంగల్‌కు ఉండే పేరు ప్రతిష్ఠలను మళ్లీ ప్రపంచానికి చాటి చెప్పేలా సీఎం కేసీఆర్ కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇక్కడ తయారయ్యే దుస్తులు దేశం కోసమే కాదు.. అమెరికా, యూరప్, కొరియా వంటి ప్రపంచ మార్కెట్‌లోకి వెళతాయన్నారు. మేడ్ ఇన్ తెలంగాణ, మేడ్ ఇన్ పరకాల, మేడ్ ఇన్ వరంగల్ పేరుతో ప్రపంచ మార్కెట్లలోకి అమ్మకాలు ఉంటాయని చెప్పారు. ఈ పరిశ్రమల వల్ల పత్తి పండించే రైతులకు మద్దతు ధర కూడా వచ్చే అవకాశముంటుందని తెలిపారు. యంగ్‌వన్ ద్వారా 21,000, కిటెక్స్ ద్వారా 12,000, గణేశ ద్వారా 1,000 మందికి ఉపాధి కలుగుతుందని.. దీనికి రెట్టింపుగా పరోక్ష ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఈ పరిశ్రమల్లో స్థానికులకే 99 శాతం ఉద్యోగాలు ఉంటాయని, ముఖ్యంగా మహిళలకు 80 నుంచి 85 శాతం ఉద్యోగాలు కల్పించే దిశగా ఆయా కంపెనీలతో మాట్లాడమన్నారు. ఇప్పటికే ఇక్కడ నిర్మాణం పూర్తి చేసుకుంటున్న కిటెక్స్ కంపెనీని సీఎం కేసీఆర్ సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో ప్రారంభిస్తారని కేటీఆర్ తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న కారు.. ఐదుగురి దుర్మరణం



మడికి వద్ద ఘటనాస్థలిలో దెబ్బతిన్న వాహనాలు

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున వ్యాన్‌ను కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

- వివరాలు 10లో

ఇక దస్తావేజులతో పని లేదు



ఈ-స్టాంపు

- రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో మొదలైన ఈ-స్టాంపుల శకం
- రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్లు వీటితోనే చేసుకోవచ్చు
- సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో అందుబాటులోకి..
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ-స్టాంపింగ్ కౌంటర్లు
- దస్తావేజుల కంటే భద్రం.. ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదు

- వివరాలు 3లో

క్లుప్తంగా...

ఆ సమ్మెలో పాల్గొనం

రెండో ఏఎన్ఎం ఏపీ స్టేట్ అసోసియేషన్ వెల్లడి

సాక్షి, అమరావతి: నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ తలపెట్టిన సమ్మెతో తమకు ఎలాంటి సంబంధం లేదని రెండో ఏఎన్ఎం ఏపీ స్టేట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అంకమ్మ రాణి, పి.కుమారి పేర్కొన్నారు. రోగుల సంక్షేమం దృష్ట్యా తాము ఆ సమ్మెలో పాల్గొనబోమని శనివారం వారు ఓ ప్రకటనలో తెలిపారు.

బాలికకు విజయవంతంగా గుండె మార్పిడి

అవయవ దానం చేసిన తమిళ కుటుంబం



గుండెను తరలిస్తున్న వైద్యులు

తిరుపతి (తుడా): తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో మరో గుండె మార్పిడి చికిత్సను వైద్యులు శనివారం విజయవంతంగా నిర్వహించారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన 12 ఏళ్ల బాలికకు 6 గంటలపాటు శ్రమించి గుండె మార్పిడిని విజయవంతంగా పూర్తిచేశారు. కొంతకాలంగా ఆ బాలిక గుండె సామర్థ్యం పూర్తిగా క్షీణించడంతో అనారోగ్యం బారినపడింది. ఆమెకు గుండె మార్పిడి అనివార్యమని ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తేల్చారు. బాలిక పేరును 'ఏపీ జీవన్‌దాన్'లో రిజిస్టర్ చేయించారు. కాగా, చెన్నైకు చెందిన 29 ఏళ్ల యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ కావడంతో యువకుడి కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారు. అతడి నుంచి సేకరించిన గుండెను తమిళనాడు, తిరుపతి జిల్లా పోలీసులు 2.32 గంటల్లో గ్రీన్ చానల్ ద్వారా హృదయాలయానికి తరలించి బాలికకు అమర్చారు. కార్యక్రమాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.

■ తెలంగాణ

ప్రొ.హరగోపాల్‌పై 'ఉపా' కేసు ఎత్తివేత

సాక్షి ప్రతినిధి, వరంగల్: పౌరహక్కుల నేత, విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ – ఉపా) కేసును తెలంగాణ పోలీసులు ఎత్తివేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రొ.హరగోపాల్‌తో పాటు వి.రఘునాథ్, జర్నలిస్టు పద్మజా షా, గడ్డం లక్ష్మణ్, గుంటి రవీందర్, దివంగత జస్టిస్ సురేష్‌పై కూడా ఉపా కేసులు ఎత్తివేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అయితే ఈ కేసులో ఉన్న 13 మంది మావోయిస్టులు, మిగతా వారిపైన కేసు విచారణ కొనసాగుతుందని ప్రకటించారు. హరగోపాల్ సహా 152 మందిపై ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో ఉపా కింద 2022 ఆగస్టు 19న నమోదైనప్పటికీ.. ఇటీవలే అది వెలుగు చూసింది. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరు ప్రసాదరావు అలియాస్ చంద్రన్న ఆదేశాలతో తాడ్వాయి మండలం బీరెల్లి శివారు ఆశన్నగూడెం ఎల్లాపూర్ అటవీప్రాంతంలో 2022 ఆగస్టు 19న మావోయిస్టులు, ప్రజా సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వంపై కుట్ర చేశారని పస్రా సీఐ శంకర్ ఫిర్యాదు చేశారు. మావోయిస్టు పార్టీకి నిధులు సమకూర్చడంతో పాటు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులను చంపాలని కుట్ర చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు బడే చొక్కారావు అలియాస్ దామోదర్, కంకనాల రాజిరెడ్డి అలియాస్ వెంకన్నతో సహా 13 మంది మావోయిస్టులు, ప్రొ. హరగోపాల్ సహా 20 ప్రజా, పౌరహక్కుల సంఘాలకు చెందిన 139 మందిపై తాడ్వాయి ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో శనివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.3	32.6
రాజమహేంద్రవరం	44.0	31.0
భీమవరం	44.0	28.0
విజయనగరం	44.0	33.0
ఒంగోలు	43.4	33.0
విజయవాడ	43.0	31.0
అనకాపల్లి	42.3	30.4
నంద్యాల	40.5	29.2
విశాఖపట్నం	40.4	29.4
కడప	39.7	29.5
ఇచ్ఛాపురం	39.0	28.0
నెల్లూరు	38.1	33.4

ఏపీ నాకు ఎంతో ప్రత్యేకం

- ఇంతటి ప్రేమాభిమానాలను నేనెక్కడా చూడలేదు
- ఏపీలో పనిచేసిన కాలం నా జీవితంలో మర్చిపోలేనిది
- ఇక్కడ సీజేగా పనిచేయడాన్ని ఎంతో ఆస్వాదించా
- ఏపీ హైకోర్టు సీజేగా పనిచేశానని చెప్పుకోవడానికి గర్విస్తా
- రాష్ట్రాన్ని వీడటం ఎంతో బాధగా ఉంది
- రాబోయే రోజుల్లో ఏపీ కోర్టు భవిష్యత్తు ఎంతో అద్భుతంగా ఉంటుంది
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా
- సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులైన నేపథ్యంలో ఆయనకు భారీ సన్మానం



జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు తనపై చూపిన ప్రేమాభిమానాలు చూసి తాను చలించిపోయానని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఇంతటి ప్రేమాభిమానాలను గతంలో తానెక్కడా చూడలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా పనిచేసిన కాలం తన జీవితంలోనే మరిచిపోలేని సమయమని ఆయన తెలిపారు. ఇక్కడ సీజేగా పనిచేయడాన్ని తానెంతో ఆస్వాదించానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తనకెంతో ప్రత్యేకమైనదన్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశానని చెప్పుకోవడానికి తానెంతో గర్విస్తానని కూడా మిశ్రా చెప్పారు. ఏపీని విడిచివెళ్లడం తనకెంతో బాధగా ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన సందర్భంగా జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు హైకోర్టు న్యాయవాదులు శనివారం గుంటూరు పరిధిలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో భారీ సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. జస్టిస్ మిశ్రా, ఆయన సతీమణి సుచేతను హైకోర్టు న్యాయవాదులు, వివిధ జిల్లాల న్యాయవాదులు, హైకోర్టు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, పూర్వ ఏసీజే జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్, అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె. జానకిరామిరెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డిలతో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

వ్యక్తుల కంటే వ్యవస్థ గొప్పది..

సన్మానం అనంతరం జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ సైతం తన సొంత రాష్ట్రమేనన్నారు. తాను ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యే నాటికి హైకోర్టులో కొన్ని క్లిష్టమైన సమస్యలున్నాయని, వాటిని తన సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగుల సహకారంతో పరిష్కరించానన్నారు. వ్యక్తుల కంటే వ్యవస్థ గొప్పదని, మంచి వ్యవస్థని తయారుచేస్తే మంచి వ్యక్తులు తయారవుతారని తెలిపారు. హైకోర్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రధాన న్యాయమూర్తిగా తనకున్న ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించానన్నారు. ఇక తనకిప్పుడు న్యాయవాదులు చేసిన ఈ సన్మానాన్ని తన జీవితంలో ఇప్పటివరకు చూడలేదన్నారు. రాబోయే రోజుల్లో ఏపీ హైకోర్టు భవిష్యత్తు ఎంతో అద్భుతంగా ఉంటుందని జస్టిస్ మిశ్రా చెప్పారు. భవిష్యత్తులో తనకు ఏపీ కోసం పనిచేసే అవకాశమివ్వాలని భగవంతుడిని కోరుకుంటున్నానని జస్టిస్ మిశ్రా చెప్పారు.

జస్టిస్ మిశ్రా గొప్ప మానవతావాది..

అంతకుముందు.. ఏసీజే జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ, పేరులో ఉన్నట్లు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటారన్నారు. ఆయన సార్థక నామధేయుడని తెలిపారు. ప్రతీ విషయంపట్ల ఆయనకు ఎంతో లోతైన అవగాహన ఉందన్నారు. ఆయనో గొప్ప మానవతావాదని తెలిపారు. జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. జస్టిస్ మిశ్రాకు ఎన్నో గొప్ప లక్షణాలున్నాయన్నారు. ప్రతీ విషయంలో మంచి చెడుల గురించి గొప్పగా ఆలోచిస్తారని, ఎదుటి వ్యక్తి చెప్పే మాటలను శ్రద్ధగా వింటారని తెలిపారు. అదే సమయంలో కీలక నిర్ణయాలను వేగంగా కూడా తీసుకుంటారని చెప్పారు. జస్టిస్ మిశ్రాను టీం లీడర్‌గా ఆయన అభివర్ణించారు. ఏజీ శ్రీరామ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకిరామిరెడ్డి, అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, సీనియర్ న్యాయవాదులు పి. వీరారెడ్డి, ఎస్ఎస్ ప్రసాద్, కె. చిదంబరం, హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాలరావు తదితరులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా గురించి, ఆయన న్యాయవ్యవస్థకు అందించిన సేవల గురించి మాట్లాడారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

రెగ్యులరైజ్ చేయడంపై కాంట్రాక్టు ఉద్యోగుల హర్షాతిరేకాలు



అత్తిలిలో సీఎం వైఎస్ జగన్, మంత్రి కారుమూరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం నేతలు తదితరులు



అనంతపురం జిల్లాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, కాంట్రాక్టు ఉద్యోగులు

అత్తిలి/కళ్యాణదుర్గం: కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకోవడంపై కాంట్రాక్టు అధ్యాపకులు రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాలోని కాంట్రాక్టు అధ్యాపకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జై జగన్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మంత్రి కారుమూరి చిత్రపటానికీ క్షీరాభిషేకం చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘ నాయకులు ఏడీవీ ప్రసాద్, వి.శ్రీనివాస్, సీహెచ్ సుభాష్‌కుమార్, పీవీవీ నాగరాజు, కేయూబీ రెడ్డి, కె.బాలకిశోర్, ఎస్టీయూ సత్యవతి, శ్యామ్‌కిరణ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు. కాగా, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్‌లో సీఎం జగన్ చిత్రపటానికి ఏపీ ఎన్జీవో సంఘం నేతలు, హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమానికి మంత్రి ఉషశ్రీచరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి డి.చంద్రమోహన్, రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ జాన్సన్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి తదితరులున్నారు.

ఏపీకి నాలుగు జాతీయ జల అవార్డులు

అవార్డులను ప్రదానం చేసిన ఉప రాష్ట్రపతి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి



కేజీబీవీ తరఫున అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్



అవార్డు అందుకుంటున్న ఫ్రెటెర్నా డైరెక్టర్ మల్లారెడ్డి



పురస్కారం అందుకుంటున్న సీసీఎల్ ప్రతినిధి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నాలుగు జాతీయ జల అవార్డులను దక్కించుకుంది. దేశంలో జలసంరక్షణ, యాజమాన్య పద్ధతుల ద్వారా తక్కువ నీటితో అధిక ఆయకట్టుకు నీళ్లందించడం తదితర విధానాలను ప్రోత్సహించడానికి 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. తాజాగా 11 విభాగాల్లో 41 అవార్డులను ప్రకటించగా.. ఆంధ్రప్రదేశ్ నాలుగు అవార్డులను దక్కించుకుంది. నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకు గాను ఉత్తమ రాష్ట్రాల విభాగంలో ఏపీ తృతీయ స్థానంలో నిలవగా.. ఉత్తమ స్కూల్ విభాగంలో నంద్యాల జిల్లాలోని చాగలమర్రి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ) ద్వితీయ స్థానం, పరిశ్రమల విభాగంలో తిరుపతిలోని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ తృతీయ స్థానం దక్కించుకున్నాయి. స్వచ్ఛంద సంస్థల విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన యాక్షన్ ఫ్రెటెర్నాకు ప్రత్యేక ప్రోత్సాహక అవార్డు లభించింది. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ నుంచి రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ జాతీయ జల అవార్డును అందుకున్నారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నుంచి చాగలమర్రి కేజీబీవీ ప్రిన్సిపాల్, సీసీఎల్ ప్రతినిధులు, యాక్షన్ ఫ్రెటెర్నా డైరెక్టర్ మల్లారెడ్డి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. నీటిని సంరక్షించుకోవడం ద్వారానే భవిష్యత్ తరాలను కాపాడుకోగలమన్నారు. జల సంరక్షణను రోజువారీ జీవితంలో అంతర్భాగం చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు కూడా ఇందులో భాగస్వాములు కావాలన్నారు.

2డి, 3డి చిత్రాలు.. డిజిటల్ పాఠాలు

▶ మొదటి పేజీ తరువాయి

జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలలకు సమీపంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ చదివే విద్యార్థులు కూడా వారానికి ఒకసారి ఆయా స్కూళ్లను సందర్శించి సాంకేతిక సమస్యలను పరిష్కరించనున్నారు. ఈ మేరకు స్వచ్ఛందంగా సేవలు అందించేలా ఉన్నత విద్యా మండలి ముందుకు వచ్చింది. చదువులకు అండగా నిలుస్తూ, విద్యార్థుల తలరాతను మార్చేలా నాలుగేళ్లలో విద్యా రంగంపై రూ.59 వేల కోట్లకు పైగా నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించింది.

గూగుల్ అసిస్టెంట్ సదుపాయం


దశాబ్దాలుగా ఉపాధ్యాయులు నల్ల బోర్డుపై తెల్ల చాక్ పీస్‌తో బోధిస్తున్నారు. ఆధునిక విధానాలకు అనుగుణంగా విద్యార్థులు మెరుగ్గా రాణించేలా మనబడి నాడు – నేడు తొలి విడతలో తీర్చిదిద్దిన 5,675 ఉన్నత పాఠశాలలు, ప్లస్ 2 తరగతుల్లో అత్యాధునిక ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) 30,212 తరగతి గదుల్లో అందుబాటులోకి రానున్నాయి. గూగుల్ అసిస్టెంట్ సదుపాయం కలిగిన ఇంటరాక్టివ్ స్మార్ట్ ప్యానెళ్లను ఆరు నుంచి 10వ తరగతి వరకు క్లాస్‌కు ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి స్క్రీన్‌కు ఇరువైపులా నాలుగు అడుగుల పొడవు, వెడల్పుతో గ్రీన్ చాక్‌పీస్ బోర్డులను కూడా అమరుస్తున్నారు. పాఠ్య పుస్తకాల్లో, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల్లో, ఐఎఫ్‌పీ స్క్రీన్లలో ఒకే కంటెంట్ ఉండడంతో విద్యార్థికి మెరుగైన బోధన అందేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం నాడు – నేడు రెండో విడతలో మరో 15 వేల పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇందులో 3,800 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పనులు పూర్తయిన వాటిల్లో ఐఎఫ్‌పీ స్క్రీన్లు ఏర్పాటు చేసి డిసెంబర్ నాటికి అన్ని స్కూళ్లలోను డిజిటల్ స్క్రీన్లు అందుబాటులోకి తేనున్నారు.

మరో 10,038 పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు

మనబడి నాడు–నేడు ద్వారా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యా బోధనను రాష్ట్ర ప్రభుత్వం నవీకరించింది. ప్రాథమిక పాఠశాలకు ఒకటి చొప్పున 10 వేల స్మార్ట్ టీవీలను అందించి గతేడాది ఇంగ్లిష్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చింది. వీడియో పాఠాల ద్వారా బోధనతో మెరుగైన ఫలితాలు రావడంతో ఇప్పుడు కొత్తగా 10,038 ప్రాథమిక స్కూళ్లకు అంతే సంఖ్యలో స్మార్ట్ టీవీలను డిజిటల్ కంటెంట్‌తో ఏర్పాటు చేస్తోంది. మూడో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది 'టోఫెల్- ప్రైమరీ' శిక్షణ అందిస్తున్న నేపథ్యంలో అందుకు అవసరమైన కంటెంట్‌ను వీడియో, ఆడియో రూపంలో స్మార్ట్ టీవీల ద్వారా బోధించనున్నారు. ఇక నాడు – నేడు రెండో దశలో పనులు జరుగుతున్న మరో 11,200 ప్రాథమిక పాఠశాలల్లోనూ డిసెంబర్ నాటికి స్మార్ట్ టీవీలు రానున్నాయి.



ఇక్కడ కనిపిస్తున్నది కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం అయోధ్య రామాపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని తరగతి గది. తరగతి గదుల్లో బోధన అందిస్తూ, అక్కడే చదువుకుని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చూపించి పిల్లల్లో పోటీ తత్వాన్ని పెంచుతున్నారు. ఇదే మండలంలోని ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైతం ఐఎఫ్‌పీ స్క్రీన్ డిజిటల్ బోధన ప్రారంభమైంది.



ఇది పల్నాడు జిల్లా క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్‌లోని తరగతి గది. విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన కోసం 165 సెం.మీ వైశాల్యం కలిగిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) బోర్డును సిద్ధం చేశారు. దీనికి 256 జీబీ డేటా పాఠ్యాంశాలతో ఎస్డీ కార్డును అనుసంధానించి స్మార్ట్ బోధన నిర్వహించవచ్చు. ఒకపక్క స్క్రీన్‌పై వీడియో పాఠాన్ని విద్యార్థులు చూస్తుండగా.. మరోపక్క అదే స్క్రీన్‌పై సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేయవచ్చు, పాఠాలను రికార్డు చేయవచ్చు, అవసరమైన వాటిని నేరుగా ప్రింట్ తీసుకోవచ్చు.

నాడు భయం.. నేడు భద్రతకు భరోసా

సాక్షి, అమరావతి: ఆధునిక సాంకేతికతతో బలోపేతమైన పోలీసు వ్యవస్థ.. పెరిగిన భద్రత.. తగ్గిన నేరాలు.. నేరస్తులకు సత్వర శిక్షలు.. వెరసి ప్రజలకు పూర్తి భరోసా.. ఇదీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పు. శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ప్రజల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న వినూత్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. దిశ యాప్ జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించి ఇతర రాష్ట్రాలకు మార్గనిర్దేశం చేస్తోంది. రాష్ట్రంలో నేరాలు తగ్గాయని, భద్రత పెరిగిందని జాతీయ నేర గణాంక సంస్థ(ఎన్సీఆర్‌బీ) నివేదికలు వెల్లడిస్తున్నాయి. జాతీయ స్థాయిలో 36 అవార్డులు సాధించడం రాష్ట్ర పోలీసుల సమర్థ పనితీరుకు నిదర్శనం. పూర్తి భద్రతతో ప్రజలు సంతోషంగా ఉండటం మాత్రం ప్రతిపక్ష నేత చంద్రబాబుకు నిద్ర లేకుండా చేస్తోంది. టీడీపీకి కొమ్ముకాసే పచ్చ పత్రికలకూ కంటగింపుగా మారింది. అందుకే రాష్ట్రంలో భద్రతపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నారు. విశాఖపట్నంలో ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌ను గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించి కిడ్నాపర్లను అరెస్టు చేయడం పట్ల అంతటా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. కానీ పచ్చ మీడియా మాత్రం వక్రీకరణలతో అక్కసు వెళ్లగక్కుతుండటం దిగజారుడు పాత్రికేయ విలువలకు అద్దం పడుతోంది. కానీ ఎన్సీఆర్‌బీ నివేదికలు, ప్రజల సంతృప్తికర స్థాయి అసలు వాస్తవాలను వెల్లడిస్తున్నాయి.

శాంతిభద్రతలు భేష్

గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలను పూర్తిగా గాలికొదిలేసింది. రాష్ట్ర స్థాయి నుంచి పోలీస్ స్టేషన్ స్థాయి వరకు ఎక్కడా సరైన పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండేవి కావు. దాంతో 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో అల్లరి మూకలు, రౌడీ గ్యాంగ్‌లు, కరడుగట్టిన నేరస్తులు చెలరేగిపోయారు. నేరాల రేటు పెరుగుతున్నా సరే నియంత్రణ చర్యలే లేకుండా పోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. నేరాల కట్టడికి పోలీసు యంత్రాంగాన్ని వ్యవస్థాగతంగా బలోపేతం చేసింది. తత్ఫలితంగా రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో అన్ని రకాల నేరాలు గణనీయంగా తగ్గాయి. అందుకు ఎన్సీఆర్‌బీ గణాంకాలే నిదర్శనం.

మహిళా భద్రతకు దిశా నిర్దేశం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పోలీసు శాఖ ప్రవేశపెట్టిన దిశ యాప్, దిశ వ్యవస్థ మహిళా భద్రతకు పూర్తి భరోసానిస్తున్నాయి. దిశ యాప్ ద్వారా ఎవరైనా సంప్రదించిన 5–10 నిమిషాల్లోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ కల్పిస్తున్నారు. ఈ యాప్ ద్వారా ఇప్పటి వరకు 1.24 లక్షల ఎస్‌వోఎస్ కాల్స్ వచ్చాయి. కొత్తగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు పరీక్షించడానికి ఒకటి రెండుసార్లు ఎస్‌వోఎస్ బటన్ నొక్కి చూస్తారు. అటువంటివి కాకుండా పోలీసులు చర్యలు తీసుకోదగ్గ 28,585 కాల్స్ వచ్చాయి. వీటికి పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఆపదలో ఉన్న 2,300 మంది మహిళలకు తక్షణం భద్రత కల్పించారు. 423 మందిని వారి ఇంటికి సురక్షితంగా చేర్చారు. దిశ యాప్ ద్వారా సగటున రోజూ 250 కాల్స్ రావడం ఈ వ్యవస్థ పట్ల మహిళల్లో ఏర్పడిన భరోసాకు నిదర్శనం.

నేరస్తులకు సత్వరం శిక్షలు

నేరాలకు పాల్పడే వారికి సత్వరం శిక్షలు విధించేలా చేయడంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అందుకోసం 2022 జూన్ నుంచి పోలీస్ స్టేషన్ల వారీగా ప్రత్యేకంగా కార్యాచరణ చేపట్టింది. పోలీస్ జిల్లా యూనిట్ల అధికారులకు అయిదేసి చొప్పున కేసులను అప్పగించి దర్యాప్తును సత్వరం పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేసేలా పర్యవేక్షించింది. న్యాయ స్థానాల్లో నేరాన్ని నిరూపించి దోషులకు శిక్షలు పడేలా చేస్తోంది. ఇలా పరిష్కరించిన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.

పర్యవేక్షణకు చేపట్టిన మొత్తం కేసులు :	122
శిక్షలు పడిన కేసులు :	90
విచారణలో ఉన్నవి:	15
విచారణ పూర్తయి తీర్పు వెలువడాల్సినవి:	4
వివిధ దశల్లో విచారణలో ఉన్నవి:	13

శిక్షలు ఇలా..

■ మరణశిక్షలు:	3
■ జీవిత ఖైదులు:	35
■ 20 ఏళ్ల జైలు శిక్షలు:	21
■ పదేళ్ల జైలు శిక్షలు:	26
■ ఏడేళ్ల జైలు శిక్షలు:	5

ఎస్ఐ, సీఐ, డీఎస్పీలకు పదేసి చొప్పున కేసులు అప్పగించి.. వాటి దర్యాప్తు, విచారణను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. దాంతో దోషులకు సత్వరం శిక్షలు పడేట్టు చేస్తున్నారు. ఆ వివరాలు ఇలా..

■ కేటాయించిన కేసులు:	10,619
■ దర్యాప్తు పూర్తయినవి:	956
■ శిక్షలు పడినవి :	679
■ నిర్దోషులుగా తేలినవి:	216
■ లోక్‌సత్తా ద్వారా రాజీపడినవి:	61
■ శిక్షలు పడిన కేసుల శాతం:	71

నేరాలు	టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014 జూన్-2019 మే)	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో (2019 జూన్-2023 జూన్)
హత్యలు	4,928	3,588
క్షణికావేశంలో చేసిన హత్యలు	560	455
ఘర్షణలు	3,022	2,069
కిడ్నాపులు	5,263	4,026
దాడులు	85,158	72,393
హత్యాయత్నాలు	9,654	6,091
సామూహిక అత్యాచారాలు	130	101
దోపిడీ హత్యలు	229	160
రాబరీ	1,767	1,141
పగటిపూట ఇళ్ల దొంగతనాలు	3,883	2,842
రాత్రి పూట ఇళ్ల దొంగతనాలు	15,825	11,894
దొంగతనాలు	70,125	51,546

ఏడాదికి సగటున నేరాల సంఖ్య ఇలా..

నేరాలు	టీడీపీ ప్రభుత్వంలో	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
హత్యలు	821	717
క్షణికావేశంలో చేసిన హత్యలు	93	91
ఘర్షణలు	503	413
కిడ్నాపులు	877	805
దాడులు	17,031	14,478
హత్యాయత్నాలు	1,609	1,218
సామూహిక అత్యాచారాలు	27	20
దోపిడీ హత్యలు	38	32
రాబరీ	294	228
పగటిపూట ఇళ్ల దొంగతనాలు	647	568
రాత్రి పూట ఇళ్ల దొంగతనాలు	2,637	2,378
దొంగతనాలు	11,687	10,309

దిశ యాప్ ద్వారా సమస్యల పరిష్కారం ఇలా..

పరిష్కరించిన విధానం	పరిష్కరించిన సమస్యలు
కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్	12,433
ఇతరులకు కౌన్సెలింగ్	10,890
ఎఫ్ఐఆర్ నమోదు	2,754
ఫిర్యాదు చేసేందుకు సమ్మతించనివి	1,663
తప్పిపోయిన వారిని తిరిగి కుటుంబానికి చేర్చడం	242
తప్పుడు సమాచారం/ఫిర్యాదులు	266
సివిల్ వివాదాలు	169
మానసికంగా ఆరోగ్యవంతులుకాని వారిని సురక్షితంగా ఇంటికి చేర్చడం	100
సురక్షితంగా ఇంటి వద్దకు చేర్చడం	42
పెండింగ్	26
మొత్తం	28,585

క్లుప్తంగా...

పూరి రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఒడిశాలోని పూరిలో ఈ నెల 20 నుంచి జరిగే రథ యాత్రకు వెళ్లే యాత్రికుల సౌకర్యం కోసం ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ప్రకటించారు. సికింద్రాబాద్–మాలతిపట్‌పూర్ (07058) ఆదివారం రాత్రి 9.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 6.15 గంటలకు మాలతిపట్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07059) ఈ నెల 19న రాత్రి 11 గంటలకు మాలతిపట్‌పూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. అలాగే నాందేడ్–ఖుర్ధారోడ్ (07063) ఈ నెల 19న మధ్యాహ్నం 2.20 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు ఖుర్ధారోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07064) ఖుర్ధారోడ్‌లో 20వ తేదీ ఉదయం 6.30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 9.30 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది. అలాగే కాచిగూడ–మాలతిపట్‌పూర్ (07056) ఈ నెల 21న కాచిగూడలో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 6.30 గంటలకు మాలతిపట్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07070) ఈ నెల 22న రాత్రి 11 గంటలకు మాలతిపట్‌పూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 10.20 గంటలకు కాచిగూడ చేరుతుంది.

నేడు, రేపు పలు రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ)/తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సౌత్ ఈస్టన్ రైల్వేలోని ఖరగ్‌పూర్–భాద్రక్ సెక్షన్‌లో జరుగుతున్న ట్రాక్ పునరుద్ధరణ పనుల కారణంగా ఆయా మార్గంలో నడిచే రైళ్లను అధికారులు రద్దు చేశారు. ఆదివారం షాలీమార్–హైదరాబాద్ (18045/18046), సత్రగచ్చి–తిరుపతి (22855), గౌహతి–సికింద్రాబాద్ (02605), హౌరా–పుదుచ్చేరి (12867), చెన్నై సెంట్రల్–సత్రగచ్చి (22808), మైసూర్–హౌరా (22818) రైళ్లు రద్దు అయ్యాయి. ఈ నెల 19న తిరుపతి–సత్రగచ్చి (22856), సికింద్రాబాద్–అగర్తల (07030), యర్నాకులం–హౌరా (22878) రైళ్లను రద్దు చేశారు.

వందేభారత్ రీషెడ్యూల్

విశాఖలో శనివారం ఉదయం 5.45 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం– సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.10 గంటలకు బయల్దేరింది. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి శుక్రవారం రాత్రి 11 గంటలకు విశాఖపట్నం చేరాల్సి ఉండగా సుమారు 10 గంటలు ఆలస్యంగా శనివారం ఉదయం 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. అందువల్ల విశాఖ నుంచి సుమారు 8 గంటలు ఆలస్యంగా బయల్దేరింది.

జవాబుదారీ పాలన అందిస్తాం: పవన్‌కళ్యాణ్




మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

బాలాజీచెరువు(కాకినాడసిటీ): జనసేన జవాబుదారీ పాలన అందిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చెప్పారు. జనసేన అధికారంలోకొస్తే పాలనలో స్వచ్ఛత, బాధ్యత, పారదర్శకత, సుపరిపాలన అనే మూడు అంశాలు ప్రామాణికంగా ఉంటాయన్నారు. వారాహి యాత్రలో భాగంగా నాలుగో రోజు జిల్లా కేంద్రం కాకినాడలో శనివారం నగర ప్రముఖులు, మేధావులతో పవన్‌కళ్యాణ్ ప్రజావాణి నిర్వహించారు. పలు రంగాలకు చెందిన వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరించాక.. పార్టీ నేతలతో భేటీ అయ్యారు. అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే పార్టీ విధానపరమైన నిర్ణయాలుంటాయని చెప్పారు. జయలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ బాధితులు పవన్‌ను కలిసి తమకు జరిగిన నష్టాన్ని వివరించారు. కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌ది పూటకో మాట

- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: పూటకో మాట.. ప్రాంతానికో మాట మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో కమెడియన్‌లా మారిపోయారని ఆంధ్రప్రదేశ్ కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి ఎద్దేవా చేశారు. ఆయన శనివారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పవన్ తీరు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ యాత్ర చేస్తున్నారని, బాబు ఇచ్చిన స్క్రిప్ట్‌నే చదువుతున్నారని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగనన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎం జగన్‌ను తలుచుకుంటేనే చంద్రబాబు, పవన్ వణికిపోతున్నారన్నారు. ఓటుకు కోట్లు కేసుతో హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చిన చంద్రబాబు అవినీతి, అక్రమాలను పవన్ ఏనాడైనా ప్రశ్నించారా.. అని నిలదీశారు. రాష్ట్రంలో నూతన విధానంతో పారదర్శకంగా ఇసుక ఇస్తున్నామని స్పష్టం చేశారు. గతంలోనే చంద్రబాబు, పవన్ దొంగాట ప్రజలకు అర్థమైంది కాబట్టే 2019 ఎన్నికల్లో వారిని ఘోరంగా ఓడించారని, 2024లోనూ అదే సీన్ రిపీట్ కాబోతోందని అడపా శేషు స్పష్టం చేశారు.

ఇక దస్తావేజులతో పని లేదు

రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో ఈ–స్టాంపులకు శ్రీకారం

సాక్షి, అమరావతి: ఇకపై ఆస్తుల రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్లు వంటి వాటి కోసం దస్తావేజులు (నాన్–జ్యుడిషియల్ స్టాంపులు) వినియోగించాల్సిన అవసరం లేదు. ఈ–స్టాంపుల ద్వారా ఈ పనులన్నింటినీ చేసుకునే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. అంటే రూ.100, రూ.50 ఇతర నాన్–జ్యుడిషియల్ స్టాంపులను స్టాంప్ వెండర్ల వద్ద కొనక్కర్లేదు. ప్రభుత్వం అనుమతించిన కామన్ సర్వీస్ సెంటర్లలో ఎంత డినామినేషన్ కావాలంటే అంతకి ఈ–స్టాంపులను సులభంగా పొందొచ్చు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఈ–స్టాంపింగ్ విధానం పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. ఈ–స్టాంపుల ద్వారా ట్యాంపరింగ్‌కు, అవకతవకలకు ఆస్కారం ఉండదు.

1,200 కామన్ సర్వీస్ సెంటర్లకు అనుమతి

మొదట్లో ప్రయోగాత్మకంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల (అగ్రిమెంట్లు వంటివి) కోసం ఈ–స్టాంపింగ్‌ను అనుమతించారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్లకు సైతం ఈ–స్టాంపింగ్‌ను ప్రభుత్వం అనుమతించింది. ఇందు కోసం 1,200 కామన్ సర్వీస్ సెంటర్లు (ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్లు (ఏసీసీ)–మీ సేవా కేంద్రాలు వంటివి), 200 మంది స్టాంప్ వెండర్లకు ఈ–స్టాంపింగ్ చేసేందుకు లైసెన్సులు ఇచ్చింది. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఈ–స్టాంపింగ్‌కి సంబంధించి ఒక కౌంటర్‌ను ప్రారంభిస్తోంది. ఏసీసీ సెంటర్లు అందుబాటులో లేనివారు, వాటి గురించి తెలియని వారు నేరుగా ఆ కేంద్రాల వద్ద కెళ్లి ఈ–స్టాంపులు పొందొచ్చు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఈ–స్టాంపింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తొలి దశలో మండల కేంద్రాల్లో ఉన్న సచివాలయాల్లో తేవడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఇప్పటికే 30 శాతం రిజిస్ట్రేషన్లు ఈ–స్టాంపింగ్ ద్వారానే..

ఇప్పటికే నెల నుంచి ఈ–స్టాంపింగ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోజూ సగటున 10 వేల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటే అందులో 30 శాతం ఈ–స్టాంపుల ద్వారానే జరుగుతున్నట్లు ఈ విధానాన్ని పర్యవేక్షిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ గుంటూరు డీఐజీ శ్రీనివాస్ తెలిపారు. వచ్చే నెల రోజుల్లో 70 శాతానికిపైగా రిజిస్ట్రేషన్లు ఈ–స్టాంపింగ్ ద్వారానే జరిగేలా చూసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

దస్తావేజుల కంటే ఎక్కువ భద్రత

నాన్–జ్యుడిషియల్ స్టాంపు పేపర్ల కంటే ఈ–స్టాంపులకు ఎక్కువ భద్రత ఉంటుంది. వీటిని ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం.



ఈ–స్టాంప్

పాత తేదీల మీద స్టాంపులు విక్రయించే అవకాశం ఉండదు. దస్తావేజుల వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ ఉండేది కాదు. కానీ ఈ–స్టాంపింగ్ వ్యవస్థ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుంది. ప్రజలు మోసపోవడానికి ఆస్కారం ఉండదు. గతంలో మాదిరిగా దస్తావేజులను అధిక ధరలకు కొనే బాధ కూడా తప్పుతుంది. ఏసీసీ సెంటర్‌కి వెళితే అక్కడ ఒక దరఖాస్తు పూర్తి చేస్తే చాలు.. ఈ–స్టాంపు ఇస్తారు. నాన్–జ్యుడిషియల్ స్టాంప్ పేపర్ల మాదిరిగా రూ.100, రూ.50, రూ.20, రూ.10 ఎంత డినామినేషన్ అయినా ఈ–స్టాంపుల ద్వారా పొందొచ్చు. సుమారు రూ.రెండు లక్షల డినామినేషన్ వరకు ఈ–స్టాంపులు జారీ చేసే అవకాశాన్ని కల్పించారు. పలు బ్యాంకులు సైతం ఈ–స్టాంపింగ్‌కి అనుమతి తీసుకుంటున్నాయి. వినియోగదారులు ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం స్టాంప్ డ్యూటీ, ఇతర చార్జీలను కూడా ఇకపై బ్యాంకుల్లో చలానాలుగా కాకుండా ఈ ఏసీసీ కేంద్రాల్లోనే చెల్లించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఈ–స్టాంపింగ్ విధానాన్ని స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ అమలు చేస్తోంది.

ఈ–స్టాంపులతో ఎంతో మేలు

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా రిజిస్ట్రేషన్ల శాఖలో ఈ–స్టాంపుల విధానాన్ని ప్రవేశపెట్టాం. దస్తావేజుల స్థానంలో ప్రజలు వీటిని వినియోగించుకోవచ్చు. నాన్–జ్యుడిషియల్ స్టాంపుల కంటే వీటికే భద్రత ఎక్కువగా ఉంటుంది. ఏసీసీ కేంద్రాలు అందుబాటులో లేని వారు తమకు సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి ఈ–స్టాంపింగ్ అవకాశాన్ని పొందొచ్చు. రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో ఈ విధానం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది.

– వి.రామకృష్ణ, కమిషనర్ అండ్ ఐజీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

పవన్.. ఓసారి సైకియాట్రిస్ట్‌కు చూపించుకో

- నీకు ఏ విషయంలోనూ స్పష్టత లేదు
- ఒకసారి సీఎం అంటావు.. మరోసారి ఎమ్మెల్యే అంటావు
- కుల, మతాలను రెచ్చగొట్టడం తప్పు కాదా?
- మంత్రులు దాడిశెట్టి, చెల్లుబోయిన, మాజీ మంత్రి పేర్నినాని ధ్వజం

తుని/కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/మచిలీపట్నం టౌన్: 'జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఏ విషయంలోనూ స్పష్టత లేదు. ఒకసారి సీఎం పదవికి తగనంటాడు. మరోసారి సీఎం పదవి కావాలంటాడు. ఇంకోసారి అసెంబ్లీలో అడుగు పెడితే చాలంటాడు. ఇలా ఆయన అడగ్గానే ఇవ్వడానికి సీఎం పదవి టీకొట్టులోని టీకప్పు కాదు. ప్రజల మనసులను గెలవాలి. ప్రజల బాగు కోసం అహర్నిశలు కష్టపడాలి. ఎవరికోసమో ఊడిగం చేస్తే సీఎం పదవి ఎలా వస్తుంది?' అని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. చంద్రబాబు కోసం పరితపిస్తూ.. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న పవన్‌ను జనసేన కార్యకర్తలు సైకియాట్రిస్ట్‌కు చూపించాలని సలహా ఇచ్చారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ పవన్ తీరుపై నిప్పులు చెరిగారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

ముందు గాజు గ్లాస్ వెతుక్కో



జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పార్టీ సింబల్ అయిన గాజు గ్లాసు గుర్తు పోయింది. ముందు దాని సంగతి చూసుకుంటే బావుంటుంది. మూడు రోజుల క్రితం చెప్పులు పోతే పవన్ కళ్యాణ్ కంగారు పడుతున్నారు. నాది ఒక చెప్పు గత అక్టోబర్ 18వ తేదీన లింగమనేనికి చెందిన వెంకటేశ్వరస్వామి గుడి వద్ద పోయింది. అలా అని.. ఆ ఎదురుగానే పవన్‌కళ్యాణ్ ఆఫీసు ఉందని ఆయన్ని అనుమానిస్తామా? చెప్పులు పోయాయని చెబితే ఎవరో ఒక నిర్మాత కొనిస్తాడు. అంతకంటే ముందు పార్టీ సింబల్ గాజు గ్లాస్ ఎక్కడ పోయిందో వెతుక్కో. బయటకు వచ్చినప్పుడు ఏదిపడితే అది మాట్లాడకుండా కొంచెం బుర్ర ఉపయోగిస్తే బాగుంటుంది.

– పేర్ని వెంకట్రామయ్య (నాని), మాజీ మంత్రి

ఇలాగైతే నీ బాస్ ప్యాకేజీ తగ్గిస్తారు



కాపులకు బలమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు రోజుల పాటు వారాహి వాహనంపై కత్తిపూడి, పిఠాపురంలో బహిరంగ సభలు పెట్టి కులాలు, మతాలను రెచ్చగొడుతూ మాట్లాడటం తగదు. నీ మాటలు వింటున్న జనసైనికులే పవన్‌కు ఏమైందని తల పట్టుకుంటున్నారు. చంద్రబాబు స్క్రిప్టును నేరుగా వండి వార్చితే బాగోదనుకుని ఇలా డొంకతిరుగుడు వ్యాఖ్యలు చేస్తున్నావా? ఎమ్మెల్యే ఏడు కొండలు, భరత్ అనే నేను.. సినిమాలను ఊహించుకొని.. రెండు సభలు పెడితే పట్టుమని 3 వేలమంది జనం రాలేదు. ఇలాగైతే నీ బాస్ నీ ప్యాకేజీ తగ్గిస్తారు. నువ్వు సీఎం కావాలనుకుంటే సరిపోదు. జనం అనుకోవాలి. జనం నిన్ను కోరుకోవడం లేదని ఇప్పటికే స్పష్టంగా అర్థమైంది. మేం మంచి చేసి ఉంటేనే మాకు ఓటు వేయండి అని సీఎం వైఎస్ జగన్ ధైర్యంగా అడుగుతున్నారు. ఇంత ధైర్యంగా నువ్వు, నీ చంద్రబాబు అడగ్గలరా? అమరావతి గురించి మాట్లాడే నువ్వు, చంద్రబాబు.. భార్యాపిల్లలతో ఒక్కరోజైనా అక్కడ గడిపారా?

– దాడిశెట్టి రాజా, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి

స్క్రిప్టు చదివే ముందు సరిచూసుకో



జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిచ్చి మాటలు, చేష్టలతో రాష్ట్ర ప్రజలను భయపెట్టాలని చూడటం దారుణం. నిలకడలేని విధానంలో వెళ్తూ పిచ్చి పట్టినట్లు ప్రవర్తిస్తున్నారు. కుటిల రాజకీయానికి చిరునామా చంద్రబాబు అయితే.. అందుకు పవన్ వంత పాడుతున్నారు. లోకేశ్ పాదయాత్రకు మైలేజీ రాదని.. వారాహి యాత్రకు బ్రేక్‌లు వేయించిన విషయాన్ని కూడా పవన్ గమనించలేకపోయాడు. సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్న పవన్.. శ్రీరాముడి పద్ధతిలో నడుచుకుంటున్నాడా? పేదవాడి పక్షాన నిలిచి 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన అసలు సిసలైన నాయకుడు ముఖ్యమంత్రి జగన్. రోజుకో వేషం వేస్తూ పూటకో మాట మాట్లాడుతున్న పవన్‌ను ప్రజలు నమ్మే అవకాశమే లేదు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివే ముందు ఒకసారి సరిచూసుకుంటే బావుంటుంది. తొక్కతీస్తా, తోలు తీస్తా అంటే ఇక్కడ భయపడేవారెవరూ లేరు.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

తెలంగాణ

సవాళ్లు ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలి

- యుద్ధ క్షేత్రంతోపాటు సహాయ సేవల్లోనూ మన వాయుసేన భేష్
- దుండిగల్‌లో 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరేడ్'లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



కేడెట్‌కు అవార్డు అందిస్తున్న రాష్ట్రపతి ముర్ము

సాక్షి, హైదరాబాద్: భూమి, సముద్రం, గగనతల రక్షణలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సాయుధ దళాలకు చెందిన ప్రతి అధికారి సిద్ధంగా ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. భారత వాయుసేనలో మహిళల సంఖ్య పెరుగుతుండటం, ఫైటర్ జెట్ పైలట్లలోనూ మహిళలు ఉండటం సంతోషకరమన్నారు. శనివారం హైదరాబాద్ శివారులోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన 'కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్'కు రివ్యూయింగ్ ఆఫీసర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. మొత్తం 119 ఫ్లయింగ్ ఎయిర్ ట్రైనీ, 75మంది గ్రౌండ్ డ్యూటీ ట్రైనీ కేడెట్లు, నేవీ, కోస్ట్‌గార్డ్‌కు చెందిన మరో ఎనిమిది మంది అధికారులు, వియత్నాంకు చెందిన ఇద్దరు అధికారులు ఈ పరేడ్‌లో పాల్గొన్నారు. కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో రాష్ట్రపతి రివ్యూయింగ్ ఆఫీసర్‌గా పాల్గొనడం వాయుసేన చరిత్రలో తొలిసారి కావడం విశేషం. కేడెట్ల నుంచి రాష్ట్రపతి ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చినవారిని అవార్డులతో సత్కరించారు.

వైమానిక దళం ఎంతో సేవ చేసింది

భారత వాయుసేనలో ఉద్యోగ జీవితం సవాళ్లతో కూడుకోవడంతోపాటు ఎంతో గౌరవప్రదమైందని రాష్ట్రపతి చెప్పారు. దేశసేవకోసం తమ పిల్లలను పంపిన తల్లిదండ్రులకు, కేడెట్లను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన అకాడమీ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. సుఖోయ్ యుద్ధ విమానంలో భూమి నుంచి 2 కిలోమీటర్ల ఎత్తులో, గంటకు 800 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించడం తనకు గొప్ప అనుభూతిని ఇచ్చిందని గుర్తుచేసుకున్నారు. '1948, 1965, 1971లలో జరిగిన యుద్ధాల్లో దేశాన్ని రక్షించడంలో భారత వైమానిక దళానికి చెందిన వీరులు పోషించిన గొప్ప పాత్ర సువర్ణాక్షరాలతో లిఖించబడింది. కార్గిల్ పోరాటంలో, బాలాకోట్‌లోని ఉగ్రవాద స్థావరాన్ని నాశనం చేయడంలో అదే సంకల్పాన్ని, నైపుణ్యాన్ని చూపారు. అందుకే భారత వైమానిక దళానికి వృత్తి నైపుణ్యం, అంకితభావానికి మారుపేరన్న ఖ్యాతి ఉంది. విపత్తుల సమయంలో మానవత్వంతో సాయం చేయడంలోనూ భారత వాయుసేనకు గొప్ప పేరుంది' అని రాష్ట్రపతి ముర్ము చెప్పారు. భవిష్యత్ యుద్ధరంగంలో అత్యాధునిక సాంకేతికత ముఖ్య భూమిక పోషిస్తుందని. ఈ నేపథ్యంలో రఫెల్ యుద్ధ విమానాలు, చినోక్ హెవీ లిఫ్ట్ చాపర్ల వంటి సాధన సంపత్తిని వాయుసేన సమకూర్చుకుంటోందని చెప్పారు.

ఆకట్టుకున్న ఎయిర్ షో

పరేడ్ అనంతరం నిర్వహించిన ఎయిర్‌షో ఆకట్టుకుంది. పిలాటస్ పీసీ–7 ట్రైనర్ ఎయిర్ క్రాఫ్ట్, సుఖోయ్ ఎస్‌యూ–30, సారంగ్ హెలికాప్టర్లు, సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందాల గగనతల ప్రదర్శనలు అలరించాయి. గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు.

ఏసీబీ వలలో తెలంగాణ వర్సిటీ వీసీ

- డిగ్రీ పరీక్ష కేంద్రం కేటాయింపు కోసం రూ.50 వేలు డిమాండ్
- ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏసీబీకి పట్టుబడిన మొదటి వీసీ



హైదరాబాద్ : తెలంగాణ యూనివర్సిటీని వివాదాలకు కేంద్ర బిందువుగా మార్చిన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి రవీందర్ గుప్తా శనివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పదవిలో ఉన్న వీసీ ఏసీబీకి పట్టుబడటం ఇదే తొలిసారి. తెలంగాణ వర్సిటీ పరిధిలోని అనుబంధ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటుకు అనుమతి పేరిట హైదరాబాద్, తార్నాకలోని తన నివాసంలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ వీసీ రవీందర్ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ టి సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన దాసరి శంకర్‌కు శ్రీ షిర్డీ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఉంది. సొసైటీ ఆధ్వర్యంలో భీంగల్‌లో సాయిసిద్ధార్థ డిగ్రీ కాలేజీ నడుపుతున్నారు. భీంగల్‌లో సాయిసిద్ధార్థ కాలేజీతో పాటు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో పరీక్ష కేంద్రాలు కొనసాగేవి. ఒక కాలేజీకి చెందిన విద్యార్థులు మరో కాలేజీ పరీక్ష కేంద్రంలో (జంబ్లింగ్) పరీక్షలు రాసేవారు. అయితే ఈసారి జూన్ మొదటివారం వచ్చిన సాయిసిద్ధార్థ కాలేజీకి పరీక్ష కేంద్రానికి అనుమతి రాలేదు. దీనిపై దాసరి శంకర్ వీసీ రవీందర్‌ను కలిసి.. ఎప్పటిలాగే తమ కాలేజీకి పరీక్ష కేంద్రం కేటాయించాలని కోరగా, అందుకు రూ. 50 వేలు ఇవ్వాలని వీసీ డిమాండ్ చేశారు. దీంతో శంకర్ ఏసీబీ అధికారులను సంప్రదించారు. వారి సూచన మేరకు శంకర్ శనివారం ఉదయం హైదరాబాద్ తార్నాకలోని వీసీ నివాసానికి వెళ్లి రూ.50 వేలు అందజేశారు. వెంటనే ఏసీబీ అధికారులు దాడి చేసి వీసీ రవీందర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ఆ డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 8 గంటలపాటు ఆరుగురు ఏసీబీ అధికారుల బృందం వీసీ ఇంట్లోని బీరువా లాకర్లు, విలువైన పత్రాలతో పాటు ఆయన అధికారిక వాహనంలోనూ క్షుణ్ణంగా సోదాలు చేసింది. అనంతరం వీసీని అరెస్టు చేసి సాయంత్రం ఏసీబీ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్‌జడ్జి ఎదుట హాజరు పరిచింది.

బోర్డు తిప్పేసిన జ్యూయలరీ వ్యాపారులు

బంగారు నగల పేరుతో రూ.5 కోట్లకు టోకరా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కాట్రేనికోన: బంగారు ఆభరణాల పేరుతో సొమ్ములు వసూలు చేసి, బోర్డు తిప్పేశారు ఆ నగల వ్యాపారులు. బాధితుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనకు చెందిన అత్తిలి శ్రీకాంత్, ఆయన సోదరుడు రామలక్ష్మి జ్యూయలరీస్ పేరుతో వ్యాపారం మొదలు పెట్టారు. బంగారు నగల పేరుతో మండలంలోని సుమారు 300 మంది ఖాతాదార్ల నుంచి దఫాదఫాలుగా సుమారు రూ.5 కోట్ల వరకూ కట్టించుకున్నారు. వారికి నకిలీ రశీదులు ఇచ్చారు. ఎంతకూ బంగారం ఇవ్వకపోవడంతో కొంతమంది ఆ వ్యాపారులను నిలదీశారు. ఈ నేపథ్యంలో ఆస్తులు అమ్మి డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లిస్తామని ఆ వ్యాపారులు వారిని నమ్మించారు. కాగా, గుట్టు చప్పుడు కాకుండా తమకున్న 18 సెంట్ల భూమిని రూ.80 లక్షలకు, ఇంటిని రూ.95 లక్షలకు, షాపును రూ.35 లక్షలకు అమ్మేశారు. ఇదిలా ఉండగా సొమ్ములు చెల్లించి మూడేళ్లు గడిచినా బంగారం ఇవ్వకపోవడంతో శనివారం సుమారు 100 మంది ఆ వ్యాపారులను ఇంటికి వెళ్లి నిలదీశారు. ఈ నేపథ్యంలో వారితో ఆ ఇంటిని కొనుగోలు చేసిన వ్యక్తి వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ బంగారు వ్యాపారులు తమను మోసం చేశారని, తమకు న్యాయం చేయకుంటే పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని పేర్కొంటూ పెట్రోలు సీసాలతో బాధితులు అక్కడ నిరసన తెలిపారు. డిపాజిట్లతో పాటు కొంత మంది నుంచి భారీగా అప్పు తీసుకొని చెల్లించలేదని పోలీసుల వద్ద వాపోయారు. జ్యూయలరీ వ్యాపారి శ్రీకాంత్‌తో పాటు ఇంటిని కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెల్లించిన సొమ్ముకు సంబంధించిన రశీదులను, ఖాళీ చెక్కులను పోలీసులకు బాధితులు చూపించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఖాతాదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై టి.శ్రీనివాస్ చెప్పారు.

ప్రజల అజెండాతో పని చేయడం పత్రికల కర్తవ్యం

మాజీ మంత్రి కురసాల కన్నబాబు



మాట్లాడుతున్న కన్నబాబు

మొగల్రాజపురం (విజయవాడతూర్పు): ప్రజల అజెండాతో పని చేయడం పత్రికల ప్రధాన కర్తవ్యమని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సులో భాగంగా శనివారం వర్చువల్ విధానంలో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కన్నబాబు 'మాధ్యమాలు–ప్రజల అజెండా' అనే అంశంపై మాట్లాడారు. తమకు అనుకూలమైన ప్రభుత్వాలు ఉంటే ఒక అజెండాతో, లేకపోతే మరో అజెండాతో వ్యవహరించడం కొన్ని పత్రికలకు అలవాటుగా మారిందని చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రతివారం కలెక్టరేట్ల ముందు గతంలో ధర్నాలు చేసిన వామపక్షాలు, అమరావతిలో పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని మాత్రం వ్యతిరేకించడాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలని కన్నబాబు ప్రశ్నించారు. 'సృజనాత్మక జర్నలిజం' అనే అంశంపై ఢిల్లీ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ బొల్లా జ్యోత్స్న ఫణిజా మాట్లాడుతూ ప్రజల మనసులో చిరకాలం గుర్తుండేలా వార్తలు రాయడమే సృజనాత్మక జర్నలిజం అని వివరించారు. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డి పాల్గొన్నారు.

గోపాలపురంలో టీ'ఢీ'పీ

- నియోజకవర్గంలో తారస్థాయికి వర్గ విభేదాలు
- ముప్పిడి, మద్దిపాటి వర్గాల మధ్య భగ్గుమంటున్న అసంతృప్తులు
- ముప్పిడికి నియోజకవర్గ ఇన్‌చార్జి ఇవ్వాలని పట్టు
- అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- నాలుగు మండలాల నేతలతో అర్ధరాత్రి వరకూ సమావేశం
- మద్దిపాటి వర్గంపై తిరుగుబాటుకు సమాయత్తం



గోపాలపురంలో శుక్రవారం అర్ధరాత్రి వరకూ సమావేశమైన ముప్పిడి వర్గీయులు

సాక్షి, రాజమహేంద్రవరం/దేవరపల్లి: టీడీపీ గోపాలపురం నియోజవర్గ నేతల్లో విభేదాలు తారస్థాయికి చేరాయి. మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతూండటంతో ఇరు వర్గాల మధ్య కుమ్ములాటలు మొదలయ్యాయి. పార్టీ వ్యవహారాల్లో ఇద్దరికి పొసగడం లేదు. ఎవరికి వారే అన్న చందంగా వేరు కుంపట్లు పెట్టారు. మద్దిపాటిని ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించి ముప్పిడి కట్టబెట్టాలన్న డిమాండ్ తెర పైకి వస్తోంది. దీని కోసం ఎంతవరకైనా వెళ్లేందుకు ముప్పిడి వర్గం సిద్ధంగా ఉంది. చివరికి పార్టీ అధినేతతో తాడోపేడో తేల్చుకునేందుకైనా వెనుకాడటం లేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దేవరపల్లి మండలం గౌరీపట్నంలో గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ముప్పిడి వర్గీయులు, కార్యకర్తలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన భేటీ అర్ధరాత్రి 12 గంటల వరకూ కొనసాగింది.

మద్దిపాటి వర్గాన్ని ఎదుర్కోవడం, ముప్పిడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్‌పై ప్రధానంగా చర్చ జరిగింది. విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అక్కడ గ్రీన్ సిగ్నల్ రాకపోతే ఎలా వ్యవహరించాలన్న విషయమై భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్టు సమాచారం. గ్రామానికి 50 మంది చొప్పున కార్యకర్తలను ఎంపిక చేసి, ముప్పిడికి మద్దతుగా భారీ స్థాయిలో ఆందోళనలు నిర్వహించాలని, మద్దిపాటి ఒంటెద్దు పోకడను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. వచ్చే ఎన్నికల్లో మద్దిపాటికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే తీవ్ర పరిణామాలు తప్పవని, ఆయనను చిత్తుగా ఓడించేందుకైనా వెనుకాడరాదని నిర్ణయించినట్టు తెలిసింది. అనంతరం గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి మద్దిపాటికి టికెట్ ఇవ్వవద్దంటూ వివరించాలని తీర్మానం చేశారు. దేవరపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, ఏలేటి సత్యనారాయణ (నల్లజర్ల), మేడ్ని సుధాకర్ (గోపాలపురం), సుంకవల్లి బ్రహ్మయ్య (ద్వారకా తిరుమల), పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఆది నుంచీ అదే గతి

టీడీపీ అధినేత చంద్రబాబు తీరుతో గోపాలపురం నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లు విసిగిపోతున్నారు. ముందు నుంచీ పార్టీ కోసం పని చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరావును నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించి, ఈ విభేదాలకు చంద్రబాబు ఆజ్యం పోశారు. అప్పటి నుంచీ ఎస్సీ సామాజికవర్గ నేతలు గుర్రుగా ఉన్నారు. పార్టీ ఇన్‌చార్జిగా మద్దిపాటి వెంకట్రాజును నియమించారు. అంతటితో ఆగకుండా వచ్చే ఎన్నికల్లో ఆయనే పోటీ చేస్తారని ప్రకటించారు. దీంతో అగ్గి మరింత రాజుకుంది. తమ నేతను ఎందుకు తప్పించారో స్పష్టం చేయాలని ముప్పిడి వర్గం చంద్రబాబును నిలదీసింది. ముప్పిడి వెంకటేశ్వరావుకు జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మద్దతుగా నిలిచారు. ఈ పంచాయితీ చంద్రబాబు దృష్టికి వెళ్లింది. పరిస్థితిని చక్కదిద్దాల్సిన ఆయన సైతం మద్దిపాటికి మద్దతు తెలపడంతో నియోజకవర్గంలో రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు నేటికీ కొనసాగుతూనే ఉంది. అప్పుడు మొదలైన ముసలం ఇప్పటికీ సమసిపోవడం లేదు. ముప్పిడి, మద్దిపాటిది తలోదారైంది. పార్టీ కార్యకర్తలు, నాయకులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం, ఎన్టీఆర్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలు సైతం ఎవరికి వారు నిర్వహిస్తున్నారు.

ఫలితమివ్వని బాబు యాత్ర

టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు, వైఎస్సార్ సీపీపై బురద జల్లేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు తూర్పు గోదావరి జిల్లాలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'లో కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా సైతం పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు చల్లార్చే ప్రయత్నం చేయలేదు. అప్పట్లో కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లో పర్యటించిన చంద్రబాబు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించడం తప్ప చేసిందేమీ లేదు. కనీసం ఆయన పర్యటించిన నియోజకవర్గాల పరిధిలోనైనా పార్టీ కుమ్ములాటలను చక్కదిద్దిన పాపాన పోలేదు. తమ్ముళ్ల తగవులు తీర్చలేక చేతులెత్తేశారు. కార్యకర్తలు, నాయకులతో రహస్య సమావేశాలు పెట్టుకుని మరీ కలసికట్టుగా ఉండాలని హితబోధ చేసినా నేతల్లో ఎలాంటి మార్పూ లేదు.



మూగవానికిని, దిక్కులేని వారికందరికిని
న్యాయము జరుగునట్లు నీ నోరు తెరువుము.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** అమావాస్య ఉ.8.53 వరకు తదుపరి ఆషాఢ శు.పాడ్యమి, **నక్షత్రం:** మృగశిర సా.5.29 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.2.29 నుండి 4.10 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.46 నుండి 5.38 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.10 నుండి 9.43 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

యోగి ఆదిత్యనాథ్ (యూపీ సీఎం)

రాయని డైరీ


మాధవ్ శింగరాజు

అయోధ్య నుంచి లక్నో తిరిగి వచ్చినప్పటి నుంచి నా మనసు అలజడిగా ఉంది! అయోధ్యలో మనసు ప్రశాంతంగా ఉండి, లక్నోలో ప్రశాంతంగా లేకపోవడం కాదు. అలజడి అయోధ్యలోనే మొదలైంది.

"చూస్తుంటే ఇంకా చాలా పని ఉన్నట్లుగా ఉంది కదా మిశ్రాజీ! డిసెంబర్ 31 లోపు ఆలయ నిర్మాణం పూర్తవుతుందంటారా?" అని నేను అడిగినప్పుడు నాలో ఏ అలజడీ లేదు.

"చూస్తూ ఉండండి యోగీజీ.. డిసెంబర్ 31 లోపు పని పూర్తి చేసేస్తాం. ఇప్పటికే గ్రౌండ్ వర్క్ 70 శాతం, రూఫ్ వర్క్ 40 శాతం పూర్తయింది.." అని నృపేంద్ర మిశ్రా చెప్పినప్పటి నుంచీ నాలో అలజడి మొదలైంది. రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ ఆయన.

జనవరిలో ప్రారంభోత్సవానికి ఒక తేదీ నిర్ణయించమని ఇప్పటికే మోదీజీకి ట్రస్ట్ చైర్మన్ మహంత్ నృత్యగోపాల్ దాస్ విజ్ఞాపన పత్రం పంపారు. మహంత్ పని పూర్తయింది. ముఖ్యమంత్రిగా ఇక నా పనే మిగిలింది. గడువు లోపు నిర్మాణాన్ని పూర్తి చేయించాలి.



అలజడిని తగ్గించుకోడానికి ఇంటి ఆవరణలో ఉన్న గోశాలకు వెళ్లాను. అయినా అలజడి తగ్గలేదు. గోశాల నుంచి మళ్లీ ఇంటికి చేరుకున్నాను.

వరండాలో.. "జై శ్రీరామ్" అని మాట వినిపించింది! ఆ గొంతు లక్నోది కాదు. అయోధ్యది! ఎవరా అని చూశాను. మిశ్రా!

"అరె మిశ్రాజీ.. మీరెప్పుడు వచ్చారు! గంట క్రితమే కదా అయోధ్యలో మనమంతా కూర్చొని ఆలయ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో అంచనాలు వేసుకున్నాం. ఇప్పుడు చూస్తే మీరు లక్నోలో కనిపిస్తున్నారు. నాకేదైనా చెప్పడం మర్చిపోయి నా వెనుకే వచ్చేశారా?" అన్నాను.

"మీకు చెప్పాల్సిందేదీ చెప్పకుండా మర్చిపోలేదు యోగీజీ! చెప్పుకోవలసింది మాత్రం ఒకటి వదిలేశాను. అందుకే మీ వెనుకే వచ్చేశాను..." అన్నారు మిశ్రా!

"చెప్పండి మిశ్రాజీ.." అన్నాను.

"నా లోపల ఏదో తెలియని అలజడిగా ఉంటోంది యోగీజీ! డిసెంబర్‌కి, జనవరికి మధ్య ఏవైనా నాలుగు నెలలు ఉండి ఉంటే బాగుండేది కదా అనిపిస్తోంది.." అన్నారు మిశ్రా!

ఆయన అలజడి ఏ స్థాయిలో ఉందో నేను అర్థం చేసుకోగలిగాను.

"అంటే మిశ్రాజీ... ఆలయం పూర్తవడానికి మరో నాలుగు నెలల సమయం పడుతుందంటారా?!" అని అడిగాను.

"అలా ఏం కాదు యోగీజీ. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి. రామాలయ నిర్మాణం ఎప్పుడు పూర్తయినా ఆ రోజు ప్రారంభించడం బాగుంటుంది కదా అని. పైగా 17వ తేదీ కూడా కలిసొచ్చింది" అన్నారు మిశ్రా.

"17వ తేదీ కలిసిరావడం ఏమిటి మిశ్రాజీ" అని అడిగాను.

"అది మోదీజీ పుట్టిన రోజన్న విషయం మీకు గుర్తుకు రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది యోగీజీ.." అని నవ్వారు మిశ్రా!

మోదీజీ పుట్టిన తేదీ అదే గానీ, మోదీజీ పుట్టిన నెలైతే ఏప్రిల్ కాదు కదా మిశ్రాజీ అని అనబోయి ఆగిపోయాను.

అలజడిలో ఉన్నవారు ఏమైనా మాట్లాడతారు.

"మిశ్రాజీ! డిసెంబరు, జనవరి మధ్య నాలుగు నెలలు ఉండే చాన్స్ ఒక్కటే సరిపోదు. ఏప్రిల్‌లో జనరల్ ఎలక్షన్స్ లేకుండా ఉండే చాన్స్ కూడా ఉండాలి.. మీ అలజడి, నా అలజడి తగ్గడానికి.." అన్నాను.

"మీక్కూడానా అలజడి! ఎందుకు యోగీజీ.." అన్నారు మిశ్రా.

ఆయన్ని మరింత అలజడికి గురి చెయ్యలేక నా అలజడి గురించి చెప్పలేదు.

నేను అయోధ్య వెళ్లిన ప్రతిసారీ మిశ్రా ఎంత శాతం పనైందో చెబుతున్నారు తప్ప, ఎంత శాతం పని మిగిలి ఉందో చెప్పడం లేదు!

ఈ యుద్ధం ఓ వరం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



యుద్ధం అనాగరికం. అమానుషం. యుద్ధం ఒక విధ్వంసం. అది వినాశనానికి విశ్వరూపం. ఆయుధాలతో చేసేది మాత్రమే యుద్ధం కాదు. అధికార బలంతో చేసేది కూడా యుద్ధమే! అధికారం రాజకీయం మాత్రమే కానక్కరలేదు. ఆర్థికం కూడా! సామాజికం, సాంస్కృతికం కూడా! ఈ అంశాల్లో ఆధిపత్యం చలాయించేవాళ్లు సంఘంలో గుప్పెడుమంది మాత్రమే ఉండవచ్చు. వారినే పెత్తందార్లని అంటున్నాము. విశాలమైన సామాన్యుల సమూహం మీద పెత్తందార్లు స్వారీ చేయడం కొత్త విషయం కాదు. ఆర్థిక – సామాజిక – సాంస్కృతిక ఆధిపత్యం అతి ప్రమాదకరమైన ఆయుధం. ఈ ఆయుధాన్ని చూసి మెజారిటీ ప్రజలు ఝుడుస్తూ జీవిస్తారు. ఇటువంటి స్థితినే కొందరు దోపిడీ అన్నారు. పీడన అన్నారు. అణచివేత అన్నారు.

అణచివేతకు గురయ్యేవాడికి యుద్ధం కంటే కొన్నిసార్లు జీవితమే బీభత్సంగా కనిపిస్తుంది. తన జీవితం మీద ఎవరో దండయాత్ర చేస్తున్నట్టూ, దురాక్రమణ చేస్తున్నట్టూ అనిపిస్తుంది. జీవన్మృత్యువేదన గుండెలో కెలుకుతుంది. ఇంతకంటే చావోరేవో తేల్చే సాయుధ రణమే జీవన బృందావనంగా మదిలో మెదులుతుంది. స్పార్టకస్ కాలం నుంచి రెండువేల సంవత్సరాల మానవ ప్రస్థానంలో ఇటువంటి సందర్భాలు చాలానే కనిపిస్తాయి. అప్పుడు యుద్ధంలో విధ్వంసం కాదు, విముక్తి కనిపిస్తుంది. యుద్ధం ఓ వరంలా తోస్తుంది.

సిద్ధాంతపరంగా చూస్తే ప్రజలే ప్రభువులుగా భావించే ప్రజాస్వామ్య వ్యవస్థలో అణచివేత ఉండకూడదు. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వమనే నిట్టూర్పులు వినిపించకూడదు. నిరాశలు వ్యాపించకూడదు. సర్వమానవ సమతా పత్రాన్ని రాజ్యాంగంగా తలదాల్చిన భారతదేశంలో ఈపాటికే అసమానతలు తగ్గుముఖం పట్టి ఉండాలి. పెత్తందారీ భావజాలం మ్యూజియాల్లోకి చేరి ఉండాలి. కానీ అలా జరగలేదు. ఆర్థిక అసమానతలు వెయ్యి రెట్లు పెరిగాయి. ఐక్యరాజ్య సమితి, ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సంస్థల నివేదికలు ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టి చెబుతున్నాయి. సాంఘిక వివక్ష మరింత ఘనీభవించింది. అట్టడుగు వర్గాల ప్రజలు జారుడు మెట్ల మార్గంలో ప్రయాణిస్తున్నారు. అగ్రవర్ణ పేదలు కూడా ఇందుకు మినహాయింపు కాదు.

రాజ్యాంగ ఆశయాలను మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఎందుకు నెరవేర్చలేకపోతున్నది? కారణం... వ్యవస్థల మీద పెత్తందారీ వర్గాలకున్న పట్టు. ఈ ఉడుంపట్టు నుంచి వ్యవస్థలను ప్రజాస్వామ్యీకరించే ప్రయత్నాలు పలుమార్లు జరిగాయి. జాతీయ స్థాయిలో పండిత్ నెహ్రూ కాలంలోనే కొన్ని ప్రయత్నాలు జరిగాయి. కానీ, అప్పటికింకా మన వ్యవస్థలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. పెత్తందారీ వర్గ ప్రయోజనాలపై ఇందిరమ్మ కొంత గట్టి పోరాటమే చేశారు. ఈ వర్గాలన్నీ కలిసి ఎదురుదాడికి దిగడంతో వారిని ప్రతిఘటించడం కోసం ఆమె నియంతగా ముద్ర వేసుకోవలసి వచ్చింది. విశ్వనాథ ప్రతాప్ సింగ్ ఇదే పనిలో విఫలమై పదవీచ్యుతుడయ్యారు. వివిధ రాష్ట్రాల్లోనూ అక్కడక్కడా కొన్ని ఇటువంటి ప్రయత్నాలు జరిగాయి. ఆ మేరకు పేద ప్రజలు కొంత ముందడుగు వేశారు. పేద వర్గాల కోసం నిలబడిన కారణంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి జనప్రియ నాయకులయ్యారు. కానీ, వారు పెత్తందారుల కంటగింపునకు గురికావలసి వచ్చింది.

ఎన్టీ రామారావును పదవీచ్యుతుని చేసిన పెత్తందారీ శక్తులే, రాజశేఖరరెడ్డిని ఓడించడానికి మహాకూటాలు కట్టి విఫలమైన శక్తులే, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డిపై ఓ మహా కుట్రను నడుపుతున్నాయి. పెత్తందారీ వర్గాల బెదిరింపులను లెక్కచేయకుండా జగన్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడటం, రాజ్యాంగ ఆశయాల అమలుకు పూనుకోవడమే ఇందుకు కారణం. ఈ ప్రస్థానంలో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఓ రోల్ మోడల్‌గా మారింది. పేద వర్గాల అభ్యున్నతికి, మహిళల సాధికారతకు ఇంత విస్తృతంగా, ఇంత బహుముఖంగా గతంలో ఎన్నడూ ప్రయత్నాలు జరగలేదు. ఈ ప్రయత్నాలు ఇలానే కొనసాగితే రానున్న నాలుగైదేళ్లలో ఆంధ్రప్రదేశ్ సామాజిక, ఆర్థిక, రాజకీయ పొందికలో గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటాయి. అందువల్ల అక్కడి పెత్తందారీ వర్గాలు రాష్ట్ర ముఖ్యమంత్రిపై ప్రత్యక్షంగా, పేదవర్గాల ప్రజలపై పరోక్షంగా యుద్ధాన్ని ప్రకటించాయి.

ఎన్టీ రామారావును పదవీచ్యుతుని చేసిన పెత్తందారీ శక్తులే, రాజశేఖరరెడ్డిని ఓడించడానికి మహాకూటాలు కట్టి విఫలమైన శక్తులే, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డిపై ఓ మహా కుట్రను నడుపుతున్నాయి. పెత్తందారీ వర్గాల బెదిరింపులను లెక్కచేయకుండా జగన్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడటం, రాజ్యాంగ ఆశయాల అమలుకు పూనుకోవడమే ఇందుకు కారణం. ఈ ప్రస్థానంలో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఓ రోల్‌మోడల్‌గా మారింది. పేద వర్గాల అభ్యున్నతికి, మహిళల సాధికారతకు ఇంత విస్తృతంగా, ఇంత బహుముఖంగా గతంలో ఎన్నడూ ప్రయత్నాలు జరగలేదు. ఈ ప్రయత్నాలు ఇలానే కొనసాగితే రానున్న నాలుగైదేళ్లలో ఆంధ్రప్రదేశ్ సామాజిక, ఆర్థిక, రాజకీయ పొందికలో గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటాయి. అందువల్ల అక్కడి పెత్తందారీ వర్గాలు రాష్ట్ర ముఖ్యమంత్రిపై ప్రత్యక్షంగా, పేదవర్గాల ప్రజలపై పరోక్షంగా యుద్ధాన్ని ప్రకటించాయి.

ఈ యుద్ధాన్ని పేదవర్గాలు కూడా స్వాగతిస్తున్నాయి. పెత్తందార్లను ఓడించడానికి ఇది ఆఖరి మోకాగా వారు భావిస్తున్నారు. ఇక్కడ పెత్తందార్లెవరో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. వారు ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచినవారే! వారు రాజశేఖరరెడ్డిపై దుష్ప్రచారాలు చేసి అడ్డు తొలగించుకోవాలని చూసిన వారే! వారు చంద్రబాబు, రామోజీ అండ్ కో ముఠా సభ్యులే!

ఈ యుద్ధాన్ని పేదవర్గాలు కూడా స్వాగతిస్తున్నాయి. పెత్తందార్లను ఓడించడానికి ఇది ఆఖరి మోకాగా వారు భావిస్తున్నారు. ఇక్కడ పెత్తందార్లెవరో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. వారు ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచినవారే! వారు రాజశేఖరరెడ్డిపై దుష్ప్రచారాలు చేసి అడ్డు తొలగించుకోవాలని చూసినవారే! వారు చంద్రబాబు, రామోజీ అండ్ కో ముఠా సభ్యులే! తనను గెలిపిస్తే జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న కార్యక్రమాలన్నీ చేస్తానని చంద్రబాబు చెబుతున్నారు కదా! మరి పెత్తందారీవర్గ ప్రతినిధి ఎలా అవుతాడని కొందరి ప్రశ్న. పులి తన మచ్చల్ని దాచుకోలేదు. పెత్తందార్లు వారి స్వభావాన్ని మార్చుకోలేరు.

చంద్రబాబు తొలి రెండు దఫాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన తొమ్మిదేళ్ల చేటుకాలం కథ తెలిసిందే. రైతులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వకూడదని వాదించిన సంగతి జ్ఞాపకమే. ప్రభుత్వ ఆస్పత్రులు, కార్యాలయాలు ప్రజల నుంచి యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశాలిచ్చిన సంగతి గుర్తే. వ్యవసాయం దండగని చెప్పడం – రైతుల్ని పిట్టల్లా కాల్చిచంపడం మరిచిపోలేని మహావిషాదం. పదేళ్ల విరామం తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా వచ్చినప్పుడు కూడా ఆయన పెత్తందారీ స్వభావం మారలేదు. పైపెచ్చు మరింత ముదిరింది.

ముఖ్యమంత్రి హోదాలో ఉండి కొన్ని మీడియా సమావేశాల్లో చంద్రబాబు మాట్లాడిన మాటలు ఇప్పటికీ చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి. 'ఎస్సీ కులాల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అని బాహాటంగా ప్రశ్నించిన మహానాయకుడు ఆయన. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు దిగువశ్రేణి పౌరులనే భావన నరనరాన జీర్ణించుకొనిపోయిన పెత్తందారీ మనస్తత్వం ఆయనది. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా?' ఇది మరో మీడియా సమావేశంలో సీఎం హోదాలో బాబు పేల్చిన డైలాగ్. దాని అర్థమేమిటంటే మగపిల్లాడిని కనడం అనేది గొప్ప విషయం. అంత గొప్ప పని కోడలు చేస్తానంటే అత్త ఎందుకు వద్దంటుందని చెప్పడం. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి మగపిల్లాడెక్కువ, ఆడపిల్ల తక్కువ అనే పురుషాహంకార భావజాలాన్ని వెదజల్లవచ్చునా?

పెత్తందార్లకుండే మరో అలంకారం పురుషాహంకారం కూడా! పేద వర్గాల సాధికారతే కాదు మహిళల సాధికారత కూడా వారికి ఆమోదయోగ్యం కాదు. తొలిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన దగ్గరి నుంచి ఆయన తీసుకున్న విధాన నిర్ణయాలు, 'మనసులో మాట' పుస్తకంలో ఆయన పొందుపరుచుకున్న ఐడియాలజీ, చివరి దఫా పదవీకాలంలో తీసుకున్న విధాన నిర్ణయాలూ, వెలిబుచ్చిన అభిప్రాయాలు అన్నీ ఆయన పెత్తందారీ స్వభావాన్నీ, పెత్తందార్ల తాబేదారు పాత్రను చాటిచెబుతూనే ఉన్నాయి. ఒక్క ఉదాహరణ చాలు... అమరావతి శాసన రాజధాని ప్రాంతంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కోర్టు వ్యాజ్యాలు నడిపిన వ్యక్తి చంద్రబాబు. పేద వర్గాలకు ఇళ్ల స్థలాలిస్తే అక్కడ సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని కూడా కోర్టులో వాదించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు అక్కడ చేరితే రాజధానికి గౌరవ భంగమట! ఇది పేదల ఆత్మగౌరవాన్నీ, రాజ్యాంగ ప్రతిష్ఠనూ అవమానపరచడంతో సమానం.

పెత్తందారీ రాజకీయ బంటుగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు గురుపాదుల వారు రామోజీరావు. ఈయన చట్ట విరుద్ధంగా జనం నుంచి డిపాజిట్లు వసూలు చేసి వారి సొమ్ముతో వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న వైనాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఎదుటివారికి చెప్పేటందుకే శ్రీరంగనీతులు తప్ప తాము ఎక్కడ దూరినా తప్పులేదని బలంగా నమ్మే వ్యక్తిత్వం ఈయనది. రెండు రాష్ట్రాల్లోని పెత్తందారీ శక్తులకు వీరిద్దరూ జాయింటుగా నాయకత్వం వహిస్తున్నారు. వీరి టీమ్‌లో కొత్తగా చేరిన వ్యక్తి – సినీనటుడు పవన్ కల్యాణ్. ఈయన ద్వంద్వ ప్రమాణాల మీద ఇప్పటికే బోలెడు జోకులున్నాయి. కమ్యూనిస్టు విప్లవకారుడైన చేగువేరాను కొంత

తొలిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన దగ్గరి నుంచి చంద్రబాబు తీసుకున్న విధాన నిర్ణయాలు, 'మనసులో మాట' పుస్తకంలో ఆయన పొందుపరుచుకున్న ఐడియాలజీ, చివరి దఫా పదవీకాలంలో తీసుకున్న విధాన నిర్ణయాలు, వెలిబుచ్చిన అభిప్రాయాలు అన్నీ ఆయన పెత్తందారీ స్వభావాన్నీ, పెత్తందార్ల తాబేదారు పాత్రను చాటిచెబుతూనే ఉన్నాయి. ఒక్క ఉదాహరణ చాలు... అమరావతి శాసన రాజధాని ప్రాంతంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కోర్టు వ్యాజ్యాలు నడిపిన వ్యక్తి చంద్రబాబు. పేద వర్గాలకు ఇళ్ల స్థలాలిస్తే అక్కడ సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని కూడా కోర్టులో వాదించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు అక్కడ చేరితే రాజధానికి గౌరవభంగమట! ఇది పేదల ఆత్మగౌరవాన్నీ, రాజ్యాంగ ప్రతిష్ఠనూ అవమానపరచడంతో సమానం.

పెత్తందారీ రాజకీయ బంటుగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు గురుపాదుల వారు రామోజీరావు. ఈయన చట్టవిరుద్ధంగా జనం నుంచి డిపాజిట్లు వసూలు చేసి వారి సొమ్ముతో వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న వైనాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఎదుటివారికి చెప్పేటందుకే శ్రీరంగనీతులు తప్ప తాము ఎక్కడ దూరినా తప్పులేదని బలంగా నమ్మే వ్యక్తిత్వం ఈయనది. రెండు రాష్ట్రాల్లోని పెత్తందారీ శక్తులకు వీరిద్దరూ జాయింటుగా నాయకత్వం వహిస్తున్నారు. వీరి టీమ్‌లో కొత్తగా చేరిన వ్యక్తి – సినీనటుడు పవన్ కల్యాణ్. ఈయన ద్వంద్వ ప్రమాణాల మీద ఇప్పటికే బోలెడు జోకులున్నాయి.

కాలం అనుసరించారు. ఆ తర్వాత జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యామాప్రసాద్ ముఖర్జీపై హఠాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చింది. ముప్పయ్ సీట్లయినా రాలేదు, తనకెవరు ముఖ్య మంత్రి పదవి ఇస్తారని కొన్నాళ్లు నిర్వేదం వ్యక్తం చేస్తారు. నెల తిరక్కుండానే ముఖ్యమంత్రి పదవి ఇస్తే తీసుకోవడానికి రెడీగా ఉన్నానంటారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవడమే తన లక్ష్యమని ప్రకటించి తన రాజకీయ స్థాయి ఏమిటో ఆయన చెప్పకనే చెప్పారు. ఇంటర్మీడియట్‌లో తాను చదివిన గ్రూపు గురించి నాలుగు సందర్భాల్లో నాలుగు రకాలుగా చెప్పారు. ఇటువంటి 'అపరిచితుడు' మోడల్‌ను రాజకీయ నాయకునిగా జనం అంగీకరించరు. వారు తమ నాయకుడి నుంచి నీతిని, నిజాయితీని, పారదర్శకతను కోరుకుంటారు. పుస్తకాలను తెరిచి పట్టుకొని ఫోటోలు దిగి ప్రచారం చేసుకుంటే చాలదు. జీవితాన్ని తెరిచిన పుస్తకంలా మలుచుకుంటేనే ప్రయోజనం నెరవేరుతుంది.

అసలు సిసలైన ప్రజాస్వామ్యాన్ని అమలుచేయడానికీ, పేద ప్రజల అభ్యున్నతికీ తొలిమెట్టు పరిపాలనా వికేంద్రీకరణ. ఫలితంగా పారదర్శకత పెరుగుతుంది. ప్రజలకు పరిపాలనపై అవగాహన పెరుగుతుంది. తమ కళ్ల ముందటే ఉన్న ప్రభుత్వాన్ని వారు ఎప్పుడైనా ప్రశ్నించగలుగుతారు. తమకు అందవలసిన పథకాలు, సేవల విషయంలో పెత్తందార్ల జోక్యం తొలగిపోతుంది. అందుకని వికేంద్రీకరణకు పెత్తందార్లు వ్యతిరేకం. చంద్రబాబు పద్నాలుగేళ్ల పదవీ కాలంలో ఒక కొత్త జిల్లాను కానీ, మండలాన్ని కానీ ఏర్పాటు చేసిన పాపాన పోలేదు. ఎన్టీ రామారావు మండల వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత, పాలనను మరింత వికేంద్రీకరించి పల్లెపల్లెనా సచివాలయాలు స్థాపించి వికేంద్రీకరణను చివరి అంచుకు చేర్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి. వికేంద్రీకరణతోపాటు మరో ఆరు అంశాలపై ప్రభుత్వం పెట్టిన ఫోకస్ ఆ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల తలరాతను మార్చబోతున్నది. నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం ఉచిత విద్య, గడప గడపకూ ప్రజారోగ్యాన్ని ప్రాధమ్యంగా ప్రకటించుకున్న వైద్యరంగం, వ్యవసాయ రంగంలో రైతును చేయి పట్టుకొని నడిపిస్తున్న ఆర్‌బీకే సెంటర్లు, మహిళల సాధికారత కోసం చేపట్టిన పథకాలు – ఇస్తున్న పదవులు, చిన్న, సూక్ష్మ పరిశ్రమల రంగంలో ఉత్తేజాన్ని నింపడం, సుదీర్ఘ సముద్ర తీరాన్ని అభివృద్ధికి ఆలంబనగా మలుచుకోవడానికి పెద్ద ఎత్తున పోర్టులను, ఫిషింగ్ హార్బర్లను ఏర్పాటు చేయడం. వికేంద్రీకరణతో కలిసి ఈ ఏడు ఫోకస్ ఏరియాలు గేమ్ ఛేంజర్స్‌గా మారబోతున్నాయి. బడుగుల జీవితాలను మార్చబోతున్నాయి. అందువల్లనే పెత్తందారీ వర్గాలు ప్రకటించిన యుద్ధాన్ని పేద వర్గాలు స్వాగతిస్తున్నాయి. ఈ ఒక్కసారి ఓడిస్తే పెత్తందారీ పీడ విరగడవుతుందని వారు ఆశిస్తున్నారు.

vardhelli1959@gmail.com

కందుకూరి స్ఫూర్తిగా పోరాడాలి!

సందర్భం



డాక్టర్ దేవరాజు మహారాజు

తెలుగు రచయిత, సంఘ సంస్కర్త అయిన కందుకూరి వీరేశలింగం పంతులు గూర్చి శ్రీశ్రీ 'కార్యశూరుడు వీరేశలింగం/ కదం తొక్కి పోరాడిన సింగం/ దురాచారాల దురాగతాలను / తుద ముట్టించిన అగ్ని తరంగం' అన్నారు. ఇప్పుడు మనం అటువంటి కందుకూరి వారి 174వ జయంతి సందర్భంలో ఉన్నాం (ఏప్రిల్ 16).

'ఉద్యోగంలో చేరడానికి అమావాస్యనాడే ఎందుకు వచ్చావ'ని అధికారి అడిగాడు. అందుకు వీరేశలింగం చెప్పిన సమాధానం అధికారి నోరు మూయించింది. 'అయ్యా! అన్ని రోజులూ ఆ ఈశ్వరుడు సృష్టించినవనే చెబుతారు కదా? మరి అలాంటప్పుడు అన్ని రోజులూ మంచివే – అలాంటప్పుడు ఇక నేను ఏ రోజు ఉద్యోగంలో చేరినా, అది మంచి రోజే అవుతుంది' అని తాపీగా సమాధానమిచ్చారు వీరేశలింగం. ఈ విషయం 'మూఢ నమ్మకాలపై నా పోరాటం' అనే గ్రంథంలో ఆయనే స్వయంగా రాసుకున్నారు. ఆ గ్రంథంలో ఆయన అనేక ప్రహసనాలు రాశారు. శకునాలు, జోస్యాల వంటివాటిని నమ్మడం ఎంత అశాస్త్రీయమో కళ్లకు కట్టినట్లు వాటి ద్వారా వివరించారు.

జ్యోతిష్యాన్ని నమ్మేవారు తాము నమ్మిన జోస్యాలు నిజం కానప్పుడు వాటిని పట్టించుకోకుండా పక్కన పెడతారు. ఎప్పుడైనా ఒకటి అరా నిజమైతే వాటినే మళ్లీ పట్టుకుని వేలాడుతారు. ఒక విధంగా జ్యోతిష్యం చెడిపోయిన గడియారం లాంటిది. ఆగిపోయిన గడియారం కూడా రోజుకు రెండుసార్లు సరైన సమయాన్ని చూపిస్తుంది. అలాగని, ఆగిపోయిన గడియారాన్ని నమ్మడం ఎంత మూర్ఖత్వమో, జ్యోతిష్యాన్ని నమ్మడం కూడా అంతే మూర్ఖత్వం! వాస్తవానికి మనం ఏదైనా విషయం ఊహించి చెబితే, అందులో కొంత మేరకు నిజమయ్యే అవకాశాలు ఉంటే ఉంటాయి. ఉండకపోతే ఉండవు.

ఇకపోతే, దేవుడి విషయం చూద్దాం! ఒక కారుకు బ్రేకులు ఫెయిల్ అయ్యి లోయలో పడిందని అనుకుందాం. ఆ ప్రమాదంలో బతికినవాళ్ళు 'ఆ దేవుడి దయవల్ల బతికామని చెప్పుకుంటారు కదా? మరి చనిపోయిన వారిని ఎవరు చంపినట్టూ? ఆ దేవుడు చంపాడని చెప్పాలి కదా? కానీ చెప్పరు. ఒకవేళ ప్రమాదానికి గురయిన ఆ కారులోని వారంతా చనిపోతే మీడియాలో వార్త ఇలా ఉంటుంది. 'కారు బ్రేకులు ఫెయిలై, అందులో ప్రయాణిస్తున్న అయిదుగురు మృతి చెందారు' అని ఉంటుంది. బ్రేకులు ఫెయిల్ కావడం హైలైట్ అవుతుందే తప్ప ఆ వార్తలో దేవుడి ప్రసక్తి ఉండదు. ప్రయాణికులు బతికితే 'దేవుడి దయ' వల్ల బతికారనడం, మరణిస్తే మాత్రం, తప్పు – బ్రేకులు ఫెయిల్ కావడంపై పెట్టడం ఏమైనా బాగుందా? తప్పు దేవుడి మీద పెట్టి, ఆయనే చంపేశాడని, అనుకునే ధైర్యం ఉండదు.



కందుకూరి వీరేశలింగం పంతులు

ప్రజలు ఇలాంటి ధోరణికి అలవాటు పడిపోవడం వల్ల కదా దేవుడు, జ్యోతిష్యం, వాస్తు, ఆత్మ, పునర్జన్మ వంటి అంధ విశ్వాసాలు సమాజంలో సజావుగా బతుకుతున్నాయి? ఇలాంటి విశ్వాసాల వల్లనే సమాజం రోగగ్రస్తమవుతూ ఉంది. మన జీవితంలో మన చుట్టూ జరుగుతున్న విషయాలను నిశితంగా పరిశీలిస్తూ, హేతుబద్ధంగా విశ్లేషించుకుంటే నిజానిజాలు బయటపడతాయి. 'దైవాన్నీ, జ్యోతిష్యాన్నీ నమ్మేవారు తమ సౌకర్యానుసారంగా ఆలోచనల్ని, విధివిధానాల్ని మార్చుకుంటూ ఉంటారని' వీరేశలింగం పంతులు ఏనాడో చెప్పారు. మరి, మనవాళ్ళు ఏమైనా చెవికి ఎక్కించుకున్నారా? లేదే? గుడ్డెద్దు చేలో పడ్డట్టు గుడ్డిగా మూఢ నమ్మకాల్లో పడిపోతున్నారు. ఒక పెరియార్, ఒక కందుకూరి, ఒక తాపీ ధర్మారావు, ఒక గోరా వివేచన అనే దుడ్డు కర్రలతో జనాన్ని అదిలిస్తూనే వచ్చారు. మనం కూడా ఆ పనిని కొనసాగిస్తూనే ఉండాలి. జన చైతన్యానికి దోహదం చేస్తూనే ఉండాలి. ఇక ప్రస్తుత పరిస్థితుల్లోకి వద్దాం.

'మహాభారత కాలంలోనే శాటిలైట్, ఇంటర్నెట్ ఉంది' అని అన్నారు త్రిపుర ముఖ్యమంత్రి. ఇటువంటి మాటల ద్వారా కేంద్రంలో అధికారంలో ఉన్నవారూ తామేమిటో స్వయంగా నిరూపించుకుంటున్నారు. లేకపోతే అర్ధ సత్యాలతో, అబద్ధాలతో తీసిన 'కశ్మీర్ ఫైల్స్' సినిమా చూడండని ఈ దేశ ప్రజలకు స్వయంగా ఈ దేశ ప్రధాని చెబుతారా? 'నేడే చూడండి' అంటూ ఊళ్లల్లో ఓ మైకు రిక్షా తిరుగుతుండేది. ప్రధాని పదవి ఆ స్థాయికి చేరిందా? అదే ఎందుకు? గుజరాత్ అల్లర్లపై వచ్చిన 'పర్జానియా' పూర్తి హిందీ సినిమా యూట్యూబ్‌లో ఉంది. అది చూడమని చెప్పలేదెందుకూ? రేషన్ ఇవ్వడం చేతగాకే ఆయన భాషణలు ఇస్తుంటారని సగటు భారతీయుడికి అర్థమైంది.

మూఢ నమ్మకాలు, జ్యోతిష్యం, వాస్తు, ఆవు పేడ, ఆవు మూత్రం వాటితో ఈ దేశ ప్రజల్ని విడగొట్టి, విభజించి, దేశాన్ని 'హిందూ రాష్ట్రం'గా మార్చాలన్న ఉద్దేశంతోనే విద్యారంగాన్ని కాషాయంలో ముంచుతున్నారు. 'దేశం కాషాయీకరణ చెందితే తప్పేంటి?' అని దేశ ద్వితీయ పౌరుడైన తెలుగువాడు ప్రశ్నిస్తుంటే – మనం 21వ శతాబ్దంలో ఉన్నామా? లేక సాధారణ శకానికి పూర్వ కాలంలో ఉన్నామా? అని అనుమానపడాల్సి వస్తోంది. ఇప్పుడు బంతి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ప్రతిపక్షాల కోర్టులో ఉంది. ప్రశ్నించగల సామర్థ్యం, స్థైర్యం గల సామాన్య పౌరులు కూడా ప్రతిపక్షంలో ఉన్నట్టే – ప్రజాకవి వేమన, కందుకూరి వీరేశలింగం లాంటి వారి రచనల నుండి స్ఫూర్తిని పొందాల్సి ఉంది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత, జీవశాస్త్రవేత్త

నోటిని అదుపు చెయ్యాలి

దేహమంతటిలో నాలుక అతి చిన్న అవయవము కదా! అయినా అది చాలా కీలకమైనది. మన మంచితనానికీ, దుష్ట స్వభావానికీ తక్షణ వాహిక నాలుక. నోరు జారితే తిరిగి తీసుకోలేమన్నది అక్షర సత్యం. అలాగే 'నోరు మంచిదైతే ఊరు మంచిద'ని సామెత ఉంది. అనుకోకుండా నోరు జారితే తగాదాలు, కొట్లాటలు పెరిగి పెద్దవై చిలికి చిలికి గాలివానలా మారి ఒకరినొకరు హతమార్చుకోవడానికీ వెనుకాడరు. 'ఎవడైనను మాటయందు తప్పని యెడల అట్టివాడు లోపము లేనివాడై, తన దేహమంతటిని కాపాడుకోగలవాడగును గదా!' నాలుక చిన్న అవయవము అయినప్పటికీ అతిగా అదిరి పడును గదా. నిప్పు రవ్వ చిన్నదైనా గాలికి ఎగిసిపడి అరణ్యములోకి చొచ్చి అడవిని తగలబెడ్తుంది. నాలుక కూడా అగ్ని లాంటిదే. అది మన అవయవములలో ఒకటిగా ఉన్నప్పటికీ పాపమునకు నిలయమైన ఈ ప్రపంచంలో మరింత పాపం పోగవడానికి కారణం అవుతుంది. అంతేకాదు శరీరానికి మాలిన్యం కలుగజేస్తుంది. ప్రకృతి చక్రమునకు చిచ్చు పెడుతుంది. అబద్ధపు మాటలు పలుకు నాలుకలు నిరపరాధుల హత్యలకు దారి తీస్తాయి. హంతకులు దొరల్లా తిరుగుతారు. హత్యతో సంబంధంలేని వాళ్లు దొంగల్లాగా బతకాల్సివస్తుంది. ఈ పనులను చేయించే మనసు నియంత్రణ అత్యంతావశ్యకం. ఐహిక బంధాల వల్ల ఏ పాపానికైనా ఒడిగట్టడం జరుగుతోంది. దేవుని యందు భయభక్తులు లేకపోవటమే పాపాలు చేయడానికి అసలు కారణం అని అన్ని మతాలూ ప్రబోధిస్తున్నాయి.



జ్యోతిర్మయం

మానవులు జీవ కోటినంతటినీ మచ్చిక చేసుకుంటారు. కాని నాలుకను లోబరుచుకొనిన మానవులెవ్వరూ లేరు. అది మరణమంత విషం. అది నిరర్గలమైన దుష్టత్వం. ఒక్క నోటి నుండే శుభ వచనాలూ, శాపనార్థాలూ! ఒకే నీటిబుగ్గలోంచి ఉప్పునీరు, మంచి నీరు రావు కదా. కాని ఒకే నోటి నుండి శుభాలు, శాపాలు పలుకుతుంటారు.

కాబట్టి మన నోటితో మంచి మాటలే పలుకుదాం. చెడు పలుకకుండా నోటిని అదుపులో ఉంచుకుందాం.

– బి.బి. చంద్రపాల్ కోట

క్లుప్తంగా...

దేశాభివృద్ధిలో కంపెనీ సెక్రటరీల కీలకపాత్ర

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు
- ముగిసిన ప్రాక్టీసింగ్ సెక్రటరీస్ 24వ జాతీయ సదస్సు



జస్టిస్ సోమయాజులును సత్కరిస్తున్న ఐసీఎస్ఐ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: దేశాభివృద్ధిలో కంపెనీ సెక్రటరీల పాత్ర కీలకమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విశాఖలో జరిగిన ప్రాక్టీసింగ్ సెక్రటరీస్ 24వ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో జస్టిస్ సోమయాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'న్యాయవ్యవస్థలు, వృత్తి నిపుణుల నుంచి అంచనాలు.. ప్రాక్టికల్ టిప్స్' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో ఆయన మాట్లాడారు. కంపెనీ సెక్రటరీలు.. న్యాయ వ్యవస్థకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నియమ నిబంధనల్ని పాటిస్తూ.. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలబడాలన్నారు. ముగింపు సదస్సులో ఐసీఎస్ఐ ఇండియా చైర్మన్ మనీష్ గుప్తా, ప్రతినిధులు గిరిధరన్, ద్వారకానాథ్, నరసింహన్ తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ సోమయాజుల్ని ఐసీఎస్ఐ ప్రతినిధులు సత్కరించారు.

గ్రామీణ స్థాయి నుంచి క్రీడలకు పెద్దపీట

- యువత భాగస్వాములయ్యేలా క్రీడా సంబరాలు: సీఎస్



సాక్షి, అమరావతి: గ్రామీణ స్థాయి నుంచి క్రీడలకు పెద్దపీట వేసేలా నూతన క్రీడా విధానం 2023–28 ఉండాలని అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి సూచించారు. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాల నిర్వహణపై శనివారం విజయవాడ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల నిర్వహణకు వీలైనంత త్వరగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని క్రీడా సంబరాలను ప్రారంభించాల్సి ఉంటుందని.. క్రీడా శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రీడా సంబరాల నిర్వహణకు గ్రామ, మండల స్థాయిల్లో మైదానాలను గుర్తించాలని ఆదేశించారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీతో పాటు ఇతర సాంప్రదాయ క్రీడలను కూడా ఇందులో చేర్చాలని ఆదేశించారు. సమావేశంలో ఉన్నతాధికారులు వాణీ మోహన్, ఎస్.గుల్జార్, ఆర్.ముత్యాల రాజు, కె.హర్షవర్ధన్, ప్రముఖ క్రికెటర్లు అంబటి రాయుడు, కేఎస్ భరత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి
ఉప్పును పండించవచ్చు

సముద్ర తీరంలో మాత్రమే పెరిగే సాలికోర్నియా మొక్కలు	వీటినుంచి ఉప్పును తీసుకోవచ్చు	వీటి ఇంధనం సైతం తీయొచ్చు
	ఈ మొక్కలనే నేరుగా వంటకాల్లో వాడుకోవచ్చు	ఉప్పునీటి చెరువుల్లో ఆక్వా సాగు చేసే రైతులకు కొత్త ఉపాధి



కృష్ణాజిల్లా నాగాయలంక వద్ద సముద్ర తీరంలో పెరిగిన సాలికోర్నియా మొక్కలు, వీటితో తయారు చేసిన సలాడ్స్

సాక్షి, అమరావతి: సాలికోర్నియా.. సముద్ర తీరం వెంబడి ఉప్పునీటి ప్రాంతాల్లో విస్తారంగా పెరిగే ఈ మొక్కలను సంప్రదాయ ఉప్పునకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు. ఈ మొక్కల నుంచి ఉత్పత్తి చేసే ఇంధనాన్ని విమానాల్లో సైతం ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నారు. సముద్రతీర ప్రాంతాల్లో ఉప్పును తట్టుకుని పుష్పించే మొక్కల జాతికి చెందిన సాలికోర్నియా మొక్కల్లో 50 శాతం వరకు సోడియం క్లోరైడ్ నిండి ఉంటుంది. ఇందులోని లవణీయత సంప్రదాయ సముద్ర ఉప్పు రుచిని కలిగి ఉంటుంది. వీటి నుంచి తీసే ఉప్పును హెర్బల్ సాల్ట్, గ్రీన్ సాల్ట్‌గా పిలుస్తున్నారు.

ప్రొటీన్లు.. విటమిన్లూ ఉన్నాయ్

సాలికోర్నియా మొక్కల్లో 11 శాతం ప్రొటీన్లు, 20 శాతం ఫైబర్, జింక్, పొటాషియం, ఏ, బీ–1, బీ–12, బీ–15, సీ, ఈ విటమిన్లు అపారంగా ఉన్నాయని పరిశోధనల్లో గుర్తించారు. రక్తపోటు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సంబంధిత వ్యాధులతో బాధపడే వారు ఈ గ్రీన్ సాల్ట్ తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు చాలా దేశాల్లో ఈ మొక్క నుంచి ఉత్పత్తి చేసే ఉప్పును అన్ని వంటకాల్లో వాడుతున్నారు.

సీఎస్ఎంసీఆర్ఐ సాంకేతిక సహకారం

గుజరాత్ భావనగర్‌లోని సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) సాలికోర్నియా మొక్కల నుంచి ఉప్పు తయారు చేసే టెక్నాలజీని కనుగొంది. ప్రత్యామ్నాయ ఉప్పు తయారీకి సంబంధించిన అన్ని శాస్త్రీయ, సాంకేతిక సహాయాలను అందిస్తోంది. సాలికోర్నియా మొక్కల సాగు, కోత, మొక్కల్ని ఎండబెట్టడం, ఇతర ప్రక్రియల ద్వారా ఎకరాకు టన్ను ఉప్పు వస్తుందని సీఎస్ఎంసీఆర్ఐ చెబుతోంది. రూ.15 వేల పెట్టుబడితో రూ.25 వేలకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేసింది. ఈ మొక్కల నుంచి ఉత్పత్తి చేసే ఇంధనాన్ని సౌదీ దేశాలలో కొన్ని విమానయాన సంస్థలు ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నాయట.

ఏపీలోనూ సాగుకు అవకాశాలు

రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సువిశాల సముద్రతీర ప్రాంతం ఉంది. కాకినాడ, మచిలీపట్నం ప్రాంతాల్లో పెద్దఎత్తున విస్తీర్ణంలో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. తీరం వెంబడి రిజర్వ్ మడ అడవుల్లో సాలికోర్నియా మొక్కలు విస్తారంగా ఉన్నట్టుగా గుర్తించారు. ముఖ్యంగా కృష్ణా జిల్లా తీర ప్రాంతంలో ఈ మొక్కల జాడను సీఎస్ఎంసీఆర్ఐ గుర్తించింది. ఉప్పునీటి చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగు చేసే రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధిగా సాలికోర్నియా మొక్కల సాగు నిలుస్తుందని చెబుతున్నారు. కొన్ని దేశాల్లో ఇండోర్‌లో కూడా సాగు చేస్తున్నారు. భవిష్యత్‌లో మంచి ఆదాయ వనరుగా ఉపయోగపడే ఈ మొక్కల సాగుపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కేజీబీవీ పాఠశాలల్లో అదనపు సీట్లు మంజూరు చేయండి

- కేంద్ర విద్యాశాఖ మంత్రికి బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు లేఖ

సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ)లో అదనపు సీట్లు మంజూరు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి రాసిన లేఖను శనివారం ఆయన మీడియాకు విడుదల చేశారు. కేజీబీవీల్లో విద్యను అభ్యసించడానికి అనేక మంది నిరుపేద బాలికలు ఆసక్తి చూపిస్తున్నారని, కానీ వారికి సరిపడా సీట్లు అందుబాటులో లేవని అప్పారావు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని, విద్య కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో బాలలు పెద్ద సంఖ్యలో చదువుల బాట పట్టారన్నారు. ఈ నేపథ్యంలో ఆరు నుంచి పదవ తరగతి చదువుతున్న అనేక మంది బాలికలు కేజీబీవీల్లో సీటు పొందలేక నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అనేక మంది తల్లిదండ్రులు, బాలల కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. దీన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, కేంద్ర స్థాయిలో ఏపీలోని కేజీబీవీలను పెంచాలని అప్పారావు విజ్ఞప్తి చేశారు.

సాంకేతిక సమస్య

- విశాఖ నుంచి పలు విమానాలు రద్దు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): విశాఖ విమానాశ్రయం నుంచి శనివారం రాత్రి 9.05 గంటల తరువాత బయలుదేరాల్సిన పలు విమానాలు రద్దయినట్టు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఢిల్లీ నుంచి రాత్రి 8 గంటలకు విశాఖ వచ్చి తిరిగి రాత్రి 9 గంటలకు ఢిల్లీకి వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం రద్దయిందని తెలిపారు. బెంగళూరు నుంచి రాత్రి 9 గంటలకు విశాఖ వచ్చి 9.30 గంటలకు తిరిగి బెంగళూరు వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం, ఢిల్లీ నుంచి రాత్రి 9.50 గంటలకు విశాఖ వచ్చి 10.33 గంటలకు తిరిగి వెళ్లాల్సిన ఇండిగో విమానం రద్దయ్యాయి. అదేవిధంగా హైదరాబాద్ నుంచి రాత్రి 10.30 గంటలకు విశాఖ వచ్చి 11.05 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ఇండిగో విమానం, సింగపూర్ నుంచి రాత్రి 10.55 గంటలకు విశాఖ వచ్చి తిరిగి 11.55 గంటలకు తిరిగి సింగపూర్ వెళ్లాల్సిన స్కూట్ ఎయిర్‌లైన్స్ విమానం రద్దయినట్టు వివరించారు.

జనం పాలిట 'పగాకు'

జీవితాల్ని హరిస్తున్న పొగాకు ఉత్పత్తులు



- దేశంలో ధూమపానం కంటే గుట్కా, ఖైనీ వినియోగమే ఎక్కువ
- ఏటా ప్రపంచ వ్యాప్తంగా 80 లక్షల మంది మృత్యువాత
- దేశంలో మరణాల సంఖ్య ఏటా 14 లక్షలు
- కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'లోకల్ సర్కిల్' సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: పొగాకు మనుషుల పాలిట పగాకులా మారింది. విచ్చలవిడి ధూమపానం అనారోగ్య చీకట్లలోకి నెట్టేస్తుంటే.. పొగాకు గుట్కా, ఖైనీ మనుషుల ప్రాణాలను చిదిమేస్తున్నాయి. దేశంలో ప్రతి ఆరు కుటుంబాలకు ఒక కుటుంబంలోని ఒకరు అంతకంటే ఎక్కువ మంది పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నట్టు కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ సంస్థ లోకల్ సర్కిల్ సర్వేలో వెల్లడైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తులు విస్తృత స్థాయిలో అందుబాటులో ఉన్నట్టు గుర్తించింది. దశాబ్దం క్రితం దేశంలో గుట్కాను నిషేధించినప్పటికీ పాన్‌మసాలా ముసుగులో అనేక కంపెనీలు ఇప్పటికీ వాటిని తయారు చేస్తున్నట్టు పేర్కొంది. ఈ క్రమంలోనే సర్వేలో పాల్గొన్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు తమ ప్రాంతంలో విరివిగా పొగాకు ఉత్పత్తులు లభిస్తున్నాయని.. దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరడం గమనార్హం.

ప్రపంచ వ్యాప్తంగా 80 లక్షల మంది మృత్యువాత

పొగాకు తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను.. మరీముఖ్యంగా నోటి క్యాన్సర్‌ను కలిగిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 80 లక్షల కంటే ఎక్కువ మంది పొగాకు ఉత్పత్తుల వినియోగంతో మృత్యువాత పడుతున్నారు. భారత్‌లో అయితే ఏటా మరణాల సంఖ్య 14 లక్షలుగా ఉంటోంది. వారణాసిలో ఇటీవల క్యాన్సర్ బాధితుల డేటా సేకరించగా.. 55 శాతం క్యాన్సర్లు పొగాకు వాడకంతో ముడిపడి ఉన్నాయని లాన్సెట్ నివేదిక పేర్కొంది.

పొగాకు ఉత్పత్తిలో మూడో స్థానం

భారతదేశం పొగాకు ఉత్పత్తుల్లో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఉత్పత్తిదారు, ఎగుమతిదారుగా ఉంది. ఇతర దేశాల మాదిరిగా కాకుండా భారత్‌లో సిగరెట్, చుట్ట(స్మోక్ టుబాకో) కంటే గుట్కా, ఖైనీ (స్మోక్‌లెస్ టుబాకో) వినియోగం అధికంగా ఉంటోంది. దేశ జనాభాలో దాదాపు 21 శాతం (199.4 మిలియన్) ప్రజలు స్మోక్‌లెస్ టుబాకోను, 10.7 శాతం మంది (99.5 మిలియన్లు) పొగాకు ఉత్పత్తులను (స్మోక్ టుబాకో) వినియోగిస్తున్నారు. ఇది ఊపిరితిత్తుల క్యాన్సర్, స్ట్రోక్, గుండె జబ్బులు, మధుమేహం వంటి అనారోగ్య ప్రమాదాలకు దారి తీస్తోంది. యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం క్యాన్సర్ నిర్ధారణ తర్వాత కూడా ధూమపానం చేసిన రోగుల్లో గుండె జబ్బులు రెట్టింపు అవుతున్నాయని, ధూమపానం మానేసిన వారిలో స్ట్రోక్ ప్రమాదం చాలా తక్కువని పేర్కొంది.

పర్యావరణానికి హానికరంగా..

పొగాకు మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా పర్యావరణంపై కూడా ప్రతికూలత చూపిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం ఏటా పొగాకు పరిశ్రమ వల్ల 600 మిలియన్ల చెట్లు, 2 లక్షల హెక్టార్ల అటవీ నిర్మూలన, 22 బిలియన్ టన్నుల నీటిని, 84 మిలియన్ టన్నుల కార్బన్‌ను కోల్పోవాల్సి వస్తోంది. విమానయాన పరిశ్రమ విడుదల చేసే హానికర వాయువుల్లో ఐదవ వంతు పొగాకు పరిశ్రమ నుంచి విడుదలవుతున్నాయి. పొగాకు సాగులో పెద్ద మొత్తంలో పురుగు మందులు, ఎరువులు వాడకం నేల నాణ్యతను దెబ్బతీస్తూ.. జీవవైవిధ్యానికి ముప్పును తీసుకొస్తోంది. కాల్చిపడేసిన సిగరెట్ పీకలు భూమిలో విచ్ఛిన్నం కావడానికి ఏళ్ల సమయం పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సిగరెట్ ఖాళీ ప్యాకెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల ప్యాకింగ్‌లతో ప్లాస్టిక్ కాలుష్యం పెరిగిపోతోంది. ఏటా చైనా 2.6 బిలియన్లు, భారత్ 766 మిలియన్లు, బ్రెజిల్, జర్మనీలు 200 మిలియన్ల డాలర్లకుపైగా పొగాకు ఉత్పత్తుల చెత్తను శుభ్రం చేయడానికి ఖర్చు చేస్తున్నాయి.

బాబు రాజకీయాలకు చరమగీతం తప్పదు

- 993వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని బహుజనుల హక్కులకు అడ్డుపడుతున్న బాబు రాజకీయాలకు చరమగీతం తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 993వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. కులోన్మాదంతో బాబు వ్యవహరిస్తున్నాడనేందుకు పేదల హక్కులకు అడుగడుగునా అడ్డుపడుతూ కోర్టుల్లో వేసిన కేసులే నిదర్శనమని, న్యాయస్థానాలను సైతం ఏమార్చాలని చూసిన బాబుకు రాజధాని ఇళ్ల పట్టాల విషయంలో వచ్చిన తీర్పే చెంపపెట్టు అన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ శ్రీవారి సేవలో భారతీస్వామి


ఆలయం వెలుపల భువనేశ్వరి పీఠాధిపతి భారతీస్వామి

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని భువనేశ్వరి పీఠాధిపతి శ్రీకమలానంద భారతీ స్వామి శనివారం సందర్శించారు. అంతరాలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ అర్చకులు భారతీ స్వామికి ప్రసాదం అందజేశారు. అలాగే హోంగార్డ్స్ కమాండెంట్ రామ్మోహన్ శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.

డెవిల్ ఫిష్.. చాలా డేంజర్

చెరువులు, సహజ నీటి వనరుల్లో విచ్చలవిడిగా పెరుగుతున్న దెయ్యం చేప

- అక్వేరియమ్ నుంచి నీటి వనరుల్లో చేరిన డెవిల్ ఫిష్
- చేపల చెరువుల్లో చేరి మేత, చేప పిల్లలను తినేయడంతో భారీ నష్టం
- చేపల చెరువుల్లో నీరు పెట్టేప్పుడు
- జాగ్రత్త వహించాలంటున్న అధికారులు

సాక్షి, భీమవరం: ఆక్వా రైతులకు దెయ్యం చేపలతో పెద్ద చిక్కొచ్చి పడింది. సక్కర్ మౌత్ క్యాట్ ఫిష్‌గా పిలిచే దెయ్యం చేప శాస్త్రీయ నామం హైపోస్టామస్ ప్లాకోస్టామస్. దీనిని విమానం చేప అని కూడా కొన్నిచోట్ల పిలుస్తున్నారు. ఇవి చెరువుల్లోని మేతతో పాటు చిన్న చేపలను సైతం ఎక్కువగా తినేస్తుండటం వల్ల పెట్టుబడి పెరిగి.. చెరువుల్లోని చేపల సంఖ్య తగ్గిపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. అక్వేరియమ్స్‌లో అలంకరణ కోసం పెంచే ఈ చేప సహజ నీటి వనరుల్లో చేరింది. ఉమ్మడి ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లోని చేపల చెరువుల్లో దెయ్య చేపలు దర్శనమిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రంలో 3.60 లక్షల ఎకరాల్లో చేపల సాగు

పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 1.70 లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తుండగా.. పూర్వ కృష్ణా జిల్లాలో 1.20 లక్షల ఎకరాలు, పూర్వ తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలోని చెరువులో సుమారు 2 వేల నుంచి 3 వేల చేప పిల్లలను వేసి పెంచుతారు. ఒక్కొక్కటీ 50 గ్రాముల నుంచి 250 గ్రాముల బరువుండే టన్ను చేపలకు దాదాపు 30 కిలోల మేత వేస్తారు. మేతను చెరువులో మూటలుగా కట్టి పెడుతుంటారు. మేతల మూటల వద్దకు వచ్చే దెయ్యం చేప పెంపకం చేపలను దరిచేరనివ్వకుండా మొత్తం మేతను తినేస్తోంది. చిన్న చేపలను సైతం తినేస్తోంది. దీంతో పెంపకం చేపల సంఖ్య తగ్గిపోవడంతో పాటు మిగిలిన చేపలకు సరైన మేత అందక ఎదుగుదల లోపిస్తోంది. దెయ్యం చేపలు విచ్చలవిడిగా చెరువుల్లో సంచరించడం వల్ల ఆక్సిజన్ పడిపోతోంది.

ఈ చేపకు పొలుసులుండవు.ం ఒళ్లంతా నల్లటి చారలు మాత్రమే ఉంటాయి. ఉప్పునీరు.. మంచినీరే కాదు.. బురదలో అయినా బతికేస్తుంది. నీటిలోంచి బయట పడేసినా చాలాసేపటి వరకూ బతికే ఉంటుంది. అంతేకాదు.. దీని పళ్లు ప్రమాదకరమైన కోరలతో కూడి ఉంటాయి. ఇది ఎలాంటి చేపనైనా ఇట్టే అంతం చేసేస్తుందని ఆక్వా రైతులు, మత్స్యకారులు చెబుతున్నారు. ఒక్కసారి ఆక్వా చెరువుల్లోకి లేదా కాలువలు.. నదుల్లోకి ఈ చేప ఎంటరైతే అంతే సంగతులు. తన సంతానాన్ని తక్కువ కాలంలోనే పది నుంచి ఎవంద రెట్లు పెంచేసుకుని రైతులు వేసిన మేత మొత్తాన్ని తినేస్తుంది. తనకంటే చిన్న చేపల్ని అమాంతం మింగేస్తుంది. భూమి పొరల్లోకి వెళ్లి బతికేయడం దీని స్పెషాలిటీ. భూమి లోపల నుంచే గట్లను తొలచుకుని మరో చెరువులోకి వెళ్లిపోతుంది. ఒకవేళ వలలో చిక్కినా తన పదునైన పళ్లతో కొరికి తప్పించుకుంటుంది.


దీంతో ఇతర చేపలకు ఆక్సిజన్ లోపం తలెత్తుతోంది.

15 ఏళ్లపాటు బతికేస్తుంది

దెయ్యం చేపను అక్వేరియమ్స్‌లో పట్టే నాచును తొలగించడానికి పెంచుతారు. దీని వెన్నుపై ముల్లుతో వింత ఆకారంలో ఉంటుంది. దాదాపు 15 ఏళ్లపాటు జీవించే దెయ్యం చేప మూడు కిలోల వరకు మాత్రమే బరువు పెరుగుతుంది. ఎక్కువగా మేతను తినడం, ఆక్సిజన్ తీసుకోవడం, చిన్న చేపలను తినడం వల్ల రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది. దెయ్యం చేప ఎక్కువగా గుడ్లు పెట్టడం వల్ల ఈ జాతి వేగం పెరుగుతుంది.


చెరువులో పెరుగుతున్న దెయ్యం చేప


దెయ్యం చేపల వల్ల తీవ్ర నష్టం



దెయ్యం చేపల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ చేపలు విచ్చలవిడిగా పెరిగిపోవడం వల్ల మేత ఖర్చు విపరీతంగా పెరిగి పెట్టుబడులు పెరుగుతున్నాయి. చెరువుల్లోని పెంపకం చేపలను తినేయడం వల్ల చేపల సంఖ్య తగ్గి నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. వీటి శాశ్వత నిర్మూలనకు మత్స్య శాఖ చర్యలు తీసుకోవాలి.

– కె.రామచంద్రరాజు, ఆక్వా రైతు, వెంప, భీమవరం మండలం

నీళ్లు పెట్టేప్పుడే జాగ్రత్త తీసుకోవాలి



దెయ్యం చేపల వల్ల అనేక నష్టాలున్నాయి. దీనికి ఎక్కువ గుడ్లు పెట్టే గుణం ఉండటంతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వీటి నివారణకు ప్రత్యేకమైన మందులు వంటివి లేవు. చెరువుల్లో నీరు నింపుకునే సమయంలో ఇన్‌లెట్ పైపులకు 60 ఎంఎం మెస్‌ను, తరువాత 40 ఎంఎం మెస్ వినియోగించడం ద్వారా దెయ్యం చేపల గుడ్లు చెరువుల్లోకి రాకుండా చూసుకోవాలి. చెరువుల్లో దొరికే దెయ్యం చేపలను చంపి భూమిలో లోతుగా పాతి పెట్టాలి.

– ఎల్ఎల్ఎన్ రాజు, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, భీమవరం

ఆల్‌టైమ్ రికార్డ్ స్థాయికి విద్యుత్ వాడకం

- రాష్ట్రంలో ఒక్కరోజే 263.237 మిలియన్ యూనిట్ల డిమాండ్
- రోజువారీ డిమాండ్ గతేడాది కంటే 28.24 శాతం ఎక్కువ
- ఎలాంటి లోటు లేకుండా వినియోగదారులకు సరఫరా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అత్యంత గరిష్ట స్థాయికి చేరింది. రాష్ట్రంలో శుక్రవారం 263.237 మిలియన్ యూనిట్ల డిమాండ్ నమోదైంది. రాష్ట్ర విభజన తర్వాత ఎనిమిదేళ్లలో విద్యుత్ వాడకం ఇదే ఎక్కువ కావడం గమనార్హం. విద్యుత్ వినియోగం అధికారుల అంచనాలను మించి ఆల్‌టైమ్ రికార్డులను సృష్టిస్తోంది. ఈ మేరకు ఇంధన శాఖ శనివారం విద్యుత్ సరఫరా బులిటెన్‌ను విడుదల చేసింది. ఆ వివరాల ప్రకారం.. ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ డిమాండ్ గతేడాది కంటే 28.24 శాతం ఎక్కువగా ఉంది. గతేడాది ఇదే సమయానికి 205.266 మిలియన్ యూనిట్లు మాత్రమే వినియోగం జరిగింది. రోజులో పీక్ డిమాండ్ 12,738 మెగావాట్లుగా ఉంది. ఇది గతేడాది ఇదే సమయానికి 9,960 మెగావాట్లు మాత్రమే. అంటే రోజువారీ పీక్ డిమాండ్ కూడా 27.89 శాతం పెరిగింది. పగటి పూట సగటు పీక్ డిమాండ్ 10,968 మెగావాట్లు కాగా.. సాయంత్రం వేళల్లో 9,786 మెగావాట్లకు చేరింది. ఇంత భారీ స్థాయిలో విద్యుత్ వాడకం జరుగుతున్నప్పటికీ గృహ, వ్యవసాయ విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా, డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సంస్థలు వినియోగదారులకు కరెంట్ సరఫరా చేస్తున్నాయి. రాష్ట్ర అవసరాలకు ఏపీ జెన్‌కో అత్యధికంగా థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ఆదుకుంటోంది. దీని నుంచి 98.082 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 5.470 మి.యూ, ఏపీ జెన్‌కో సోలార్ నుంచి 2.592 మి.యూ, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్ల నుంచి 38.058 మి.యూ, సెయిల్, హెచ్‌పీసీఎల్, గ్యాస్ వంటి ఇతర విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి 27.531 మి.యూ, పవన విద్యుత్ ద్వారా 50.125 మి.యూ, సౌర విద్యుత్ నుంచి 22.507 మిలియన్ యూనిట్లు సమకూరుతోంది. బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్ సగటు రేటు రూ.6.606 చొప్పున రూ.14.505 కోట్లతో 21.956 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రోజుకు కొనుగోలు చేస్తున్నారు. బిహార్‌లో 5.53 మి.యూ, మహారాష్ట్రలో 2.07 మి.యూ, జార్ఖండ్‌లో 2.22 మి.యూ, హరియాణాలో 6.73 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉంది. అయితే మన రాష్ట్రంలో మాత్రం ఎలాంటి లోటు లేకుండా, అవసరం మేరకు బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేసి మరీ వినియోగదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

తెలంగాణ

బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ వ్యతిరేకతను వీడాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్

కాచిగూడ (హైదరాబాద్): బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ వ్యతిరేఖ వైఖరిని విడనాడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో 'బీసీ బంధు – భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై జరిగిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ అవతరణ అనంతరం ఏర్పడిన కేసీఆర్ ప్రభుత్వం అడుగడుగునా బీసీలను అణచివేతకు గురిచేస్తోందని ఆరోపించారు. జిల్లాల్లో బీసీ కార్పొరేషన్‌కు ఆఫీసులే లేకుండా చేసిందని, బోర్డులు మొత్తం ఎత్తేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో బీసీల కోసం ఏదో చేస్తున్నట్లు కేవలం 15 కులాలకు మాత్రమే ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించిందని, బీసీల్లోని 130 కులాలకు లక్ష రూపాయల పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. బీసీలను విద్యకు దూరం చేసేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేసిందని ధ్వజమెత్తారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి బీసీ సబ్‌ప్లాన్ తీసుకురావాలని అన్నారు. కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జగదీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీల రిజర్వేషన్లు పెంచుతామని అన్నారు.

రేపు హరితోత్సవం

రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొనే అవకాశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా హరితోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భా గంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ హిత కార్యక్రమాలు, హరితహారం విజయాల ప్రదర్శన చేపట్టనున్నారు. 19న ఉదయం రంగారెడ్డి జిల్లా తుమ్మలూరులో ప్రధాన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు తొమ్మిదేళ్ల హరితహారం ఫలితాల ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొనే అవకాశాలున్నాయి. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వపరంగా సూచనలు వెళ్లినట్టు సమాచారం. సాయంత్రం రవీంద్రభారతిలో హరితోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అటవీ రక్షణ, హరితహారంలో పచ్చదనం పెంపునకు కృషి చేసిన ప్రజాప్రతిధులు, అధికారులు, సిబ్బందికి సన్మానం చేస్తారు.

క్లుప్తంగా...

వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ ఓటమి ఖాయం: అఖిలేశ్



లక్నో: వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ఓటమి ఖాయమని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ చెప్పారు. వెనుకబడిన కులాలు, దళితులు, మైనారిటీలే ఎన్‌డీఏను ఓడిస్తారని చెప్పారు. లక్నోలో జరిగిన ఒక కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. 'మాకు పెద్ద జాతీయ పార్టీలు మద్దతిస్తే ఉత్తరప్రదేశ్‌లోని 80 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ ఓడిపోతుంది'అని అన్నారు. ఫలానా రాష్ట్రంలో ప్రతిపక్ష కూటమిలోని ఏ పార్టీ బలంగా ఉందనే అంశాన్ని బట్టి సీట్ల పంపిణీ జరగాలన్నదే తన ఉద్దేశమన్నారు. ప్రతిపక్ష ఐక్య కూటమి ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలపై ఆయన స్పందిస్తూ... 80 సీట్లలోనూ ఓడించి, బీజేపీని బహిష్కరించండి అనేదే తన ఏకైక నినాదమన్నారు. గతంలో కాంగ్రెస్, బీఎస్పీలతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసిన విషయంపై ఆయన..తమ పార్టీ ఎప్పుడూ నిజాయతీగానే వ్యవహరిస్తుందని, సీట్ల పంపకాలపై ఎన్నడూ కొట్లాడలేదని చెప్పుకొచ్చారు. యూపీలోని 80 లోక్‌సభ స్థానాల్లో 2019 ఎన్నికల్లో ఎస్పీ అయిదు సీట్లు మాత్రమే గెలుచుకుంది. అందులో రెండింటిని ఉప ఎన్నికల్లో కోల్పోయింది.

దౌత్య కార్యాలయాలపై దాడులు.. ఎన్‌ఐఏకు దర్యాప్తు బాధ్యత

న్యూఢిల్లీ: అమెరికా, కెనడాల్లోని భారత దౌత్య కార్యాలయాలపై ఖలిస్తానీ మద్దతుదారుల దాడులపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) విచారణ జరపనుంది. మార్చిలో లండన్‌లోని భారత దౌత్య కార్యాలయం వద్ద జరిగిన హింసాత్మక ఘటనలు, దాడికి యత్నం వంటి వాటిపై ఇప్పటికే ఎన్‌ఐఏ దర్యాప్తు జరుపుతోంది. అమెరికా, కెనడా దౌత్య కార్యాలయాలపై దాడులకు సంబంధించి ఢిల్లీ పోలీసు స్పెషల్ విభాగం చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం(ఉపా)కింద కేసులు నమోదు చేసింది. దర్యాప్తు బాధ్యతలను తాజాగా ఎన్‌ఐఏ చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2005లో దౌత్య వీసా ఇవ్వడానికి నిరాకరించిన అమెరికా..

ఇప్పుడు భారత ప్రధానమంత్రి హోదాలో మోదీకి రెడ్ కార్పెట్ వేసి మరీ గ్రాండ్ వెల్కమ్ చెబుతోంది.

అగ్రరాజ్యాధీశుడు జో బైడెన్ అధికారిక పర్యటనకు ఆహ్వానించిన మూడో ప్రపంచ నాయకుడిగా ప్రధాని మోదీ కొత్త చరిత్ర లిఖిస్తున్నారు. ఆప్తమిత్ర దేశాల అధినేతలకే అమెరికా ఇలా తమ దేశానికి రమ్మని ఆతిథ్యం ఇస్తుంది. మోదీ పర్యటనతో ఇరు దేశాల మధ్య బంధాల్లో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది.

బంధం మరింత బలోపేతం



ప్రధాని మోదీ అధికారిక పర్యటనతో.. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయం

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దంపతుల ఆహ్వానం మేరకు జూన్ 21 నుంచి 24 వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అగ్రరాజ్య పర్యటన సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. బైడెన్ కేబినెట్‌లో కీలక మంత్రులు నరేంద్ర మోదీ రాక కోసం ఎదురు చూస్తున్నట్టు బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంలో బంధాలు మరింత బలోపేతమవడానికి మోదీ పర్యటన అత్యంత కీలకంగా మారనుంది. ప్రధాని మోదీ ఇంతకు ముందు చాలాసార్లు అమెరికా వెళ్లినప్పటికీ ఈసారి అమెరికా ప్రభుత్వం అధికారికంగా ఆహ్వానించడంతో ఈ పర్యటనకు ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది.

అయిదు రంగాలే ఎజెండా

అంతర్జాతీయంగా అమెరికా, భారత్ మధ్య బంధం క్రమక్రమంగా బలోపేతమవుతూ వస్తోంది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనాకు చెక్ పెట్టి స్వేచ్ఛాయుత వాణిజ్యం జరగడానికి ఇరుదేశాలు ఒక్కటిగా పని చేస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జీ–20 సదస్సుకి భారత్ ఆతిథ్యం ఇవ్వడానికి ముందు మోదీ అగ్రరాజ్యంలో పర్యటించడం దౌత్యపరంగా మనకు కలిసొచ్చే అంశం. అయిదు కీలక రంగాల్లో వ్యూహాత్మక సహకారం కోసం బైడెన్, మోదీ చర్చలు జరిపే అవకాశాలున్నాయి. రక్షణ, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానం, సంప్రదాయేతర ఇంధనం, విద్య–విజ్ఞానం రంగాల్లో సహకారానికి ఒప్పందాలు కుదుర్చుకుని సంయుక్త ప్రకటన చేసే అవకాశం ఉంది. అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి అయిదేళ్లలోనే ప్రధాని మోదీ రెండోసారి ప్రసంగించనున్నారు. 2016, జూన్ 8న మోదీ తొలిసారిగా కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడారు. బ్రిటన్ తరఫున విన్‌స్టన్ చర్చిల్, దక్షిణాఫ్రికా నుంచి మండేలా తర్వాత రెండు సార్లు కాంగ్రెస్‌నుద్దేశించి ప్రసంగించే అవకాశం మోదీకే వచ్చింది. ఈ సమావేశంలో మోదీ ఏం మాట్లాడతారన్న దానిపై ప్రపంచం యావత్తూ ఆసక్తిగా ఎదురు చూస్తోంది. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు అన్ని విధాలుగా అమెరికా అండదండగా ఉంటే, తటస్థ వైఖరి అవలంబిస్తున్న భారత్‌కు ఈ అంశాన్ని డీల్ చేయడమే అతి పెద్ద సవాల్‌గా మారింది. రష్యాతో సన్నిహితంగా ఉంటూ రక్షణ రంగంలో భారీగా ఒప్పందాలు కుదుర్చుకున్న భారత్ ఇప్పుడు అమెరికా నుంచి 30 ఎంక్యూ–9బీ డ్రోన్ల కొనుగోలు ఒప్పందం చేసుకోనుంది. 2015–19 మధ్య కాలంలో అమెరికా నుంచి భారత్ రక్షణ రంగ దిగుమతులు 14 శాతం ఎగబాకాయి. అత్యాధునిక టెక్నాలజీని అగ్రరాజ్యం నుంచి అందిపుచ్చుకొని ప్రపంచ దేశాల్లో సూపర్ పవర్‌గా భారత్ మారడానికి మోదీ పర్యటన సాయపడుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

ప్రధాని మోదీ అమెరికా "స్టేట్ విజిట్" అనేది దౌత్యపరంగా అత్యున్నత స్థాయి పర్యటన. సుదృఢమైన సంబంధాలు కలిగిన మిత్రదేశాల అధినేతలకే అమెరికా ఇలాంటి పర్యటనలకి ఆహ్వానిస్తుంది.ఈ పర్యటన అంతా పలు వేడుకలతో ఉల్లాసంగా ఉత్సాహంగా సాగుతుంది. ప్రధాని మోదీ అమెరికాలో విమానం దిగిన దగ్గర నుంచి తిరుగు ప్రయాణమయ్యే వరకు రాచమర్యాదలతో పర్యటన సాగుతుంది. మ్యూజికల్ బ్యాండ్‌తో ఘనంగా స్వాగతం పలుకుతారు. శ్వేత సౌధంలో అడుగుపెట్టినప్పుడు 21సార్లు తుపాకుల్ని గాల్లో పేల్చి గౌరవ వందనం సమర్పిస్తారు. వైట్‌హౌస్‌లో ఇచ్చే విందు సమయంలో భారీగా కానుకల్ని సమర్పిస్తారు. అమెరికా అధ్యక్షుడి అతిథి గృహం బ్లెయిర్ హౌస్‌లో బసకల్పిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పర్యటన అంతా సందడిగా సాగేలా చూస్తారు.

ఎందుకీ రెడ్ కార్పెట్..?

దశాబ్దకాలంగా అమెరికా రాజకీయాల్లో ప్రవాస భారతీయుల పాత్ర విస్తృతమైంది. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది భారతీయులు అక్కడ కీలక ఓటు బ్యాంకుగా మారారు. ప్రతీసారి అధ్యక్ష ఎన్నికల్లో భారత సంతతికి చెందిన వ్యక్తి పోటీ పడుతూ వస్తున్నారు. గత ఎన్నికల్లో భారత సంతతికి చెందిన కమలా హ్యారిస్ ఏకంగా ఉపాధ్యక్ష పదవి అందుకున్నారు. బైడెన్ తన ప్రభుత్వంలో కూడా భారతీయుల్ని నియమించడానికే ప్రాధాన్యం ఇచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న అమెరికా ఎన్నికల్లో అభ్యర్థిత్వం కోసం భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి పోటీ పడుతున్నారు. స్వింగ్ రాష్ట్రాల్లో ఇండియన్ అమెరికన్ల ఓట్లు అత్యంత కీలకమని గత ఎన్నికల్లోనే తేటతెల్లమైంది. గత ఎన్నికల్లో 74 శాతం మంది ఇండియన్ అమెరికన్లు బైడెన్‌కు మద్దతునిచ్చారని సర్వేల్లో తేలింది. ఇప్పుడు ప్రధాని మోదీకి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా డెమొక్రాట్లు భారత్‌కి దగ్గరన్న సంకేతాలు ప్రవాస భారతీయులకు పంపడానికే మోదీని ఆహ్వానించారని ఆసియన్ అమెరికన్లపై అధ్యయన సంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న సారా సాధ్వాని అభిప్రాయపడ్డారు. అమెరికాలో ప్రధాని మోదీకున్న ఇమేజ్ రాను రాను పెరుగుతూ వస్తోంది. 2014లో మోదీ ప్రధాని పదవి చేపట్టిన తర్వాత అమెరికా వెళ్లినప్పుడు న్యూయార్క్‌లోని మ్యాడిసన్ స్క్వేర్‌లో 20 వేల మంది ప్రవాస భారతీయులు ఆయన సమావేశానికి వచ్చారు. 2019లో హ్యూస్టన్‌లో హౌడీమోదీ కార్యక్రమానికి 50 వేల మంది హాజరయ్యారు. ఈసారి టైమ్ స్క్వేర్ నుంచి నయాగారా జలపాతం వరకు ఇండియన్ అమెరికన్లు మోదీ అధికారిక పర్యటనకు వస్తూ ఉండడంతో గర్వంతో ఉప్పొంగిపోతున్నారు.

ఆగని మణిపూర్ హింసాకాండ

- పోలీసులతో ఆందోళనకారుల ఘర్షణ, పలు ప్రాంతాలపై దాడులు
- ఆయుధాగారాన్ని కొల్లగొట్టేందుకు విఫలయత్నం
- అడ్డుకున్న బలగాలు

ఇంఫాల్/కోల్‌కతా: కుకీ, మెయిటీ జాతుల మధ్య ముదిరిన వివాదం మణిపూర్‌లో హింసాకాండను ఆగనివ్వట్లేదు. తాజాగా శుక్రవారం మొదలైన ఘర్షణలు శనివారం సైతం ఎక్కువయ్యాయి. ఆందోళనకారుల దాడులు, సైన్యం, పోలీసుల భాష్పవాయు గోళాలు, రబ్బర్ బుల్లెట్ల ప్రయోగంతో పరిస్థితి ఉద్రిక్తంగా తయారైంది. ఇంఫాల్ పట్టణంలో శుక్రవారం రాత్రి మొదలైన ఘర్షణల్లో ఇద్దరు పౌరులు గాయపడ్డారు. బీజేపీ నేతల ఇళ్లను తగలబెట్టేందుకు అల్లరిమూక ప్రయత్నించడం, దానిని భద్రతా బలగాలు అడ్డుకోవడంతో మొదలైన ఘర్షణల్లో ఈ ఇద్దరు గాయపడ్డారు. బిష్ణుపూర్ జిల్లాలోని క్వాక్తా పట్టణంలో, చురాచాంద్‌పూర్ జిల్లాలోని కాంగ్‌వాయ్‌లలో జరిగిన వేర్వేరు ఘటనల్లో తుపాకీ కాల్పులూ జరిగాయి.

పోలీస్‌స్టేషన్‌పై 400 మంది దాడి

ఇంఫాల్ పశ్చిమ ప్రాంతంలోని ఇరింగ్‌బామ్ పోలీస్‌స్టేషన్‌లోని ఆయుధాగారంపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్లేందుకు అల్లరిమూక విఫలయత్నం చేసింది. శుక్రవారం అర్ధరాత్రి వేళ దాదాపు 400 మంది ఆందోళనకారులు గుంపుగా దాడిచేసి ఆయుధాగారాన్ని కొల్లగొట్టే ప్రయత్నంచేయగా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళాలు విజయవంతంగా అడ్డుకున్నాయి. ఆందోళనకారులు గుమికూడకుండా ఉండేందుకు హెచ్చరికగా సైన్యం, అస్సాం రైఫిల్స్ బలగాలు, మణిపూర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళాలు సంయుక్తంగా ఇంఫాల్ పట్టణంలో అర్ధరాత్రిదాకా కవాతు నిర్వహించాయి.

1,000 మంది మూకుమ్మడిగా..

ఇంఫాల్‌లోని ప్యాలెస్ కాంపౌండ్‌లో భవంతులకు నిప్పుపెట్టేందుకు దాదాపు 1,000 మంది ఆందోళనకారులు ప్రయత్నించారు. వారిని చెదరగొట్టేందుకు ఆర్‌ఏఎఫ్ బలగాలు భాష్పవాయు గోళాలు, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించాయి. మరో చోట ఎమ్మెల్యే బిశ్వజీత్ ఇంటిని తగలబెట్టేందుకు ఆందోళనకారులు ప్రయత్నించగా ఆర్‌ఏఎఫ్ బలగాలు వారిని చెదరగొట్టాయి. సింజెమాయ్ ప్రాంతంలోని బీజేపీ కార్యాలయానికి నిప్పుపెట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. వీరిని సైనికులు అడ్డుకున్నారు. ఇంఫాల్‌లోని పోరంపేట్‌లో రాష్ట్ర బీజేపీ మహిళా విభాగం అధ్యక్షురాలు శారదా దేవి ఇంటిని తగలబెట్టేందుకు యువత ప్రయత్నించగా భద్రతా బలగాలు చెదరగొట్టాయి. అంతకుముందు శుక్రవారం అంతా ఇంఫాల్ నడిబొడ్డున రహదారులను దిగ్బంధిస్తూ ఆస్తులను తగలబెడుతూ అల్లరిమూక హింసాకాండను కొనసాగించింది. గురువారం రాత్రి కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి రంజన్ సింగ్ ఇంటిపై దాడి చేసి నిప్పుపెట్టిన విషయం విదితమే. ఆ సమయానికి ఆయన ఇంట్లో లేరు. పదవీవిరమణ చేసిన దళిత ఐఏఎస్ అధికారికి చెందిన గిడ్డంగినీ ఆందోళనకారులు భస్మంచేశారు. వాంగ్‌ఖేయ్, పోరోమ్‌పట్, థంగపట్‌లలోనూ రోడ్లకు అడ్డంగా దుంగలు, టైర్లు కాల్చి రాకపోకలను స్తంభింపజేశారు.



ఇంఫాల్‌లో రోడ్లపై నిర్మాణ సామగ్రికి నిప్పుపెట్టిన ఆందోళనకారులు

నెలరోజుల్లో వందకుపైగా మరణాలు

నెలరోజుల క్రితం కుకీ, మెయిటీ జాతుల మధ్య మొదలైన వైరంలో 100 మందికిపైగా మరణించారు. తప్పుడు సమాచారం, వదంతుల వ్యాప్తిని నివారించేందుకు 11 జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించారు. మెయిటీ వర్గానికి షెడ్యూల్ తెగ హోదా కట్టబెట్టాలన్న సిఫార్సుపై కుకీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గిరిజనుల సంఘీభావ ర్యాలీ పేరిట కుకీలు మొదలుపెట్టిన యాత్ర హింసాత్మకంగా మారి నెలరోజులైనా మణిపూర్‌లో రావణకాష్టం ఆగట్లేదు. రాష్ట్ర జనాభాల్లో దాదాపు 53 శాతమున్న మెయిటీలు ఎక్కువగా ఇంఫాల్ లోయ ప్రాంతాల్లో నివసిస్తారు. గిరిజనులైన నాగాలు, కుకీల జనాభా రాష్ట్ర జనాభాలో దాదాపు 40 శాతం. వీరు ఎక్కువగా కొండ ప్రాంత జిల్లాల్లో ఉంటారు.

బిపర్‌జోయ్ పంజా రాజస్తాన్‌పై

- తుపాను ధాటికి రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షపాతం
- గుజరాత్ కచ్‌లో సాధారణ పరిస్థితులు

జైపూర్/భుజ్: గుజరాత్ తీరప్రాంత జిల్లాలను అతలాకుతలం చేసిన బిపర్‌జోయ్ తుపాను పక్కనే ఉన్న రాజస్తాన్‌పై ప్రతాపం చూపుతోంది. తుపాను దెబ్బకు గుజరాత్‌ను ఆనుకుని ఉన్న రాజస్తాన్ జిల్లాల్లో కుండపోతగా వర్షం కురుస్తోంది. మౌంట్ అబూలో 210 మిల్లీమీటర్లు, సెద్వాలో 136 మిల్లీమీటర్లు.. ఇలా తదితర ప్రాంతాల్లో తెరిపినివ్వకుండా వర్షం పడుతోంది. ఎడతెగని వర్షాలు పడతాయంటూ వాతావరణ శాఖ బార్మెర్, జలోర్, సిరోహి జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించింది. పాలీ, జోధ్‌పూర్ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. త్వరలోనే రాష్ట్రంలో తుపాను మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. అయితే సోమవారం దాకా వర్షాలు ఆగవని వారు వెల్లడించారు. ఓవైపు వర్షాలు పడుతున్నా మరోవైపు రాష్ట్రంలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ధోల్పూర్ ప్రాంతంలో 41.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. తుపాను కారణంగా నార్త్ వెస్టర్న్ రైల్వే జోన్‌లో రైళ్ల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.



మండ్వీలోని ఆస్పత్రిలో తుపాను బాధితులను పరామర్శిస్తున్న అమిత్ షా, సీఎం పటేల్

జఖౌలో షా పర్యటన, పరామర్శ..

సొంత రాష్ట్రం గుజరాత్‌లో తుపానుతో దెబ్బతిన్న ప్రాంతాల్లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటించారు. ఏరియల్ సర్వే చేశారు. సహాయక కార్యక్రమాలు జరిగిన ప్రాంతాల్లో పనుల్లో నిమగ్నమైన ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అభినందించారు. జఖౌ, మండ్వీలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బాధితులను పరామర్శించారు. భుజ్‌లో సమీక్షా సమావేశంలో పాల్గొని తాజా పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెల్సుకున్నారు. తుపాను బీభత్సం నుంచి నెమ్మదిగా గుజరాత్‌లోని కచ్ జిల్లా పట్టణాలు, గ్రామాలు కోలుకుంటున్నాయి. వరద నీరు నివాసాలు, రహదారులను వదలడంతో వ్యాపారాలు, దుకాణాలు తెరుచుకున్నాయి. గురువారం సాయంత్రం జఖౌ పోర్టులో తీరాన్ని తాకిన తుపాను భీకర రూపం దాల్చి కుండపోత వర్షాలతో ముంచెత్తడం తెల్సిందే. త్వరలో అది వాయుగుండం మారి బలహీనమవనుందని అధికారుల తెలిపారు. శనివారం సైతం బనస్కాంతా జిల్లా, పటాన్ ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. పటాన్, మెహసానా, కచ్ జిల్లాల్లోని కొన్ని చోట్ల ఆదివారం సైతం భారీ వర్షాల ముప్పు పొంచి ఉందని వెల్లడించారు. గాంధీనగర్, అహ్మదాబాద్, సురేంద్రనగర్, మోర్బీ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉండొచ్చు.

సగం రాష్ట్రాలకు వడగాల్పుల వెతలు

- తెలుగు రాష్ట్రాలు సహా మరికొన్ని చోట్లా ఇదే పరిస్థితి
- హెచ్చరించిన భారత వాతావరణ సంస్థ

న్యూఢిల్లీ: సూర్య ప్రతాపానికి దాదాపు సగం భారతదేశ రాష్ట్రాలు చెమటతో తడిసి ముద్దవుతున్నాయి. భానుడి భగభగలతో మొదలైన వడగాల్పులు మరో 3–4 రోజులు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ వేడి వేడి వార్తను పట్టుకొచ్చింది. మండే ఎండలను భరిస్తున్న రాష్ట్రాల జాబితాలో తెలుగు రాష్ట్రాలూ ఉన్నాయి. రుతుపవనాలు తలుపుతట్టినా వడగాల్పులు మాత్రం వదిలిపోవట్లేవు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలుసహా విదర్భ ప్రాంతాల్లో తీవ్రస్థాయి నుంచి అతి తీవ్రస్థాయిలో వడగాల్పుల పరిస్థితులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే బిహార్‌లో రెడ్‌అలర్ట్‌ను ప్రకటించారు. శనివారం(జూన్ 17)దాకా జార్ఖండ్‌లో స్కూళ్లు తెరుచుకోనేలేదు. ఛత్తీస్‌గఢ్, గోవాల్లోనూ ఇదే పరిస్థితి. వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతలు, రాత్రిపూట ఉష్ణోగ్రతలపై వాతావరణ శాఖ శనివారం తెలిపిన వివరాల ప్రకారం..



- తెలంగాణ, రాయలసీమ, మధ్యప్రదేశ్ పశ్చిమ ప్రాంతం, తమిళనాడు రాష్ట్ర ప్రజలు ఆదివారం(జూన్ 18న) కూడా వడగాల్పులను భరించాల్సిందే.
- ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలు, యానాం, మధ్యప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతాలు, తూర్పు యూపీ, బిహార్‌లో మరో రెండు రోజులు ఎండలు మరింత మండుతాయి.
- ఒడిశా, విదర్భ ప్రాంతాల్లో మరో నాలుగు రోజులపాటు వడగాల్పులు కొనసాగుతాయి.
- పశ్చిమబెంగాల్‌లోని గంగా పరీవాహక ప్రాంతాలు, జార్ఖండ్‌లో మరో 3 రోజులు ఎండలు మరింత ముదురుతాయి.
- రాత్రిపూట సైతం ఉష్ణోగ్రతలు హైస్థాయిలోనే ఉండే అవకాశం ఉంది.
- విదర్భ, ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతాల్లో ఆదివారం ఈ పరిస్థితులు ఉంటాయి.
- మధ్యప్రదేశ్ తూర్పు ప్రాంతాలు, ఛత్తీస్‌గఢ్‌లలో రెండు రోజులు రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువే ఉండనున్నాయి.
- మధ్య భారతం, తూర్పు భారతం, దక్షిణ భారతదేశంలో వచ్చే మూడు రోజులూ ఉష్ణోగ్రతల్లో మార్పేమీ ఉండదు.
- ఆ తర్వాత మాత్రం 2–4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత తగ్గొచ్చు.

బోస్ ఉంటే దేశ విభజన జరిగేది కాదు

నేతాజీ స్మారకోపన్యాసంలో ఎన్‌ఎస్‌జీ అజిత్ ధోవల్



న్యూఢిల్లీ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవించి ఉంటే మనదేశం విడిపోయి ఉండేది కాదని జాతీయ భద్రతా సలహాదారు(ఎన్‌ఎస్‌జీ) అజిత్ ధోవల్ చెప్పారు. అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(అసోచామ్) శనివారం ఢిల్లీలో నిర్వహించిన మొదటి నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్మారక ఉపన్యాసంలో ఆయన ప్రసంగించారు. 'బోస్ నాయకత్వ సామర్థ్యాలు అసాధారణమైనవి. ఆయన దేశాన్ని కుల, మత, జాతి విభజనలకు అతీతమైన ఒక వాస్తవంగా గుర్తించారు. ఐక్య భారతం కోసం ఆయన కలలుగన్నారు. ఆయన ప్రసిద్ధ నినాదం కదమ్ కదమ్ బఢాయే జా'అన్ని వర్గాల ప్రజలను కదిలించింది. ద్విజాతి సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చిన మహ్మద్ అలీ జిన్నా సైతం చంద్రబోస్ ఒక్కరినే నాయకుడిగా గుర్తిస్తానని చెప్పారు. స్వాతంత్య్రం వచ్చే నాటికి బోస్ జీవించి ఉంటే భారతదేశ విభజన జరిగి ఉండేది కాదు'అని దోవల్ పేర్కొన్నారు. నేతాజీ తన జీవితంలోని వివిధ క్లిష్టమైన దశల్లో సాహసోపేతంగా వ్యవహరించారు. అప్పట్లో తిరుగులేని నేతగా ఉన్న గాంధీని సైతం నమ్మిన సిద్ధాంతం కోసం ఎదిరించిన ధైర్యం ఆయన సొంతం. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి మళ్లీ స్వాతంత్య్ర పోరాటం సాగించారు'అని ఎన్‌ఎస్‌జీ అప్పటి పరిణామాలను గుర్తుచేశారు. ప్రజల సామర్థ్యాలపై నేతాజీకి అపారమైన నమ్మకం ఉండేదన్నారు. దేశాభివృద్ధిపై ధోవల్ మాట్లాడుతూ.. 'మన దేశానికున్న అతిపెద్ద బలం మానవ వనరులు...చురుకైన నిబద్ధత కలిగిన శ్రామికశక్తి. క్లిష్టమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంతోపాటు, మన శ్రామిక శక్తిని అంతర్జాతీయంగా పోటీ పడేలా నైపుణ్యాలను పెంపొందించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించాలి'అని అన్నారు.

బాలలపై తీవ్రవాదుల రాక్షసక్రీడ

- ఉగాండా ప్రైమరీ స్కూలుకు అర్ధరాత్రి నిప్పు
- 38 మంది విద్యార్థులు సహా 41 మంది ఊచకోత

కంపాలా: ఆఫ్రికా దేశం ఉగాండాలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. అర్ధరాత్రి స్కూలుకు నిప్పుపెట్టిన తీవ్రవాదులు, అందులోని కొందరు విద్యార్థులను సజీవ దహనం చేశారు. కొందరిని తుపాకీతో కాల్చి చంపేశారు. మరికొందరిని కత్తులతో నరికారు. ఈ ఘోర ఘటనలో 38 మంది విద్యార్థులు సహా ఒక గార్డు, ఇద్దరు స్థానికులు కలిపి మొత్తం 41 మంది ప్రాణాలు కోల్పోయారు. కొన్ని మృతదేహాలు గుర్తు పట్టేందుకు కూడా వీలుకానంతగా కాలిపోయాయి. క్షతగాత్రులైన మరో 8 మంది స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాంగోతో సరిహద్దుల్లో మారుమూల కసేస్ జిల్లాలోని ప్రైవేట్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.మొత్తం అయిదుగురు ముష్కరులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు భావిస్తున్నారు. దోచుకున్న ఆహార పదార్థాలను మోసుకెళ్లేందుకు మరో ఆరుగురు విద్యార్థులను బలవంతంగా వెంట తీసుకెళ్లారు. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాంగోలోని విరుంగా నేషనల్ పార్క్ ఏరియా వైపుగా వెళ్లినట్లు సమాచారం అందడంతో ఉగాండా బలగాలు వేట ప్రారంభించాయి. ఇస్లామిక్ స్టేట్ గ్రూప్‌తో సంబంధాలున్న అలైడ్ డెమొక్రాటిక్ ఫోర్స్(ఏడీఎఫ్) అనే తీవ్రవాద సంస్థ ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

మన సంస్కృతితో యువత బంధం బలీయం: ప్రధాని

న్యూఢిల్లీ: మన దేశ అద్భుతమైన వారసత్వాన్ని పునరుజ్జీవింపజేయడం, గౌరవించడం కోసం కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా చేపట్టిన అనేక చర్యలు చేపట్టిందని ప్రధాని మోదీ తెలిపారు. ఘనమైన మన సాంస్కృతిక వారసత్వ సంపద మనకు గర్వకారణమన్నారు. తమ ప్రభుత్వం సాగించిన ప్రయత్నాల ఫలితంగానే మన యువతకు సంస్కృతితో బంధం బలపడిందని అన్నారు. శనివారం ఆయన ట్విట్టర్‌లో '9ఇయర్స్ ఆఫ్ ప్రిజర్వింగ్ కల్చర్'పేరుతో హాష్‌ట్యాగ్ చేశారు. మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఆయన పలు ట్వీట్లు చేశారు. దేశ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన ప్రస్తావించారు.

సూడాన్‌లో వైమానిక దాడి.. 17 మంది మృతి

కైరో: సూడాన్ రాజధాని ఖార్టూమ్‌పై శనివారం జరిగిన వైమానిక దాడిలో అయిదుగురు చిన్నారులు సహా 17 మంది చనిపోయారు. ఆర్మీకి, శక్తివంతమైన పారామిలటరీ విభాగం ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్(ఆర్‌ఎస్‌ఎఫ్)కు మధ్య ఏప్రిల్ నుంచి ఆధిపత్య పోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. మిలటరీ విమానాలు ఆర్‌ఎస్‌ఎఫ్‌పై దాడులు జరుపుతుండగా, ఆర్‌ఎస్‌ఎఫ్ బలగాలు డ్రోన్లతో సైన్యంపై దాడులకు దిగుతోంది. ఖార్టూమ్‌లోని యోర్మౌక్ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య భీకరపోరు సాగుతోంది. ఈ నేపథ్యంలో తాజా దాడికి ఎవరు కారణమనే విషయం స్పష్టం కాలేదు. ఈ దాడిలో మరో 11 మంది వరకు గాయపడినట్లు మానవతా సాయం అందిస్తున్న ఒక సంస్థ అంటోంది. మిలటరీయే అక్కడ దాడి చేసిందని, తాము ఒక మిగ్ యుద్ధ విమానాన్ని కూల్చివేశామని ఆర్‌ఎస్‌ఎఫ్ అంటోంది. ఆర్మీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అరబ్ మిలీషియాకు చెందిన జన్‌జవీద్ సంస్థ ఆర్‌ఎస్‌ఎఫ్‌తో కలిసి పోరాడుతోందని సమాచారం. జన్‌జవీద్‌ను విమర్శించినందుకే ఇటీవల పశ్చిమ దర్ఫర్ గవర్నర్ ఖమిస్ అబ్దల్లా అబ్‌కర్‌ను చంపేశారని విమర్శలు వస్తున్నాయి.

సుపరిపాలనకు సమష్టిగా కృషిచేయండి

- అప్పుడే విజయపథంలో భారత్ సమున్నత శిఖరాలకు చేరుతుంది
- శాసనసభ్యులకు ప్రధాని మోదీ సందేశం

ముంబై: సుపరిపాలనకు శాసనసభ్యులు సమష్టిగా కృషిచేయాలని ప్రధాని మోదీ ఉద్బోధించారు. ముంబైలో మూడ్రోజులుగా జరుగుతున్న జాతీయ శాసనసభ్యుల సదస్సుకు ప్రధాని మోదీ శనివారం ఒక సందేశం పంపించారు. అందులో మోదీ ఏమన్నారంటే.. ' సుపరిపాలన, విజయవంతమైన శాసనాల పరిశీలన, అభివృద్ధి నమూనాలు వంటి ప్రజాస్వామ్య విధానాల రూపకల్పన, వాటి పటిష్టత కోసం భిన్న పార్టీల ప్రతినిధులైన శాసనసభ్యులు ఇలా ఒక్క చోటుకు చేరడం నిజంగా విశేషమైన పరిణామం. దేశం అమృతకాలంలో పయనిస్తున్న ఈ తరుణంలో విధాననిర్ణేతలంతా సమష్టిగా చేసే కృషి.. దేశం అభివృద్ధి పథంలో సమున్నత శిఖరాలకు చేరుస్తుందన్న దృఢ విశ్వాసం నాలో ఇనుమడిస్తోంది. క్షేత్ర స్థాయి నుంచే నిరంతరాయంగా అభివృద్ధిని కాంక్షిస్తూ చేసే కృషి చివరకు 'వైభవోపేత, అభివృద్ధి చెందిన భారత్' అనే స్వప్నాన్ని నిజం చేస్తుంది' అని అన్నారు. ' ప్రజలతో మమేకమవడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర అత్యంత కీలకం. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన శాసనసభ్యులు ఒకరినొకరు తెల్సుకుని ఆయా నియోజకవర్గాల్లో వారి సమర్థ పనితీరును అర్థం చేసుకునేందుకు జాతీయ శాసనసభ్యుల సదస్సు చక్కని వేదిక. పనితీరును బేరీజువేసుకుని మెరుగైన అభివృద్ధి నమూనాలతో శాసనసభ్యులు మరింతగా దూసుకుపోగలరనే నమ్మకం నాలో ఎక్కువైంది' అని మోదీ వ్యాఖ్యానించారు. ఐఎంఐ–స్కూల్ ఆఫ్ గవర్నెన్స్ ఈ సదస్సును ఏర్పాటుచేసింది. శనివారంతో ముగిసిన ఈ మూడ్రోజుల సదస్సులో దేశవ్యాప్తంగా మొత్తంగా 1,500 మందికిపైగా శాసనసభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వెంకయ్య, బృందాకారత్, మీరాకుమార్ తదితరులు

న్యాయవ్యవస్థ చట్టాలు చేయలేదు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

చట్టాల రూపకల్పనలో అత్యున్నతమైన, తుది నిర్ణయాధికారం శాసనవ్యవస్థదేనని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం ముంబైలో జాతీయ శాసనసభ్యుల సదస్సులో ఆయన ప్రసంగించారు.' చట్టాలు చేయడంలో శాసనవ్యవస్థ పాత్ర సర్వోన్నతం. ఈ ప్రక్రియలో న్యాయవ్యవస్థకు ఎలాంటి పాత్ర లేదు. కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థల పాత్రలను రాజ్యాంగం సుస్పష్టంగా నిర్వచించింది. ఏదైనా అంశంలో తామే సర్వోన్నతులమని భావించి పరిధులను దాటడానికి ఈ వ్యవస్థలు ప్రయత్నించకూడదు. శాసనాలను చేసే బాధ్యత రాజ్యాంగం కేవలం శాసనవ్యవస్థలకే అప్పజెప్పింది. రాజ్యాంగానికి బద్ధమై ఆయా చట్టాలు ఉన్నాయో లేదో అని తేల్చే సమీక్షాధికారం మాత్రం న్యాయవ్యవస్థకే ఉంది. కోర్టులు చట్టాన్ని రూపొందించలేవు. ఈ విషయాన్ని అవి మననం చేసుకుంటే చాలు' అని వెంకయ్య వ్యాఖ్యానించారు.

మావోయిస్టులకు చెందిన రూ.10 లక్షలు స్వాధీనం

బిజాపూర్: నిషేధిత మావోయిస్టు పార్టీ నేతలకు చెందినట్లుగా భావిస్తున్న రూ.10 లక్షల విలువైన రూ.2 వేల నోట్లను పోలీసులు పట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్‌లో చోటుచేసుకుంది. గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్నార్ గ్రామానికి చెందిన దినేశ్ తాటి(23) శుక్రవారం స్థానిక ట్రాక్టర్ షోరూంకు వచ్చాడు. పోలీసులు అతడిని అనుమానంతో ప్రశ్నించగా గంగలూర్ ఏరియా కమిటీ మావోయిస్టులు ఆ నోట్లను మార్చాలంటూ తనకు ఇచ్చారని వెల్లడించాడు. రూ.2 వేల నోట్లతో ట్రాక్టర్ కొనేందుకు వచ్చానన్నాడు. ఇటీవల రూ.2 వేల నోట్లను చలామణీ నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్‌బీఐ.. సెప్టెంబర్ 30ని ఆఖరు తేదీగా నిర్ణయించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఛత్తీస్‌గఢ్ పోలీసులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచారు. మే 25న మావోయిస్టు కమాండర్ ఇచ్చిన రూ.6 లక్షల విలువైన 2 వేల నోట్లను పట్టుకుని, బిజాపూర్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ నెల 10న దంతెవాడ జిల్లాలోనూ రూ.1 లక్ష విలువైన రెండు వేల నోట్లను పట్టుకుని, ముగ్గురు మావోయిస్టు సానుభూతి పరులను అదుపులోకి తీసుకున్నారు.

ఈడీ విచారణలో సెంథిల్ బాలాజీ

సాక్షి, చెన్నై : విద్యుత్, ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ వద్ద ఈడీ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. డాక్టర్ల అనుమతితో ఈ విచారణ జరుగుతోంది. మనీ లాండరింగ్ కేసులో సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన ఆయనకు శస్త్ర చికిత్స నిర్వహణ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కావేరి ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో సెంథిల్ ఉన్నారు. ఈ పరిస్థితులలో ఆయన్ను విచారించేందుకు ఈడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై చెన్నై జిల్లా కోర్టు స్పందించింది. ఎనిమిది రోజుల పాటు విచారణకు అవకాశం కల్పించారు. దీంతో ఈడీ అధికారులు కోర్టు ఉత్తర్వుల నకలును డాక్టర్ల ద్వారా సెంథిల్ బాలాజీకి శనివారం అందజేసినట్టు తెలిసింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా, వైద్యుల పర్యవేక్షణలో సెంథిల్ బాలాజీ వద్ద ఈడీ అధికారులు విచారణను మొదలెట్టినట్టు సమాచారం.

న్యూస్‌రీల్

వందే భారత్‌లో మార్పులకు నిర్ణయం



సాక్షి, చెన్నై: వందే భారత్ రైలులో స్వల్పమార్పులకు ఐసీఎఫ్ నిర్ణయించినట్టు సమాచారం. స్వదేశీ పరిజ్ఞానంతో చెన్నై పెరంబూరు ఐసీఎఫ్ నుంచి వందేభారత్ రైలు పట్టాల మీదకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది 8 బోగీలతో కూడిన మరో 77 రైళ్ల తయారీలో ఐసీఎఫ్ వర్గాలు ఉన్నాయి. ఈ పరిస్థితులలో వర్షం కారణంగా వందేభారత్ రైలు బోగీల్లోకి నీళ్లు వస్తున్నట్టుగా వీడియోలు వైరల్ కావడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. రైలు పై భాగంలో నిల్వ ఉన్న నీటి కారణంగా ఈ లీకేజీ గుర్తించినట్టు సమాచారం. కొన్ని పరికరాలను మరీ కింది భాగంలో అమర్చడం వలన నీటి నిల్వకు అవకాశం కల్పించినట్టు విచారణలో తేల్చారు. దీంతో ఇక తయారు చేయనున్న బోగీలలో కొన్ని మార్పులు చేయడానికి సిద్ధమయ్యారు.ఈ విషయంగా ఓ అధికారి పేర్కొంటూ కొన్ని రకాల ఉపకరణల కారణంగా ఈ లీకేజీ గుర్తించామని, వాటిలో మార్పులు చేస్తే ఎలాంటి సమస్య తలెత్తదని వివరించారు.

విదేశాలకు మేయర్ ప్రియ



ప్రియ

సాక్షి, చెన్నై: చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ విదేశీ పర్యటనకు వెళ్లారు. వారం రోజులు ఆమె స్పెయిన్, ఫ్రాన్స్, ఇటలీలలో అధికారిక పర్యటన చేయనున్నారు. గత ఏడాది జరిగిన నగర పాలక సంస్థల ఎన్నికల ద్వారా చెన్నై రాజకీయ తెరపైకి ప్రియ వచ్చిన విషయం తెలిసిందే. కార్పొరేటర్‌గా తొలిసారి డీఎంకే తరఫు ఎన్నికలతో మేయర్ పదవికి అర్హత సాధించారు. అతిపిన్న వయస్సులో చెన్నై మేయర్ పగ్గాలు చేపట్టి నగరాభివృద్ధిలో దూసుకెళ్తున్నారు. ప్రజల వద్దకే మేయర్ అంటూ నేరుగా ఆయా ప్రాంతాలకు వెళ్లి మరీ విజ్ఞప్తులను స్వీకరించి పరిష్కరిస్తున్నారు. ఈ పరిస్థితులలో పర్యావరణ పరిరక్షణ, వేస్ట్ మేనేజ్ మెంట్ అంశాలపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఆమెను విదేశీ పర్యటనకు ఎంపికచేయడం విశేషం. శనివారం రాత్రి చెన్నై నుంచి డెప్యూటీ మేయర్ మహేశ్వరన్, పలువురు అధికారులతో కలిసి ఆమె విదేశీ పర్యటనకు వెళ్లారు. ఈనెల 24వ తేదీ చెన్నైకు తిరుగు పయనం కానున్నారు. ఆయా దేశాల్లో అమల్లో ఉన్న పథకాలను చెన్నైలో అమలు చేయడానికే ఈ పర్యటన అని అధికారులు పేర్కొన్నారు.


ముత్తంగి సేవలో వీరరాఘవుడు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత వీరరాఘవుడు

తిరువళ్లూరు: పట్టణంలోని వైద్యవీరరాఘవుడి ఆలయంలో ముత్తంగిసేవ అత్యంత వైభవంగా జరిగింది. తిరువళ్లూరులోని వైద్యవీరరాఘవుడి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆలయంలో ప్రతి ఏటా వైశాఖం నెలలో వచ్చే అమావాస్య రోజు శ్రీదేవి భూదేవి సమేత వైద్యవీరరాఘవుడికి ముత్తంగిసేవతో పాటు తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే శనివారం ఉదయం స్వామి వారికి ముత్తంగి సేవను నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారు దర్శనమిచ్చారు. రాత్రి ఏడున్నర గంటలకు తెప్పోత్సవం నిర్వహించారు.

తిరుత్తణి హుండీ ఆదాయం రూ.1.22 కోట్లు



తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో 25 రోజుల వ్యవధిలో భక్తులు హుండీల ద్వారా రూ.1.22 కోట్లు కానుకలుగా సమర్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కుల నిమిత్తం కొండ ఆలయంలోని హుండీల్లో కానుకలు సమర్పిస్తారు. భక్తులు చెల్లించిన కానుకలు ప్రతి నెలా లెక్కిస్తారు. గత 25 రోజుల్లో భక్తులు చెల్లించిన కానుకలను శుక్రవారం నుంచి శనివారం వరకు లెక్కించారు. ఆలయ సిబ్బంది ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ నేతృత్వంలో లెక్కించారు. నగదుగా రూ. కోటి 22 లక్షలు, 795 గ్రాముల బంగారు, 14,495 గ్రాముల వెండిని భక్తులు కానుకగా చెల్లించారు.

చెన్నైలో ఆర్థిక నగరం



పనులను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

- నందంబాక్కంలో 56 ఎకరాల్లో నిర్మాణం
- రూ.116 కోట్లతో ఫిన్‌టెక్ సిటీ
- రూ. 254 కోట్లతో ఫిన్ టెక్ టవర్ ఏర్పాటు
- పనులకు సీఎం స్టాలిన్ భూమిపూజ

సాక్షి, చెన్నై: చెన్నై నందంబాక్కంలో ఆర్థిక సాంకేతిక వ్యవహారాలకు సంబంధించిన ప్రత్యేక నగరం రూపుదిద్దుకోనుంది. ఇక్కడ రూ.116 కోట్లతో ఫైనాన్స్ టెక్నాలజీ నగరం (ఫిన్‌టెక్ సిటీ) రూ.254 కోట్లతో ఫైనాన్స్ టెక్నాలజీ టవర్ (ఫిన్ టెక్) ఏర్పాటు కానుంది. ఈ పనులకు శనివారం సీఎం ఎంకే స్టాలిన్ భూమిపూజ చేశారు. ఐటీ రంగం తమిళనాట ప్రగతి పథంలో దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందిస్తున్నది. అదే తరహాలో పరిశ్రమల స్థాపన, ఉద్యోగ అవకాశాల కల్పనను విస్తృతం చేసింది. పెట్టుబడిదారులను ఆకర్షించి రాష్ట్రంలో పెద్ద ఎత్తున విదేశీ సంస్థల పరిశ్రమలను నెలకొల్పేందుకు సంబంధించిన పనుల వేగం పెరిగింది. అలాగే, ప్రస్తుతం డిజిటల్ ఎకానమీ వైపుగా పయనిస్తున్నది. ఆర్థిక రంగానికి సంబంధించిన ఉద్యోగాలను విస్తృతం చేయడమే కాకుండా, ఆర్థిక సాంకేతిక రంగాలను సంయుక్తంగా అభివృద్ధి పరిచేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రత్యేక పాలసీ ఇప్పటికే విడుదలైంది. అలాగే, ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. ఆర్థిక రంగంలోని విదేశీ సంస్థలు తమ శాఖలను తమిళనాట ఏర్పాటు చేయడానికి వీలుగా అన్ని రకాల మౌలిక వసతులతో ఆర్థిక నగరం రూపకల్పనకు ఈ సందర్భంగా నిర్ణయించారు. ఇందులోభాగంగా ఫిన్‌టెక్ సిటీ, ఫిన్‌టెక్ టవర్ నిర్మాణ పనులకు నందంబాక్కంలో భూమిపూజ చేశారు. ఇక్కడ మాల్స్, స్టార్ హోటళ్లు, పార్కులు, రెస్టారెంట్ల వంటి సౌకర్యాలను కూడా కల్పించబోతున్నారు. రూ.12 వేల కోట్ల పెట్టుబడిని ఈ ఆర్థిక సాంకేతిక నగరంలోకి ఆహ్వానించడమే కాకుండా, 80 వేల మందికి ఉపాధి అవకాశాల కల్పన దిశగా ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసింది.

దేశానికే ఆదర్శకంగా..

సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ ఆర్థిక సేవలు, సంబంధిత కార్యకలాపాలకు ప్రధాన ఆర్థిక నగరంగా నందంబాక్కం మారబోతోందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. సమష్టి సహకారం, భాగస్వామ్యంతో తమిళనాడును కొత్త శిఖరాల వైపుగా తీసుకెళ్తామని తెలిపారు. ఆర్థిక పరిష్కారాలకు, సాంకేతికసేవలకు ఓ వేదికగా ఈ నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. 2024లో జరగబోతున్న పెట్టుబడిదారుల మహానాడుకు మరింత బలాన్ని చేకూర్చేందుకు ఈ నగరం ఉపయోగకరంగా మారుతుందని వ్యాఖ్యలు చేశారు. రెండేళ్లుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చేపట్టిన పలు కార్యక్రమాలు తమిళనాడుకే గర్వకారణంగా మారినట్టు వివరించారు. భారత దేశానికే ఆదర్శ రాష్ట్రంగా మారిందన్నారు. పారిశ్రామిక రంగంలో రికార్డులను బద్దలు కొడుతున్నామని చెప్పారు. మంత్రులు తంగం తెన్నరసు, టీఆర్‌బీ రాజా, సెంజి మస్తాన్, అన్బరసన్, పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సూర్య అరెస్ట్

- వివాదాస్పద వ్యాఖ్యలపై కన్నెర్ర
- మదురై న్యాయమూర్తి ఎదుట హాజరు
- జ్యుడిషియల్ కస్టడీకి తరలింపు
- అరెస్ట్‌ను ఖండించిన బీజేపీ నేతలు



ఎస్‌జీ సూర్య

సాక్షి, చెన్నై: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌జీ సూర్యను మదురై పోలీసులు అరెస్టు చేశారు. సీపీఐ ఎంపీ వెంకటేషన్‌కు వ్యతిరేకంగా ఆయన వివాదాస్పద, ఆధార రహిత ఆరోపణల కేసులో పోలీసులు కన్నెర్ర చేశారు. శనివారం ఉదయం మదురై కోర్టు న్యాయమూర్తి రామశంకర్ ఎదుట హాజరు పరిచి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌జీ సూర్య ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు అత్యంత సన్నిహితుడు అన్న విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం సూర్య ట్వీట్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. మదురై సీపీఐ ఎంపీ వెంకటేశన్‌కు వ్యతిరేకంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయి. మదురై కమ్యూనిస్టు కౌన్సిలర్ రూపంలో పారిశుధ్య కార్మికుడు బలి అయ్యాడని పేర్కొంటూ, ఈ వ్యవహారంలో ఎంపీ మౌనంగా ఉండాల్సిన అవసరం ఏమిటో అని ప్రశ్నించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు ఏమయ్యాయో అని ప్రశ్నిస్తూ, అదే బీజేపీని విమర్శించాలంటే చటుక్కున స్పందించే ఎంపీ, ఇప్పుడెక్కడ అని తీవ్రంగానే విరుచుకుపడ్డారు. ఈ వ్యవహారాన్ని మదురైలోని కమ్యూనిస్టు నేతలు తీవ్రంగా పరిగణించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాత్రికి రాత్రే మదురైకు తరలింపు...

మదురై నుంచి చెన్నై వచ్చిన ప్రత్యేక బృందం శుక్రవారం రాత్రి సూర్యను అరెస్టు చేయడానికి సిద్ధమైంది. టీనగర్‌లోని నివాసంలో సూర్య ఉన్న సమాచారంతో అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. తొలుత కమిషనర్ కార్యాలయానికి తరలించి విచారించారు. ఈ అరెస్టు సమాచారంతో బీజేపీ వర్గాలు కమిషనరేట్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగాయి. సూర్యను విడుదల చేయాలని కోరుతూ అర్ధరాత్రి వేళ పూందమల్లి హైరోడ్డులో రాస్తారోకోకు దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో గట్టి భద్రత నడుమ రాత్రికి రాత్రే మదురైకు తరలించారు. ఉదయాన్నే మదురై కోర్టు న్యాయమూర్తి రామశంకర్ ఇంటికి తీసుకెళ్లారు. ఆయన రిమాండ్‌కు ఆదేశించడంతో జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. సూర్యపై శాంతి భద్రతలకు విఘాతం కల్గించే విధంగా పోస్టులు పెట్టడం, ఇరు వర్గాల మధ్య వివాదం, రెచ్చగొట్టడం, వదంతులు సృష్టించడం వంటి ఐదు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ అరెస్టును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తీవ్రంగా ఖండించారు. ఇదిలా ఉండగా మంత్రి సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా కేంద్ర సంస్థ ఈడీ దూకుడుగా ముందుకెళ్తున్న తరుణంలో తమిళనాడుకు చెందిన బీజేపీ అధ్యక్షుడిపై పోలీసులు కన్నెర్ర చేయడం గమనార్హం.

బీజేపీని శవపేటికలో పాతిపెట్టే సమయం ఆసన్నం

- సీఎం ట్వీట్



సాక్షి , చెన్నై : బీజేపీని శవ పేటికలో పాతిపెట్టే సమయం ఆసన్నమైందని సీఎం ఎంకే స్టాలిన్ ట్వీట్‌చేశారు. ఈ శవ పేటికకు కొట్టే చివరి మేకు ప్రతిపక్షాలన్నీ ఏకమై ఏర్పాటు చేయబోతున్న లౌకికవాద కూటమి అని వ్యాఖ్యలు చేశారు. మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్టుకు నిరసనగా కోయంబత్తూరులో డీఎంకే మిత్రపక్షాల నేతృత్వంలో శుక్రవారం రాత్రి సభ జరిగిన విషయం తెలిసిందే. ఇందులో మిత్రపక్ష పార్టీల నేతలందరూ పాల్గొని కేంద్రం తీరును ఎండగట్టారు. ఈ నేతలకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం స్టాలిన్ శనివారం ట్వీట్ చేశారు. రాజకీయంగా ప్రతిపక్షాలను ఎదుర్కోలేక, ఓటమి భయంతో బీజేపీ ఉక్కిరి బిక్కిరి అవుతోందన్నారు. తమ భయాన్ని కప్పిపుచ్చుకుని, తన అనుబంధం సంస్థలను ప్రతిపక్షాలపైకి ఉసి గొల్పుతోందని ధ్వజమెత్తారు. విచారణల పేరిట ప్రతిపక్షాలను ఇరకాటంలో పెట్టడం, భయపెట్టి దారికి తెచ్చుకోవచ్చన్న ధీమాతో బీజేపీ ఉన్నట్టుందని పేర్కొన్నారు. వారి పాచికలు తన వద్ద పారబోవని పేర్కొంటూ, ప్రతి పక్షాలన్నీ దేశ వ్యాప్తంగా ఏకమవుతున్నాయని ఆయన గుర్తుచేశారు.

బిడ్డలను కడతేర్చి తల్లి ఆత్మహత్య



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

- భర్త మృతి తట్టుకోలేక బావిలో బిడ్డలను తోసి బలవన్మరణం
- విరుదునగర్ జిల్లాలో ఘటన



సంఘటన స్థలంలో గుమిగూడిన జనం

సాక్షి, చెన్నై: భర్త అనారోగ్యంతో మరణించడంతో తట్టుకోలేక, ముగ్గురు పిల్లలను ఎలా పోషించాలో తెలియని ఓ భార్య ఘాతుకానికి ఒడిగట్టింది. తన ముగ్గురు పిల్లలను బావిలో తోసి, అదే బావిలో తానూ దూకి ఆత్మహత్య చేసుకుంది. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. విరుదునగర్ జిల్లా వత్రాయిరుప్ప కోట్టయూరుకు చెందిన ఈశ్వరన్(36) రైతు. తులకం పట్టిలో ఉన్న కొంత స్థలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చాడు. ఈశ్వరన్‌కు భార్య పాండీశ్వరి(32), కుమార్తెలు వైదీశ్వరి(15), కాళీశ్వరి(11), కుమారుడు విఘ్నేశ్వరన్(4) ఉన్నారు. వైదీశ్వరి ప్లస్ ఒన్, కాళీశ్వరి ఆరో తరగతి చదువుతున్నారు. పండించిన పంట రూపంలో దక్కిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తూ, ఆనందంగా జీవిస్తూ వచ్చిన ఈశ్వరన్ గత నెల హఠాత్తుగా అనారోగ్యంపాలై మృతిచెందాడు.

భర్త మరణంతో....

ఈశ్వరన్‌కు వచ్చిన జబ్బును నయం చేయడం కోసం ఉన్న కాస్త పొలాన్ని కూడా తాకట్టు పెట్టేశారు. చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం ఈశ్వరన్ కన్నుమూశాడు. భర్తే సర్వస్వం, ఆయన సంపాదనే కుటుంబపోషణ అని జీవిస్తూ వచ్చిన పాండీశ్వరికి అంతా శూన్యంగా మారింది. భర్త మరణాన్ని తట్టుకోలేక, ఇక తన పిల్లలను ఎలా పోషించాలో తెలియక బోరున విలపిస్తూ వచ్చింది. ఆదుకునే వారు లేకపోవడంతో చివరకు ఇరుగు పొరుగు వారు ఆమెకు భరోసా ఇచ్చారు. అయితే, తన భర్తలేని జీవితం వద్దనుకుందో లేక, తన పిల్లల్ని పోషించడం ఎలా తెలియకో ఏమోగానీ బలవన్మరణం నిర్ణయానికి వచ్చేసింది. శనివారం వేకువజామున తన ముగ్గురు పిల్లలను వెంట బెట్టుకుని పొలంలో ఉన్న బావి వద్దకు వెళ్లింది. తాను మరణిస్తే, పిల్లలు అనాథలు అవుతారని, వారిని ముందుగా బావిలో తోసి చంపేసింది. ఆ తర్వాత తాను అదే బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం పంట పొలం వైపు వచ్చిన కూలీలు బావిలో తేలుతున్న నాలుగు మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు విచారణ చేస్తున్నారు. భర్త మరణంతో ఈ ఘాతుకానికి పాండీశ్వరి పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారు.

విద్యార్థులకు ఉపయోగకరంగా

ఎడ్యుకేషన్ ఫెయిర్

మంత్రి ఎం సుబ్రమణియన్



విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి, రష్యన్ కాన్సులేట్ అధికారులు

సాక్షి, చెన్నై: విద్యార్థులకు ఉపయోగకరంగా ఎడ్యుకేషన్ ఫెయిర్‌లు ఉండాలని ఆరోగ్యశాఖా మంత్రి ఎం సుబ్రమణియన్ తెలిపారు. చెన్నైలో ఆల్ ఇండియా రష్యన్ ఎడ్యుకేషన్ ఫెయిర్- 2023ను శనివారం ఆయన ప్రారంభించారు. రష్యాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల వివరాలు, అందులోని వైద్య కోర్సులు, భారతీయ విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియలకు సంబంధించిన అంశాల వివరాలతో కూడిన రష్యన్ ఎడ్యుకేషన్ ఫెయిర్ చెన్నైలో రెండు రోజుల పాటు జరగనుంది. రష్యన్ కల్చర్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినానంతరం మంత్రి సుబ్రమణియన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విదేశాల్లో విద్యను అభ్యశించాలన్న ఆశతో ఉన్న విద్యార్థులకు సమగ్ర సమాచారం తెలియజేయడానికి వీలుంటుందన్నారు. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే విధంగా మరింతగా కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ ఒలేగ్ ఎన్ అవదీవ్, రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్ అండ్ కల్చరల్ డైరెక్టర్ జెన్నడీ ఏ రోగ్లెవ్, స్టడీ అబ్రాడ్ ఎడ్యుకేషన్ ఎండీ రవిచంద్రన్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికిగాను 5 వేల సీట్లను భారతీయ విద్యార్థులకు రష్యాలోని వర్సిటీలు కేటాయించినట్లు వివరించారు. కొత్త విద్యా సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రారంభం కానుందని, అందుకే ప్రస్తుతం అవకాశాలను విద్యార్థుల దరిచేర్చే విధంగా ఈ ఫెయిర్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 20వ తేదీ మదురైలో, 21న తిరుచ్చి, 22న సేలంలో, 23వ తేదీ కోయంబత్తూరులో ఈ ఫెయిర్ జరుగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాని పిలుపునిచ్చారు. విద్యార్థులకు కేవలం కోర్సుల వివరాలే కాకుండా, స్కాలర్ షిప్‌లు, ఇతర అంశాలను తెలియజేస్తున్నామన్నారు. ముందుగా ఈ ఫెయిర్ ద్వారా రష్యన్ విశ్వవిద్యాలయాలలో సీట్లు దక్కించుకున్న విద్యార్థులకు అడ్మిషన్లను అందజేశారు.

తస్మాత్ జాగ్రత్త!

- మనుషుల చేత మురుగునీటి ట్యాంక్‌లు శుభ్రం చేయిస్తే చర్యలు
- ఐదేళ్ల జైలు, రూ.5 లక్షల జరిమానా
- ఉత్తర్వులు జారీ



సచివాలయం

సాక్షి, చెన్నై: మురుగు నీటి ట్యాంక్‌లు, సెప్టిక్, ట్యాంక్‌లు, భూగర్భ డ్రైనేజీల శుభ్రం పనులకు మనుషులను ఉపయోగిస్తే ఇక ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ శిక్షలకు సంబంధించిన ఉత్తర్వులను శనివారం నగరాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి శివదాస్ మీనా జారీ చేశారు. మురుగు నీటి ట్యాంక్‌లు, భూగర్భ డ్రైనేజీలను శుభ్రం చేయడానికి యంత్రాలనే ఉపయోగించాలని, మనుషుల చేత పనులు చేయించవద్దని కోర్టులు సైతం హెచ్చరించి ఉన్నాయి. చట్టాలు సైతం చేసి, శిక్షలు తప్పవన్న హెచ్చరికలు జారీ అయ్యాయి. అయితే, సెప్టిక్ ట్యాంక్‌లు, మురుగునీటి ట్యాంక్‌లు శుభ్రం చేయించేందుకు మనుషులను వాడడం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో విషవాయువు సోకి మరణించి వారి సంఖ్య పెరిగింది. విషవాయువు తాకడంతో చోటు చేసుకునే మరణాలు ఘటనలు లేని రోజంటూ లేదు. దీంతో గతంలో అమలు చేసిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో చేసిన చట్టంలో పేర్కొన్న అంశాల మేరకు శిక్షల అమలు, కఠిన హెచ్చరికలతో ఉత్తర్వులను జారీ చేశారు. 2013 చట్టం ప్రకారం మురుగునీటి, సెప్టిక్ ట్యాంక్‌లు వాటిలో పారిశుధ్య కార్మికులు గానీ, ఇందుకు సంబంధించిన పనుల్లో ఉన్న వారిని ఉపయోగించేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి తొలిసారిగా తప్పు చేసి పట్టుబడే వారికి రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ. 2 లక్షల జరిమానా లేదా, రెండు శిక్షలు ఒకేసారి అమలు చేసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మళ్లీ పట్టుబడిన పక్షంలో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5లక్షలు జరిమానా, లేదా రెండు శిక్షలు అమలు అవుతాయని హెచ్చరించారు. అన్ని నగర పాలక సంస్థల అధికారులు, స్థానిక సంస్థల అధికారులు, ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు, భవన యజమానులు, కాంట్రాక్టర్లు అంటూ అందరికీ ఈ చట్టం వర్తిస్తుందని, ఇక మీదట యంత్రాల ద్వారా మాత్రమే శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, 2002 జూన్ 7వ తేదీ విడుదల చేసిన నగరాభివృద్ధి శాఖ ఉత్తర్వుల మేరకు ఎవరైనా కార్మికుడు విషవాయువుకు బలై మరణించిన పక్షంలో, వారి వారసులకు రూ.15 లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

భారత భావితరం మీరే

- ఓటుకు నోటును అడ్డుకోండి
- మన చేతి వేళ్లతోనే మన కళ్లు పొడుస్తారు
- మీ జీవితం మీ చేతుల్లోనే



మాట్లాడుతున్న విజయ్



ప్లస్‌టూలో 600 మార్కులు సాధించిన విద్యార్థినికి నెక్లస్ అందజేసిన విజయ్



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

తమిళసినిమా: విజయ్‌కి ప్రపంచవ్యాప్తంగా అశేష అభిమాన గణం ఉంది. అదేవిధంగా విజయ్ చాలా కాలం నుంచి తన విజయ్ మక్కళ్ ఇయక్కమ్ (విజయ్ ప్రజా సంఘం) సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో విజయ్ రాజకీయ రంగప్రవేశం తథ్యం అనే ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం ఉదయం తమిళనాడులోని 234 నియోజకవర్గాలలో పది, ప్లస్‌టూ తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నై, నీలాంగరై ప్రాంతంలో భారీ ఎత్తున నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ వేదికపై విజయ్ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు తలా రూ.25 వేలు, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రూ.15వేలు, తృతీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రూ.10వేల నగదు అందించారు. అదేవిధంగా ప్లస్‌టూలో రాష్ట్రంలోనే 600లకు 600 మార్కులు పొందిన దిండిక్కల్ చెందిన నందిని అనే విద్యార్థినికి డైమండ్ నెక్లెస్ బహూకరించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సహించాలనే సదుద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విజయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మీ వద్ద అడవినైనా లాక్కుంటారు... డబ్బు వున్నా దోచుకుంటారని, విద్య మాత్రమే నిరంతరం అని అన్నారు. విద్యార్థులు కచ్చితంగా రాజకీయ నాయకుల గురించి తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా అంబేద్కర్, పెరియార్, కామరాజ్ వంటి గొప్ప నాయకుల గురించి తెలుసుకోవాలన్నారు. డబ్బుపోయినా పర్వాలేదని, అనారోగ్యంతో కొంతే నష్టపోతామని అయితే గుణాన్ని కోల్పోతే జీవితమే ఉండదని ఆయన అన్నారు. ఇక్కడ మన వేళ్లతోనే మన కళ్లు పొడిచే వారు ఉంటారని, కాబట్టి మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే అని అన్నారు. మీరే భావితర పౌరులని, ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లు అని పేర్కొన్నారు. మంచి నాయకులను ఎంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా నోటుకు ఓటు సంస్కృతికి స్వస్తి చెప్పాలన్నారు. తమిళనాడులో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఓటుకు నోటులు తీసుకోవద్దని చెప్పే ప్రయత్నం చేయాలన్నారు. మీ ప్రయత్నం తప్పక ఫలిస్తుందనే నమ్మకాన్ని విజయ్ వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

వైభవంగా మండల పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కొరుక్కుపేట: రామలింగ చౌడేశ్వరిదేవి కర్తరి పూజమహోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల మహిషాసుర మర్ధిని మహోత్సవాలు విజయవంతంగా జరిగాయి. అందులోభాగంగా శుక్రవారం నుంచి చెన్నపురి దేవాంగ సంఘ కన్నికలమ్మ దేవస్థానంలో ప్రతిరోజూ సాయంత్రం 7గంటల నుంచి మండలి పూజలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన పూజల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రామలింగచౌడేశ్వరీ దేవి కృపాకటాక్షాలకు లోనయ్యారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ పాత చాకలిపేటకు చెందిన కృష్ణ గీతా సమాజం వారిచే పారాయణం భక్తిశ్రద్ధలతో చేపడుతున్నారు. జులై 1, 2 తేదీల్లో జరిగే కార్యక్రమంలో పాల్గొని పూజలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అడ్మిషన్లు తీసుకుంటే ఫ్యాన్ ఉచితం



అడ్మిషన్లు పొందిన విద్యార్థి తల్లిదండ్రులకు ఫ్యాన్ పంపిణీ చేస్తున్న హెచ్ఎం భూపతి

పళ్లిపట్టు: ప్రభుత్వ తెలుగు పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచే విధంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల కుటుంబాలకు హెచ్ఎం ఫ్యాన్ ఉచితంగా అందజేశారు. పళ్లిపట్టు మండలంలోని అత్తిమాంజేరి తెలుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం భూపతి తెలుగు విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ప్రతిఏటా విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించే విధంగా బహుమతులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది బడిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల కుటుంబాలకు ఫ్యాన్ ఉచితంగా పంపిణీకి వీలుగా గ్రామంలో ఉపాధ్యాయులతో వెళ్లి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. దీంతో శుక్రవారం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బడిలో కొత్తగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులకు టేబుల్ ఫ్యాన్ పంపిణీ చేశారు. హెచ్ఎం వినూత్న ప్రయత్నం గ్రామస్తులను ఆకట్టుకుంటోంది. సహాయ ఉపాధ్యాయులు మునియమ్మ, మాధవన్ పాల్గొన్నారు.

అనకట్టును ఆదర్శంగా చేయడమే లక్ష్యం



సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు: అనకట్టు నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే నందకుమార్ అన్నారు. వేలూరు జిల్లా అనకట్టులోని ప్రభుత్వ పాఠశాలలో కలైంజర్ ప్రత్యేక వైద్య శిబిరం జెడ్పీ చైర్మన్ బాబు అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనకట్టు నియోజకవర్గంలో అధికంగా అటవీ ప్రాంతాలు ఉన్నందున ఇక్కడ ప్రజలు వైద్యశాలలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతోనే తరచూ ప్రతినెలా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. విడతల వారిగా అనకట్టు, ఒడుగత్తూరు, పల్లిగొండ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని అటవీ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పథకాలను అటవీ ప్రాంత ప్రజలకు తీసుకొచ్చి వారికి అందజేస్తున్నామన్నారు. అయితే అటవీశాఖ అనుమతి ఇవ్వక పోవడంతో రోడ్డు వసతి ఏర్పాటు చేయలేకపోతున్నామని చెప్పారు. వీటిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూనియన్ చైర్మన్ భాస్కరన్, డీఎంకే పార్టీ కార్యదర్శి వెంకటేశన్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడి ఎంపిక



సర్టిఫికెట్ చూపుతున్న శ్యాంసుందర్

తిరుత్తణి: జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఎంపికైన శ్యాంసుందర్ ఎమ్మెల్యే చంద్రన్‌ను శనివారం కలిసి శుభాకాంక్షలు పొందారు. తిరువళ్లూరు జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్ నేతృత్వంలో జిల్లా కమిటీ సభ్యుల పదవులకు సభ్యులు నామినేషన్ వేశారు. ఒక్కో పోస్టుకు ఒక్కరి చొప్పున మాత్రమే నామినేషన్‌లు దాఖలు కావడంతో పోటీ చేసిన సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఇందులో తిరుత్తణి మున్సిపాలిటీ కౌన్సిలర్, పట్టణ డీఎంకే కోశాధికారి టీ.ఎస్. శ్యాంసుందర్ జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. దీంతో ధ్రువీకరణ పత్రాన్ని కలెక్టర్ అందజేశారు. జిల్లా అభివృద్ధి కమిటీలో అవకాశం కల్పించిన తిరువళ్లూరు జిల్లా డీఎంకే కార్యదర్శి, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్‌ను శ్యాంసుందర్ కలుసుకుని శుభాకాంక్షలు పొందారు. తిరుత్తణి మున్సిపల్ కౌన్సిలర్ అశోక్‌కుమార్, పట్టణ పార్టీ ప్రతినిధి మోహన్‌రావు, పళ్లిపట్టు మండల కార్యదర్శి శ్రీనివాసన్ సహా డీఎంకే శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ సేవలు పునరుద్ధరించాలి



కూలిన విద్యుత్ స్తంభం

తిరుత్తణి: తిరువలంగాడు మండలంలో గాలికి విద్యుత్ స్తంభాలు కూలడంతో వారం రోజులుగా తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. మామండూరు, అరుంగుళం పరిసర గ్రామాల్లో వారం రోజుల కిందట గాలీవాన బీభత్సం సృష్టించింది. దీంతో 50కు పైబడిన విద్యుత్ స్తంభాలు నేలకొరిగి పలు ప్రాంతాల్లో చెట్లు కూలి విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ సేవలుకు అంతరాయం చోటుచేసుకుంది. వారం రోజుల నుంచి కూలిన విద్యుత్ స్తంభాలు తొలగించి విద్యుత్ తీగలు సరిచేస్తున్న పనుల్లో 30కు పైబడిన విద్యుత్ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. అయినా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు కొత్తగా ఏర్పాటు చేయడంలో చోటుచేసుకుంటున్న కాలయాపనతో విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు త్వరగా పూర్తిచేసి విద్యుత్ సేవలు పునరుద్ధరించాలని గ్రామీణులు కోరుతున్నారు.

భర్తను చితకబాదిన భార్య

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

తిరువళ్లూరు: కుటుంబకలహాల కారణంగా దంపతుల మధ్య జరిగిన ఘర్షణతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తిరువళ్లూరులో విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా ఈకాడుకు చెందిన షైన్‌షా(29). ఇతడికి అదే ప్రాంతానికి చెందిన రిజ్వానాతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. ఈ నేపథ్యంలో గతవారం దంపతుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బంధువుల సమక్షంలోనే భర్తను భార్య చితకబాధింది. అనంతరం భర్తతో కాపురం చేయలేనని చెప్పి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందడంతో పాటు బంధువుల సమక్షంలోనే భార్య తనపై చేయి చేసుకోవడాన్ని అవమానంగా భావించిన షైన్‌షా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి అమిత్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

రోడ్డు వసతి కల్పించాలని వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వేలూరు: రోడ్డు వసతి కల్పించాలని కోరుతూ గ్రామస్తులు వ్యవసాయ పొలాల వద్ద నిరసన తెలియజేసి అధికారులు వినతి పత్రం అందజేశారు. వేలూరు జిల్లా అనకట్టు నియోజకవర్గం పీంజమండై గ్రామపంచాయతీ పరిధిలోని మల్లువాడి, పీంజమండై అటవీ గ్రామాల్లో 500 కుటుంబాలకు పైగా జీవిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు తరచూ నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడుగత్తూరుకు కాలినడకన నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అదేవిధంగా ఎవరైనా రోగాల బారినపడినా డోలి కట్టి ఇద్దరు వ్యక్తుల సాయంతో కొండ కిందకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వీటిపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తుంది. దీంతో శనివారం ఉదయం గ్రామస్తులు అటవా ప్రాంతంలోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న కాలనడక దారిలో నిలిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతి ఇంటిపై నల్లజెండాలు కట్టి నినాదాలు చేశారు. తమకు ఓట్లు వేసే సమయంలో మాత్రం ప్రజా ప్రతినిధులు ఉచిత సలహాలు ఇస్తున్నారని అయితే తమ గ్రామానికి రోడ్డు వసతి లేకపోవడంతో పాటు తాగునీటిని కూడా సరఫరా చేయడం లేదని తాము వ్యవసాయ పొలాల్లో వచ్చే నీటిని తాము ఉపయోగించుకుంటున్నామని ఆరోపించారు. విషయం తెలుసుకున్న అధికారులు గ్రామస్తుల వద్ద చర్చలు జరిపి వెంటనే రోడ్డు వసతి ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు.

తాగునీటి కోసం రాస్తారోకో



కాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

అన్నానగర్: నాగపట్నంలో శుక్రవారం సాయంత్రం గ్రామస్తులు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. దీంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. నాగపట్నం జిల్లా కిల్లివెల్లూరు యూనియన్‌లోని వేణ్మణి పంచాయతీ పరిధిలోని ప్రాంతాల్లో కొల్లిడం ఉమ్మడి తాగునీటి పథకం కింద తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని నెలలుగా వేణ్మణి, మేళా వేణ్మణి ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీనిపై సంబంధిత అధికారులకు సమాచారం అందించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు శుక్రవారం సాయంత్రం కిలివెల్లూర్ - కచ్చనం హైవేపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న కిల్‌వెల్లూర్ ఎస్ఐ జయశీలన్ వేణ్మణి పంచాయతీ చైర్మన్ మహదేవన్‌ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.



కోలీవుడ్ టాక్స్

శశికుమార్‌కు జంటగా బుల్లితెర నటి

తమిళసినిమా: బుల్లితెర నటిమణులు వెండి తెరకు పరిచయం కావడం కొత్తవి కాదు. ఆ మధ్య నటి ప్రియా భవానీశంకర్, వాణి భోజన్ బుల్లితెర నుంచి వచ్చి సినిమాలో సక్సెస్ అయిన వారే. ఇకపోతే నటుడు శశికుమార్ కొత్త హీరోయిన్లను ప్రోత్సహించడంలో ముందుంటారు. కారి చిత్రంలో పార్వతి అరుణ్ అనే కొత్త నటికి అవకాశం కల్పించారు. ఇటీవల అయోత్తి చిత్రంలో ప్రీతి ఇస్రాణి అనే నూతన నటి శశికుమార్‌తో జత కట్టిన విషయం తెలిసిందే. తాజాగా శశికుమార్ హీరోగా నటించనున్న చిత్రంలో బుల్లితెర నటి రాధిక ప్రీతి కథానాయకిగా పరిచయం కానున్నట్లు సమాచారం. ఈమె పూవే ఉనక్కాగ సీరియల్ ద్వారా పరిచయమైన కన్నడం నటి కావడం గమనార్హం. ఆ సీరియల్‌లో పూవరసీ అనే పాత్రలో నటించి బుల్లి తెర ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. అయితే ఆ సీరియల్‌లో నటించడం లేదు. కారణం సినిమాల్లో హీరోయిన్‌గా అవకాశాల కోసం ప్రయత్నించడమేనట. అలా అని ప్రయత్నం ఫలించి శశికుమార్ కథానాయకుడిగా నటించనున్న నూతన చిత్రంలో అవకాశాన్ని దక్కించుకున్నట్లు తెలిసింది. ఈ చిత్రంతో రాధిక ప్రీతి సినీ కథానాయకిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారన్నమాట. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలువడే అవకాశం ఉంది.

నేను రెడీ అంటున్న దళపతి!



లియో చిత్రంలో విజయ్

తమిళసినిమా: నటుడు విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం లియో. లోకేష్ కనకరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎస్ లలిత్‌కుమార్ భారీ ఎత్తున నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నటి త్రిష , ప్రియా ఆనంద్ హీరోయిన్లుగా నటిస్తున్న ఇందులో బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్, నటుడు అర్జున్, మన్సూర్అలీఖాన్ దర్శకుడు మిష్కిన్, గౌతమ్ వాసుదేవన్, శాండీ మాస్టర్, మాథ్యూథామస్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. మాస్టర్ చిత్రం తర్వాత విజయ్, దర్శకుడు లోకేష్ కనకరాజ్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న చిత్రం కావడంతో లియోపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా చిత్రం చివరి దశకు చేరుకుంది. దీంతో చిత్రం గురించి దర్శకుడు లోకేష్ కనకరాజ్ అప్‌డేట్స్ ఇస్తున్నారు. ఈ చిత్రం విడుదలకు ముందే ఆడియో హక్కులు, ఓటీటీ హక్కును అంటూ ఇప్పటికే రూ.350 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు టాక్ వైరల్ అవుతోంది. తాజాగా మరో అప్‌డేట్ వెల్లడించారు. ఈనెల 22న నటుడు విజయ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రంలోని అలర్ట్ ఈగో నా రెడీ అనే పల్లవితో సాగే తొలి పాటను విడుదలైనట్లు పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఈ పోస్టర్లో విజయ్ చేతుల్లో గన్ను నోట్లో సిగరెట్ పెట్టుకుని ఫోర్స్‌గా కనిపించడంతో ఆయన అభిమానులు ఖుషీ అవుతున్నారు. అయితే కొన్ని విమర్శలు కూడా వస్తున్నాయి. ముఖ్యంగా పీఎంకే పార్టీ నేత రామదాసు విజయ్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ విజయ్ తన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. చాలా కాలం క్రితం తన చిత్రాల్లో సిగరెట్లు కాల్చే సన్నివేశాలను, మద్యం తాగే సన్నివేశాలను చోటు చేసుకోవడాన్ని తాను అనుమతించనని వాగ్దానం చేశారన్నారు. అలాంటిది ఇప్పుడు ఆ మాట తప్పి ఇప్పుడు లియో చిత్రంలో అలా రెండు అంశాలు చోటు చేసుకోవడం ఆయన అభిమానులను చెడుత్రోవ పట్టించడం కాదా అని ప్రశ్నించారు.

ఏదీ ఈజీ కాదు!



ఆండ్రియా

తమిళసినిమా: సంచలన నటీమణుల్లో ఆండ్రియా ఒకరని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఈమె రాసలీలలు, ప్రేమలో పడడం, మోసపోవడం వంటి సంఘటనలు ఇప్పటికే మీడియాలో కథలు కథలుగా వెలువడిన విషయం తెలిసిందే. ఇక వివాదాస్పద కథా పాత్రల్లో నటించడం ఆండ్రియా తరువాతే ఎవరైనా అని చెప్పాలి. తన గ్లామరస్ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయడంలోనే ఈ భామ ముందే ఉంటారు. వీటితో పాటు మంచి నటి, గాయని అనే పేరు తెచ్చుకున్నారు. అంతేకాకుండా ఆండ్రియాలో గీత రచయిత కూడా వున్నారు. ఇకపోతే షూటింగ్‌లు, పాటల రికార్డింగ్‌లు అంటూ బిజీగా వున్న ఆండ్రియా మధ్యలో సంగీత కచేరీలు చేస్తున్నారు. ఆ మధ్య కౌలాలంపూరులో తన సంగీత విభావరి కార్యక్రమాన్ని సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఆ ఉత్సాహంతో తాజాగా జులై 1న కోయంబత్తూరులో సంగీత కచేరి నిర్వహించబోతున్నారు. దీని గురించి ఆమె కోయంబత్తూరులో మీడియాతో మాట్లాడుతూ జీవితంలో ఏది ఈజీ కాదని, ప్రతి విషయంలోనూ ఒక కష్టం ఉంటుందని పేర్కొన్నారు. తాను గతంలో 15 ఏళ్ల పాటు మ్యూజిక్ క్లాసులకు వెళ్లినట్లు చెప్పారు. అదే తనను ఇప్పుడు పాడేలా చేస్తుందని చెప్పారు. తను కోయంబత్తూరుకు చాలాసార్లు వచ్చానని, కళాశాలలో చాలా షోలు చేశానని అయితే ఇక్కడ పబ్లిక్ మధ్య కచేరీ చేయడం ఇదే మొదటిసారి అని చెప్పారు. అయితే దీనిని పెద్ద విషయంగా తాను భావించడం లేదని అన్నారు. కాగా రాజకీయ రంగప్రవేశం చేసే ఆలోచన ఉందా అన్న ప్రశ్నకు ప్రస్తుతం కచేరీ గురించి మాట్లాడదాం అంటూ ఎస్కేప్ అయ్యారు.

23న పాయుమ్ ఒలి నీ ఎనక్కు



పాయుమ్ ఒలి నీ ఎనక్కు చిత్ర యూనిట్

తమిళసినిమా: ఇటీవల విడుదలై సంచలన విజయాన్ని సాధించిన పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో పార్తీపేంద్రన్ వల్లవన్‌గా కీలక పాత్రను పోషించి ప్రశంసలు అందుకున్న విక్రమ్‌ప్రభు తాజాగా నటించిన చిత్రం పాయుమ్ ఒలి నీ ఎనక్కు. నటి వాణిభోజన్, నైతిక నటించిన ఇందులో కన్నడ నటుడు ధనుంజయ ప్రతినాయకుడిగా నటించారు. కార్తీక్ మూవీ హౌస్ పతాకంపై కార్తీక్ అద్వైత్ ఈస్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. ఈయన ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి శిష్యుడు అన్నది గమనార్హం. దీనికి శ్రీధర్ ఛాయాగ్రహణం, మహతీ స్వరసాగర్ సంగీతాన్ని అందించారు. యాక్షన్ థ్రిల్లర్ కథా చిత్రంగా రూపొందిన పాయుమ్ ఒలి నీ ఎనక్కు చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల 23న విడుదలకు సిద్ధమవుతోంది. దీనిని తమిళనాడులో ఎస్పీ సినిమా సంస్థ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటుడు విక్రమ్‌ప్రభు మాట్లాడుతూ ఇది ఫ్యాషనేట్ టీమ్ రూపొందించిన చిత్రమని పేర్కొన్నారు. దర్శకుడు కార్తీక్ ఈ కథతో ఎనిమిది నెలలకు పైగా జర్నీ చేశారన్నారు. ఈ కథను తనకు చెప్పినప్పుడు దీనిని ఎలా తెరపైకి తీసుకురావాలా అని ఆలోచించినప్పుడు ఫ్యాషనేట్ టీమ్ ఒక్కొక్కరు ఇందులోకి వచ్చారన్నారు. ఇది యూనిక్ కథా చిత్రం అన్నారు. ప్రతి ఒక్కరూ దీని కోసం రేయింబవళ్లు శ్రమించినట్లు చెప్పారు. చిత్రంలోని ఫైట్ సన్నివేశాలను మాత్రమే 40 రోజులు చిత్రీకరించినట్లు చెప్పారు. నటి వాణిభోజన్‌తో కలిసి నటించడం మంచి అనుభవంగా పేర్కొన్నారు.

కథ కొత్తదని చెప్పలేం కానీ..



తండట్టి చిత్ర యూనిట్

తమిళ సినిమా: ఇంతకుముందు సర్దార్ కారి వన్ బేబీ విజయవంతమైన చిత్రాలు ప్రిన్స్ పిక్చర్స్ సంస్థ అధినేత ఎస్.లక్ష్మణ్ కుమార్ తాజాగా నిర్మించిన చిత్రం తండట్టి. రామ్ సంగయ్య ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన శింబుదేవన్ దర్శకుల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేశారన్నది గమనార్హం. కాగా నటుడు పశుపతి ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో నటి రోహిణి, అమ్ము అభిరామి, వివేక్ ప్రసన్న ముఖ్యపాత్రలు పోషించారు. సుందరమూర్తి కేఎస్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమం చేసుకుని ఈనెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో ముచ్చటించారు. ఇది మనముందు తరం మహిళలు చెవులకు ధరించే పెద్ద పెద్ద పోగులు ప్రధాన ఇతివృత్తంతో రూపొందించిన కథా చిత్రం అని దర్శకుడు రామ్ సంగయ్య తెలిపారు. ఇందులో రోహిణి చెవి పోగు పోతుందన్నారు. దాని గురించి విచారించడానికి కానిస్టేబుల్ పశుపతి ఆ గ్రామానికి వస్తారన్నారు. ఆయన దాన్ని కనుగొన్నారా లేదా అనేది చిత్ర కథ అని చెప్పారు. ఇది అండావు కానోమ్ చిత్రం ఒకే కథతో రూపొందినట్లు ప్రచారం జరుగుతోందని, అది నిజం కాదని అన్నారు. ఆ చిత్రం నిర్మాత కూడా తమ చిత్రాన్ని చూసి తామే పొరపాటుపడ్డామని సారీ చెప్పారని తెలిపారు. నటుడు పశుపతి మాట్లాడుతూ ఈ చిత్ర కథ కొత్తదని చెప్పడం కరెక్ట్ కాదు గానీ దర్శకుడు కథలు చెప్పగానే బాగుందనిపించిందన్నారు. అందుకే ఈ చిత్రంలో నటించడానికి అంగీకరించానన్నారు. ఇందులో నటించడం మంచి అనుభవంగా పేర్కొన్నారు. తమ పాత్రలు సీరియస్‌గా ఉన్న ప్రేక్షకులకు వినోదంగా ఉంటాయన్నారు. దర్శకుడు రామ్ సంగయ్య తండట్టి చిత్రాన్ని చాలా చక్కగా ఆవిష్కరించారని చెప్పారు.

క్లుప్తంగా

వెండి కవచం సమర్పణ



వెండి కవచాన్ని అందజేస్తున్న దాతలు

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామికి చెన్నైలోని ఐనావరానికి చెందిన వీకే. శాంతకుమార్, వీకే.ప్రకాష్ శనివారం వెండికవచాన్ని సమర్పించారు. దీనిని టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ, టీటీడీ అధికారులు స్వీకరించారు. ఈఓ మాట్లాడుతూ స్వామివారి నాభి వైపు ఉన్న మత్స్యావతార భాగానికి వెండి కవచం అందజేశారని తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఏకాంబరం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, షరాబ్ ఉదయ్‌కుమార్, శ్రీ వేదనారాయణ స్వామి సేవా సంఘం అధ్యక్షుడు సంపత్ మొదలి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- అధ్యాపకుడు మృతి

అన్నానగర్: నెల్లై సమీపంలో శుక్రవారం రాత్రి ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో అధ్యాపకుడు మృతి చెందాడు. తిరునెల్వేలి జిల్లా పాలయంకోట్టై జేవియర్ కాలనీ, ప్రిన్స్ కాటేజ్, చర్చి వీధికి చెందిన పీటర్ దురైరాజ్. ఇతని కుమారుడు ప్రిన్స్ విల్సన్ (27). మనోన్మణీయమ్ సుందరనార్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి, ఇతను నెల్లై సమీపంలోని గంగైకొండన్ సిప్‌కాట్ ప్రాంతంలో బైకులో వెళుతున్నాడు. అప్పుడు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రిన్స్ విల్సన్ మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ వేప్పంగుళంకు చెందిన రాజమణి(43)ని పోలీసులు అరెస్ట్ చేశారు.

బావిలో పడి యువకుడు మృతి

అన్నానగర్: ఉసిలంబట్టి సమీపంలో శుక్రవారం బావిలో జారి పడి యువకుడు మృతి చెందాడు. మదురై జిల్లా ఉసిలంబట్టి సమీపంలోని ఉత్తప్పనాయకనూర్ పక్కనే ఉన్న కామరాజ్ నగర్‌కు చెందిన ఈశ్వరన్ కుమారుడు పెరియకరుప్పన్ (20). ఇతను శుక్రవారం మోటార్ రిపేర్ చేసేందుకు తన తోటలోని 40 అడుగుల లోతు బావిలో దిగాడు. ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయాడు. బండరాయికి తగిలి తలకు బలమైన గాయమైంది. ఇరుగుపొరుగు అతడిని ఉసిలంబట్టి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదురై ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పెరియకరుప్పన్ మృతి చెందాడు. ఈ ఘటనపై ఉత్తప్పనాయకనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైనాలో తమిళ విద్యార్థి..

తిరువొత్తియూరు: చైనాలో స్విమ్మింగ్ పూల్‌లో మునిగి తమిళ విద్యార్థి మృతి చెందాడు. పుదుకోట్టై కామరాజపురం 6వ రోడ్డుకు చెందిన రవి, విశాలాక్షి దంపతులు. విశాలాక్షి డెంటిస్ట్. వీరి కుమారుడు వైద్యనాథన్ (21). ఇతను చైనాలోని చిన్‌ఛాంగ్ మెడికల్ యూనివర్సిటీలో 4వ సంవత్సరం మెడికల్ కోర్సు చదువుతున్నాడు. ఈ క్రమంలో వైద్యనాథన్, అతని స్నేహితులు గురువారం అక్కడి స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేస్తుండగా మృతి చెందాడు. వైద్యనాథన్ మృతదేహాన్ని సొంత ఊరికి తీసుకొచ్చేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్యాస్ లీకై ఇద్దరు దుర్మరణం

కొరుక్కుపేట: గ్యాస్ లీకై ఇద్దరు ఉత్తారాది కార్మికులు దుర్మరణం చెందారు. కోయంబత్తూరు జిల్లా అన్నూర్ సమీపంలోని పిల్లయపం పాళయం వద్ద ప్రైవేట్ తయారీ కర్మాగారం నడుస్తోంది. ఫ్యాక్టరీలో పనిచేసే ఉత్తరాది కార్మికులకు ఎదురుగా ఫ్లాట్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఫ్యాక్టరీలో అనురాగ్ సింగ్ (28), తంజయ్ సింగ్ (33), ధరమ్‌వీర్ (40), వీరేంద్ర రాజా (37), మహదేవ్ సింగ్ (23) పనిచేస్తున్నారు. వారు ఫ్యాక్టరీకి ఎదురుగా ఉన్న ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. ఐదుగురు కూలీలు గదిలో వంట చేస్తున్నారు. ఆ సమయంలో ఊహించని విధంగా, గ్యాస్ లీక్ అయి గది అంతటా వ్యాపించింది. కొంత సేపటికీ మంటలు చెలరేగాయి. దీంతో ఐదుగురు మంటల్లో చిక్కుకుని కేకలు వేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి ఐదుగురు కార్మికులను రక్షించారు. అనంతరం వారిలో నలుగురిని కోవిల్‌పాళయంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో, ఒకరిని కోయంబత్తూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కాన్పూర్‌కు చెందిన అనురాగ్ సింగ్, దుబ్రాకు చెందిన తంజయ్ సింగ్ మృతిచెందారు.

కారు ఢీకొని వృద్ధురాలు మృతి

తిరువళ్లూరు: అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే బస్సు కోసం వేచి వున్న వృద్ధురాలిని, ద్విచక్ర వాహనంలో వెళుతున్న వారిని ఢీకొంది. ఇందులో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ వలసవెట్టికాడు గ్రామానికి చెందిన మోహన్ భార్య తులసి(62). ఈమె పోలీవాక్కం నుంచి తిరువళ్లూరుకు వెళ్లడానికి బస్సు కోసం శనివారం ఉదయం వేచివుంది. ఆ సమయంలో శ్రీపెరంబదూరు నుంచి తిరువళ్లూరు వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి తులసిని ఢీకొట్టి పక్కనే వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తులసి అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌లో వెళుతున్న కమ్మవారిపాళ్యం గ్రామానికి చెందిన రామానుజం కుమారుడు సెల్వమణి(48), జానకీరామన్ కుమారుడు సధానందం(35) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరికి తిరువళ్లూరులో ప్రాథమిక చికిత్స అనంతరం చెన్నై వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

34 చోట్ల క్షేత్రస్థాయి సర్వేలో మంత్రులు



క్షేత్రస్థాయి సర్వేలో మంత్రులు

కొరుక్కుపేట: చెన్నై మహానగరం పరిధిలోని 26 అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి ప్రకటించిన 34 నోటిఫికేషన్లలో 34 చోట్ల క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. ఇందులో మంత్రులు ఉదయనిధి స్టాలిన్, హిందూ ధార్మిక శాఖ మంత్రి, చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పి.కె.శేఖర్ బాబు కూడా వెళ్లి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో 50 చోట్ల త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు 50 చోట్ల నేరుగా పర్యటించి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా చెన్నై మహానగరం పరిధిలోని 26 అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి 34 చోట్ల సర్వేలు చేపట్టారు. శనివారం చేపాక్కం – ట్రిప్లికేన్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్నారోడ్ – గ్రీమ్స్ రోడ్ – జనరల్ పీటర్స్ రోడ్ జంక్షన్ వద్ద కొత్త పాదచారులు ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి రూ. 15 కోట్ల అంచనా వ్యయంతో, మే డే పార్క్, చింతాద్రిపేట అభివద్ధికి సంబంధించిన అంచనా వ్యయంతో రూ. 5 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించి మంత్రి ఉదయనిధి స్టాలిన్ తోపాటు కమిటీ చైర్మన్ పీకే శేఖర్ బాబు స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. సెంట్రల్ చెన్నై పార్లమెంట్ సభ్యుడు దయానిధి మారన్, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అపూర్వ, చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా పాల్గొన్నారు.

పోరూర్ నుంచి కత్తిప్పర దాకా మెట్రో పనులు

- ట్రాఫిక్‌లో మార్పు
- జూలై వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

కొరుక్కుపేట: చెన్నై మెట్రోరైల్ కార్పొరేషన్ పోరూర్ నుంచి కత్తిపార వరకు మెట్రో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అలాగే మొఘలివాకం వద్ద మౌంట్ – పూందమల్లి రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం నుంచి ట్రాపిక్‌లో మార్పులు చేశారు. శనివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 11 వరకు, మెట్రో రైల్ పనుల కోసం అనుమతించడానికి ట్రాఫిక్ పోలీసు విభాగం ఈ క్రింది విధంగా అనుమతి ఇచ్చింది. శనివారం రాత్రి 11 గంటల నుంచి 19వ తేదీ సోమవారం ఉదయం 5 గంటల వరకు, ఈ నెల 24తేదీ శనివారం రాత్రి 11 నుంచి 26 తేదీ సోమవారం ఉదయం 5 వరకు, జూలై తేదీ శనివారం రాత్రి 11 నుంచి 3 తేదీ సోమవారం ఉదయం 5 వరకు. జూలై 8 తేదీ శనివారం రాత్రి11 నుంచి జూలై 10 తేదీ సోమవారం ఉదయం 5 వరకు, జూలై 15 తేదీ శనివారం రాత్రి11 నుంచి 17 తేదీ సోమవారం ఉదయం 5 గంట వరకు.

22 తేదీ శనివారం రాత్రి 11 నుంచి 24 తేదీ సోమవారం ఉదయం 5 గంటల వరకు ట్రాఫిక్ మార్పులు చేశారని వెల్లడించారు

సర్పంచ్‌పై ఎస్పీకి ఫిర్యాదు



ఆర్కేపేట పంచాయతీ సర్పంచ్ వేణు

తిరుత్తణి: సైనికుడి భార్యను పంచాయతీ సర్పంచ్ లైంగిక వేధింపులకు గురిచేసినట్లు తిరువళ్లూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు సంఘటన కలకలం రేపింది. ఆర్కేపేట పంచాయతీ విలక్కనాంపూడి పుదూర్ గ్రామానికి చెందిన పురుషోత్తం(40). రాజస్తాన్‌లో మిలటరీలో సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతని భార్య రాజేశ్వరి(35) ముగ్గురు పిల్లలతో గ్రామంలో నివశిస్తున్నారు. గ్రామపంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసేందుకు రాజేశ్వరి జాబ్‌కార్డు కోసం పంచాయతీ సర్పంచ్‌కు దరఖాస్తు చేశారు. జాబ్‌కార్డు ఇచ్చేందుకు ఆరు నెలల పాటు సర్పంచ్ కాలయాపన చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో పాఠశాలలకు వేసవి సెలవులతో రాజేశ్వరి ముగ్గురు బిడ్డలతో రాజస్తాన్‌కు వెళ్లారు. ఈ సమయంలో రాజేశ్వరికి ఫోన్‌చేసిన పంచాయతీ సర్పంచ్ వేణు జాబ్ కార్డు వచ్చినట్లు పంచాయతీ కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. ఊరికి వచ్చిన రాజేశ్వరి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వేణును జాబ్‌కార్డు కోరగా ఆర్మీలో భర్త పనిచేస్తున్నందున జాబ్‌కార్డు ఇవ్వడం కుదరదని, సర్పంచ్ చెప్పినట్లు నడుచుకోవాలని, అసభ్య పదజాలంతో మాట్లాడి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు భర్తకు రాజేశ్వరి మొరపెట్టుకున్నారు. దీంతో ఆగ్రహం చెందిన ఆర్మీజవాన్ పురుషోత్తమన్ ఉపాధి పథకంలో పని చేసేందుకు జాబ్‌కార్డు అడిగిన తన భార్యపట్ల సర్పంచ్ అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆరోపిస్తూ సర్పంచ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరువళ్లూరు జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్



అన్నానగర్: కారీమంగళం సమీపంలో శనివారం లగ్జరీ కారులో అక్రమంగా తరలిస్తున్న 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురుని పోలీసులు అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా కారీమంగళం సమీపంలోని పెరియంబట్టి వద్ద శనివారం ఉదయం ఓ లగ్జరీ కారు ముందు టైరు పగిలి మార్గమధ్యలో ఆగింది. అటుగా వచ్చిన పోలీసులు, కారుని తనిఖీ చేయగా 3 బస్తాల్లో 30 కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాకు చెందిన నబిల్ (24), అదే ప్రాంతానికి చెందిన జంషిత్ (24)లను పోలీసులు అరెస్టు చేశారు.

వార్షికోత్సవం



వేలూరు నారాయణి పీఠం బంగారుగుడి పీఠాధిపతి శక్తి ఆధ్వర్యంలో నడుస్తున్న నారాయణి ఆస్పత్రి, పరిశోధన కేంద్రం నాల్గవ వార్షికోత్సవ కార్యక్రమంలో సింగపూరుకు చెందిన శక్తిఅమ్మ భక్తురాలు డాక్టర్ లక్ష్మీజ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమెతో పాటు ఆస్పత్రి డైరెక్టర్ బాలాజీ, వైద్యులు గీతా ఇనియన్, జనని ఉన్నారు.

- వేలూరు

నిజాయితీ చాటుకున్న వ్యక్తి



పోలీసులకు నగదు అప్పగిస్తున్న వడివేల్

అన్నానగర్: కాంచీపురం సమీపంలో శుక్రవారం సాయంత్రం రోడ్డుపై పడి ఉన్న రూ.15 వేలను ఓ వ్యక్తి నిజాయితీ గా పోలీసులకు అప్పగించాడు. విల్లుపురం వండిమేడు ప్రాంతానికి చెందిన వడివేల్ (53). కాంచీపురం పక్కనే ఉన్న పంబకరైలో టాస్మాక్ బార్ నడుపుతున్నాడు. ఈ స్థితిలో శుక్రవారం సాయంత్రం వడివేలు టాస్మాక్ బార్ ఎదుట రోడ్డుపై పడి ఉన్న రూ.15 వేలు చూశాడు. వెంటనే తీసుకుని కాంచీపురం ఎస్ఐ గురుపరన్‌కు అందజేశారు. వడివేలును పోలీసులు అభినందించారు.

స్క్వాష్ విజేత ఈజిప్టు



చెన్నైలో జరిగిన స్క్వాష్ అంతర్జాతీయ పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. ముగింపు వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఈ పోటీలలో ఈజిప్టు జట్టు విజేతగా నిలిచింది. రన్నరప్‌గా మలేషియా, మూడో స్థానాన్ని భారత్, జపాన్ జట్టులు దక్కించుకున్నాయి. ఈ పోటీలలో విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలను సీఎం స్టాలిన్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ మరిన్ని అంతర్జాతీయ పోటీలకు తమిళనాడును వేదికగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. చిత్రంలో సీఎంతో పాటు పతకాలను అందుకున్న క్రీడాకారులు, క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్, ఎంపీ, దయానిధి మారన్, క్రీడల శాఖ అధికారి మేఘనాథరెడ్డి ఉన్నారు.

- సాక్షి, చెన్నై

ఆర్టీఓ కార్యాలయంలో ఏసీబీ దాడులు

తిరువొత్తియూరు: తిరువారూర్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. నాగై జిల్లా ప్రాంతీయ రవాణా అధికారిగా పళనిస్వామి ఇన్‌చార్జి ప్రాంతీయ అధికారిగా పనిచేస్తున్నారు. అలాగే బాలసుబ్రమణ్యం (50) ఎంవీఐగా పనిచేస్తున్నారు. ఈ కార్యాలయంలో లంచం తీసుకుంటున్నట్టు ఏసీబీ పోలీసులకు సమాచారం అందింది. శుక్రవారం సాయంత్రం డీఎస్పీ నందగోపాల్ నేతృత్వంలో పోలీసులు ఆర్టీఓ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో ఎంవీఐ బాలసుబ్రమణ్యం నుంచి లెక్కల్లోకి రాని రూ.3 లక్షల 50 వేలను స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద విచారణ చేస్తున్నారు.

100 బస్తాల గుట్కా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా బస్తాలు

అన్నానగర్: కారిమంగళం సమీపంలో శనివారం 100 బస్తాల గుట్కాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల మీదుగా కేరళ రాష్ట్రానికి నిషేధిత పొగాకు ఉత్పత్తులను తరలిస్తున్నట్లు ధర్మపురి పోలీసులకు సమాచారం అందింది. డివిజన్ రోడ్డు, మోరాపూర్ డివిజన్ రోడ్డు, కుంబరల్లి చెక్‌పోస్టు ప్రాంతాల్లో ముమ్మరంగా శనివారం వేకువజామున వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కుంబరల్లి చెక్‌పోస్టు వద్ద బెంగళూరు నుంచి వచ్చిన ఓ లగ్జరీ కారును ఆపారు. అనుమానంతో పోలీసులు కారు వద్దకు వెళ్లగా డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కారులో తనిఖీ చేయగా 100 బస్తాల్లో రూ.3.23 లక్షల విలువచేసే గుట్కా, లగ్జరీ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన తిమింగలం



కొట్టుకొచ్చిన తిమింగలం

కొరుక్కుపేట: చెన్నైలోని నీలంగరై బీచ్‌లో తీరానకి ఒక తిమింగలం కొట్టుకొచ్చింది. నీలాంగరై పక్కనున్న పనయూర్ బీచ్ నుంచి 50 మీటర్ల దూరంలో చక్కర్లు కొట్టింది. ఇది 15 నుంచి 18 అడుగుల పొడవు ఉంటుంది. తీరానికి అతి సమీపంలోకి వచ్చిన తిమింగలం చూసి జనం తమ సెల్ ఫోన్లలో వీడియో తీశారు.

11 గుడిసెలు దగ్ధం

అన్నానగర్: వేలంగన్ని సమీపంలో శనివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా 11 గుడిసెలు దగ్ధమయ్యాయి. నాగపట్నం జిల్లా వేలంగన్ని వండలూరు పంచాయతీ మేలతేరులో నివాసముంటున్న పకిరిసామి (45). శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అతని గుడిసెకి మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో గాలి వీచి వండలూరు మారియమ్మన్ టెంపుల్ మేలేతేరుకు చెందిన తమిళరసి (50), వెంకటేశన్ (25), బాపయ్యన్ (65), రాజేంద్రన్ (65), రాజేష్ ఖన్నా (22), మదీష్ రాజ్ (23), సుబ్రమణియన్ (50), అరవింద్ (28), పెరియస్వామి, రాహుల్ (21) గుడిసెలకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గంటలు శ్రమించి మంటలను ఆర్పారు. 11 గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి.

40 రామచిలుకలు స్వాధీనం

తిరువొత్తియూరు: పళనిలో అమ్మకానికి ఉంచిన 40 రామచిలుకలు, 70 పిచ్చుకలను అటవీశాఖ సిబ్బంది శనివారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి దంపతులను అరెస్టు చేశారు. దిండిగల్ జిల్లా పళని టౌన్ 17వ వార్డు పరిధిలోని అవని మూలవీధికి చెందిన మరికన్ను (50), ఇతని భార్య పార్వతి (40). వీరు చిలుకలు, పిచ్చుకలను విక్రయిస్తున్నట్లు పళని అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. శుక్రవారం తెల్లవారుజామున మరికన్ను ఇంట్లో అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఇంట్లో పంజరాల్లో ఉంచిన 40 రామ చిలుకలు, 70 పిచ్చుకలను స్వాధీనం చేసుకున్నారు.

ఏజెన్సీ పేరు మార్పునకు లంచం

అసిస్టెంట్ డైరెక్టర్‌కు జైలుశిక్ష



అసిస్టెంట్ మాజీ డైరెక్టర్ విజయరాఘవన్

తిరువళ్లూరు: ఏజెన్సీ పేరు మార్చడానికి రూ.20 వేలు లంచం తీసుకున్న అప్పటి అసిస్టెంట్ డైరెక్టర్‌కు జిల్లా కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానానూ సమర్థిస్తూ హైకోర్టు తీర్పును వెలువరించింది. తిరువళ్లూరు జిల్లా రాజాజీపురం కలైవానర్ వీధికి చెందిన అశోక్ అనే వ్యక్తి రాఘవేంద్ర డిస్ట్రిబ్యూషన్ పేరుతో మెడికల్ విక్రయాలు జరిపే ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. దీంతో పాటు ఇతని స్నేహితుడు సుదర్శన్ అనే వ్యక్తి రామ్‌సన్ అనే ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సుదర్శన్ 2014 జూన్ 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సుదర్శన్ మృతిచెందిన తరువాత అశోకన్ పేరుపై వున్న రాఘవేంద్ర ఏజెన్సీ, సుదర్శన్ పేరుపై ఉన్న రామ్‌సన్ ఏజెన్సీల పేరును సుదర్శన్ భార్య అనురాధకు బదలాయించి ఉమ్మడిగా వ్యాపారం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందు కోసం రెండు ఏజెన్సీలను ఒకేతాటిపైకి తెచ్చి కొత్త పేరుతో వ్యాపారం నిర్వహించాలని నిర్ణయించి పేరు మార్పు కోసం తిరువళ్లూరు జిల్లా ఫార్మటిక్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వున్న విజయరాఘవన్‌ను ఆశ్రయించారు. అయితే ఏజెన్సీ పేరు మార్పునకు రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పాటు లంచం తీసుకుంటూ 2014లో ఏసీబీకి పట్టుబడ్డారు. ఈకేసు తిరువళ్లూరు జిల్లా కోర్టులో విచారణ సాగింది. విచారణ ముగిసిన నేపథ్యంలో 2016వ సంవత్సరంలో లంచం తీసుకున్న వీరరాఘవన్‌కు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ వీరరాఘవన్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో సైతం విచారణ ముగిసిన నేపథ్యంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ శనివారం ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రతిభ చూపిన విద్యార్థినికి విమాన ప్రయాణం



విమానంలో ప్రిన్సిపల్ అముదతో మృణాళిని

అన్నానగర్: మీన్సురుటి సమీపంలో శుక్రవారం ఓ విద్యార్థినిని విమానంలో ఎక్కించి ప్రిన్సిపల్ సంతోషపరచింది. అరియలూరు జిల్లా మీన్సురుటి సమీపంలోని వనవనల్లూరు పంచాయతీ యూనియన్ మిడిల్ పాఠశాలలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 150 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఫిబ్రవరిలో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు జాతీయ సామర్థ్య పరీక్షను నిర్వహించింది. జయంగొండం, దాని పరిసర ప్రాంతాలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు జయంగొండం ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్ సెంటర్‌లో ఈ పరీక్ష రాశారు. ఈ కేంద్రంలో వనవనల్లూరు పంచాయతీ యూనియన్ మిడిల్ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ పరీక్షలో విజయం సాధించిన వారికి విమాన ప్రయాణాన్ని బహుమతిగా అందజేస్తామని పాఠశాల హెచ్‌ఎం అముద విద్యార్థులను ప్రోత్సహించారు. ఇందులో మిడిల్ స్కూల్ విద్యార్థిని మృణాళిని ఉత్తీర్ణత సాధించింది. దీంతో ప్రధానోపాధ్యాయురాలు తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థిని మృణాళిని విమానంలో ప్రయాణించేందుకు ఏర్పాట్లు చేసింది. ఆ మేరకు శుక్రవారం మృణాళినిని తిరుచ్చి విమానాశ్రయానికి తీసుకెళ్లి అక్కడి నుంచి విమానంలో చెన్నై వెళ్లారు.

హనీమూన్‌కు వెళ్లి డాక్టర్ దంపతులు మృతి



మృతి చెందిన నవదంపతులు (ఫైల్)

తిరువళ్లూరు: హనీమూన్ కోసం మాల్దీవులు వెళ్లి మృతి చెందిన నూతన డాక్టర్ దంపతుల మృతదేహాలు రెండు వారాల క్రితం విమానం ద్వారా ఇంటికి చేర్చారు. తిరువళ్లూరు జిల్లా పూందమల్లి చెన్నీర్‌కుప్పం ప్రాంతానికి చెందిన సెల్వం కుమార్తె విభూష్న డాక్టర్. ఈమేకు చెన్నైకు చెందిన డాక్టర్ లోకేశ్వరన్‌తో గత ఒకటిన అత్యంత వైభవంగా వివాహం జరిగింది. వివాహం జరిగిన రెండు రోజుల తరువాత నూతన జంట హనీమూన్ కోసం మాల్దీవులకు వెళ్లారు. అనంతరం అక్కడున్న రిజర్వాయర్‌లో బోట్‌లో వెళుతూ ఫొటో షూట్ తీసుకున్నారు. ఈ సమయంలో జరిగిన ప్రమాదంలో పడవ బోల్తా పడడంతో నూతన జంట నీటిలో మునిగి అక్కడే మృతిచెందారు. మృతదేహాలను వెలికి తీసిన అక్కడి పోలీసులు లాంచనాలను పూర్తి చేశారు. అనంతరం అక్కడి నుంచి విమానం ద్వారా మలేషియాకు అక్కడి నుండి చెన్నైకు మృతదేహాలను తరలించారు. కాగా చెన్నైకు చేరిన తరువాత విభూష్న మృతదేహాన్ని చెన్నీర్‌కుప్పానికి, లోకేశ్వరన్ మృతదేహాన్ని సేలంకు బంధువులు తరలించారు. శనివారం మధ్యాహ్నం విభూష్న మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా గత రెండు వారాల క్రితం పచ్చటి తోరణాలు, మంగళవాయిద్యాలతో కలకలాడిన ప్రాంతంలో చావు మేళాలు వినిపించడంతో విషాదాచాయలు అలుముకున్నాయి.

భర్త మృతితో భార్య ఆత్మహత్య

అన్నానగర్: మేట్టుపట్టి సమీపంలో భర్త మృతి చెందడంతో మనస్తాపానికి గురైన భార్య శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పుదుకోట్టై మేట్టుపట్టికి చెందిన సతీష్ కుమార్ కుమార్తె సుభాషిణి (22). ఈమె భర్త బాలసుబ్రహ్మణ్యం. వీరిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి వివాహమై ఏడు నెలలైంది. 2 నెలల క్రితం బాలసుబ్రహ్మణ్యం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో భార్య సుభాషిణి తీవ్ర మనోవేదనకు గురై తన తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. ఈ స్థితిలో శనివారం ఉదయం సుభాషిణి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై గణేష్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భర్త మృతి చెందడం వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

ఐటీ ఉద్యోగుల వ్యాన్‌లో మంటలు

తిరువొత్తియూరు: ఐటీ కంపెనీ ఉద్యోగులతో వెళ్తున్న వ్యాన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తూ ఉద్యోగులు ప్రాణాలతో బయటపడ్డారు. చెన్నై, పోరూర్‌లోని ఓ ప్రైవేట్ ఐటీ కంపెనీకి చెందిన ఏడుగురు ఉద్యోగులతో శనివారం తెల్లవారుజామున ఓ వ్యాన్ మాధవరానికి బయలుదేరింది. కొరట్టూరు అన్నానగర్ పోలీస్ బూత్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగలు వచ్చాయి. ఇది చూసి షాక్‌కు గురైన డ్రైవర్ నరేష్ (29) వ్యాన్‌ను ఆపి ఉద్యోగులను దించేశాడు. అప్పటికే వ్యాన్‌లో మంటలు పూర్తిగా వ్యాపించాయి. విషయం తెలిసి కొరట్టూరు పోలీసులు, అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది.

యువకుడు దారుణ హత్య

అన్నానగర్: సాత్తాంగులం సమీపంలో ప్రేమ వివాహం చేసుకున్న యువకుడిని శుక్రవారం దారుణంగా నరికి చంపారు. తూత్తుక్కుడి జిల్లా సాత్తాంగులం కీళ వీధికి చెందిన దురైమురుగన్. ఇతని కుమారుడు జయసూర్య (25) ప్రేమ వివాహం చేసుకున్నాడు. తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య విడిపోవడంతో జయసూర్య ఒంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి జయసూర్య ఇంట్లో రక్తపు మడుగులో ప్రాణాలతో పోరాడుతుండడం చూసిన స్నేహితుడు వెంటనే ఇరుగుపొరుగు వారి సహాయంతో జయసూర్యను సాత్తంగులం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో జయసూర్య ఇంట్లో ఒంటరిగా ఉండగా, గుర్తుతెలియని వ్యక్తి హఠాత్తుగా ఇంట్లోకి చొరబడి కొడవలితో వెళ్లి అతడిని నరికి పారిపోయాడని తెలిసింది. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్‌పై దాడికి యత్నం

- సోషల్ మీడియాలో వైరల్

కొరుక్కుపేట: విల్లుపురం జిల్లా తిరువెన్నై గ్రామానికి చెందిన శివశంకరన్ (39) బస్ కండక్టర్. డ్రైవర్ దయానంద మూర్తి (57) తండయార్ పేటకు చెందినవారు. తండయార్‌పేట బస్ డిపో నుంచి బస్సు బ్రాడ్‌వే నుంచి ఐసీకి బయలుదేరింది. తండయార్ పేట వెళ్లే బస్సులో ఐదు గురు పాఠశాల విద్యార్థులు తండయార్ పేట పోస్టాఫీసు బస్టాప్‌లో ఎక్కి బస్సు వెనుక ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ ప్రయాణికులను వేధించడం ప్రారంభించారు. అనంతరం తండయార్‌పేట మెట్రో రైల్‌స్టేషన్ వద్ద బస్సు కండక్టర్ బస్సును ఆపి పాఠశాల విద్యార్థులను మందలించారు. దీంతో ఓ విద్యార్థి రోడ్డుపై నుంచి బీరు బాటిల్ తీసుకుని కండక్టర్‌పై దాడికి యత్నించాడు. బస్సు బయల్దేరుతుండగా విద్యార్థులు బీరు బాటిల్‌ను బస్సుపైకి విసిరారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

క్లుప్తంగా...

21న తిరుమలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో ఇండో టిబెట్ బార్డర్ పోలీస్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నారు. యోగా శిక్షకులు యోగాసనాలు, వాటి వల్ల శారీరకంగా, మానసికంగా కలిగే ఉపయోగాలను తెలియజేస్తారు. పోలీస్ ఫోర్స్‌తోపాటు టీటీడీ ఉద్యోగులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇండో టిబెట్ బార్డర్ పోలీస్ ఫోర్స్ 53వ బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ ఆయుష్ దీపక్ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీశైలంలో గంట ముందు వరకు ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవల టికెట్లు



శ్రీశైలం టెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం ఆలయంలో జరిగే ఆయా ఆర్జిత సేవల ప్రారంభ సమయానికి ఒక గంట ముందు వరకు భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లు పొందవచ్చని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న శనివారం తెలిపారు. ప్రతి నెలా 25న రాబోయే మాసానికి సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామన్నారు. దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా భక్తులు ఆయా సేవా టికెట్లను ముందస్తుగా పొందవచ్చునని వివరించారు.

నర్సీపట్నంలో జీసీసీ కాఫీ యూనిట్!

- ఇప్పటికే 2 వేల టన్నుల సామర్థ్యంతో 3 గోడౌన్లు రెడీ

సాక్షి, విశాఖపట్నం: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కాఫీ గింజలు సేకరిస్తున్నా.. క్యూరింగ్, ప్రాసెసింగ్ కోసం ప్రైవేట్ సంస్థల్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సొంతంగానే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేదిశగా జీసీసీ అడుగులు వేస్తోంది. నర్సీపట్నంలో ఈ యూనిట్ నెలకొల్పేందుకు చర్యలు చేపడుతోంది. ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీ ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ ఎస్టేట్స్ ఉన్నాయి. ఈ ఎస్టేట్స్‌లోని కాఫీ గింజల్ని క్యూరింగ్ చేసిన తర్వాత జీసీసీకి సంబంధించిన క్యూరింగ్ పనులు ప్రారంభిస్తారు. క్యూరింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియల్ని ఇతర ప్రాంతాల్లో నిర్వహించడం వల్ల మార్కెటింగ్‌కు తీవ్ర జాప్యం జరుగుతోంది. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు సొంతంగా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని జీసీసీ నిర్ణయించింది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

నర్సీపట్నంలో ఉన్న జీసీసీ పెట్రోల్ బంక్ వెనుక ఉన్న 0.73 ఎకరాల్లో ఈ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించాలని భావిస్తోంది. ఇక్కడ ప్రస్తుతం జీసీసీకి సంబంధించిన మూడు ఖాళీ గోదాములు ఉన్నాయి. ఒక్కో గోదాము 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించారు. దీంతోపాటు డ్రైయింగ్ ప్లాట్‌ఫామ్‌లు కూడా ఉన్నాయి. మొత్తం రూ.3.50 కోట్లతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ని ప్రాథమికంగా ఏర్పాటు చేయవచ్చనే ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి అధికారులు పంపించారు. ఈ యూనిట్‌కు అవసరమైన యంత్రాలకు సంబంధించి మంగుళూరుకు చెందిన అంతర్జాతీయ కాఫీ ప్రాసెసింగ్ సంస్థలతో సంప్రదింపులు జరిపిన అధికారులు దేశంలో ఉన్న యూనిట్స్‌లో దీన్ని కూడా నాణ్యమైన ప్రాసెసింగ్ యూనిట్‌గా తీర్చిదిద్దాలని సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న గోదాముల్ని యూనిట్‌కు అనుగుణంగా మార్పులు చేస్తే వీలైనంత త్వరగా ప్రాసెసింగ్ చేసేందుకు అవకాశం ఉంటుందని జీసీసీ భావిస్తోంది.



నర్సీపట్నంలో ఉన్న జీసీసీ గోడౌన్లు

గిరిజనులకు మేలు జరుగుతుంది..



కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను వీలైనంత త్వరగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. మెషినరీకి దాదాపు రూ.3 కోట్లు అవుతుందని అంచనా వేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే వీలైనంత త్వరగా యూనిట్ పనులు ప్రారంభిస్తాం. ఇది పూర్తయితే వీలైనంత త్వరగా కాఫీ రైతులకు పేమెంట్ చేసేందుకు అవకాశం కలుగుతుంది. ప్రాసెసింగ్ చేసిన కాఫీని త్వరితగతిన మార్కెట్‌కు పంపించేందుకు మార్గం సుగమమవుతుంది.

– సురేష్‌కుమార్, ఎండీ, జీసీసీ

వ్యాన్‌ను ఢీకొన్న కారు... ఐదుగురి దుర్మరణం

- మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- అంబేడ్కర్ కోనసీమ జిల్లా మడికి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



వేగేశ్న సుబ్రహ్మణ్యం రాజు (ఫైల్)





మృతులు వెంకునాయుడు, పి.కన్నయ్య లింగం (ఫైల్)





గంగిరెడ్ల శ్రీను, బోడి వెంకటరమణ (ఫైల్)

ఆలమూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆలమూరు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన తొమ్మిది మంది శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మందపల్లిలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర(శనైశ్చర) స్వామి దర్శనం కోసం టాటా ఏస్ వ్యాన్‌లో బయలుదేరారు. అదేరోజు రాత్రి 11.30 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వెంకటాపురం శివారు లంకల కోడేరుకు చెందిన వేగేశ్న సుబ్రహ్మణ్యరాజు విశాఖపట్నం విమానాశ్రయంలో తన స్నేహితులు ముగ్గురిని కారులో ఎక్కించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. వీరి కారు మడికి గ్రామంలోని సూర్యా థియేటర్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న టాటా ఏస్ వ్యాన్‌ను వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. అనంతరం రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వేగేశ్న సుబ్రహ్మణ్యరాజు (45) అక్కడికక్కడే మృతిచెందారు. కారు ఢీకొన్న వేగానికి టాటా ఏస్ వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న తొమ్మిదిమంది రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. వీరిలో పతివాడ కన్నయ్యలింగం (51), గంగిరెడ్ల శ్రీనివాసరావు (36), డ్రైవర్ బోడి వెంకటరమణ అలియాస్ తిరుపతి ఘటనాస్థలంలోనే మరణించారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న బోడి వెంకునాయుడు (45) రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఆరుమిల్లి రాజేశ్వరరావు, గొట్టిముక్కల వెంకట్రాజు, మేడపాటి రామిరెడ్డితోపాటు వ్యాన్‌లో ప్రయాణిస్తున్న పోసూరి నరసింగరావు, తమ్మన శ్రీనివాసరావు, ముప్పల శ్రీనివాసరావు, కొమరి హేమంత్, బోడి సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు.

వాహనాల వెలుతురులోనే ప్రథమ చికిత్స

రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎస్‌హెచ్ అంబులెన్స్, ఆలమూరు, రావులపాలెం 108 వాహనాల సిబ్బంది తక్షణమే వచ్చి చెల్లాచెదురుగా పడి ఉన్న క్షతగాత్రులకు వాహనాల వెలుతురులోనే ప్రథమ చికిత్స అందించారు. గాయపడినవారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి, మృతదేహాలను మండపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తండ్రి ఆస్తిలో కుమార్తెలకూ సమాన హక్కు

- హిందూ వారసత్వ సవరణ చట్టం 'పూర్వం' నుంచే వర్తిస్తుంది
- తండ్రి మరణించారా? లేదా? అన్న దానితో సంబంధం లేదు
- వినీత శర్మ కేసులో కూడా సుప్రీం కోర్టు ఇదే చెప్పింది
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి తీర్పు



సాక్షి, అమరావతి : హిందూ వారసత్వ సవరణ చట్టం ప్రకారం కూతురు పుట్టుకతోనే తండ్రి ఆస్తిలో సమాన వారసత్వ హక్కుదారు అవుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. సవరణ చట్టం అమల్లోకి వచ్చిన 2005 సెప్టెంబర్ 9వ తేదీ నాటికి తండ్రి మరణించారా? లేదా? అన్న దాంతో సంబంధం లేకుండా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఆస్తుల విషయంలో కుమార్తెలకు సైతం సమాన హక్కు ఉంటుందని తేల్చి చెప్పింది. ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు వినీత శర్మ కేసులో స్పష్టంగా చెప్పిందని, సవరణ చట్టం అమల్లోకి వచ్చే నాటికి తండ్రి బతికి ఉండాల్సిన అవసరం లేదని తెలిపిందని వివరించింది. తండ్రి ఉమ్మడి ఆస్తిలో కుమార్తెలకు సమాన వాటా హక్కును సవరణ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత నుంచి మాత్రమే పరిమితం చేయలేమని తేల్చి చెప్పింది. ఆ చట్టం నిబంధనలు పూర్వం (రెట్రోస్పెక్టివ్) నుంచే వర్తిస్తాయని చెప్పడంలో ఎలాంటి సంశయం లేదంది. హిందూ వారసత్వ సవరణ చట్టం ప్రకారం తుది తీర్పునివ్వాలని అభ్యర్థిస్తూ తెనాలి కోర్టును ఆశ్రయించాలని ఓ కేసులో పిటిషనర్లుగా ఉన్న ముగ్గురు మహిళలకు హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఈ నెల 13న తీర్పు వెలువరించారు.

తండ్రి ఆస్తిలో వాటా కోసం కుమార్తెల పోరాటం

తమ తండ్రి తురగా రామమూర్తికి చెందిన ఉమ్మడి ఆస్తిలో వాటా ఇచ్చేందుకు సోదరులు, సోదరీమణులు తిరస్కరిస్తున్నారంటూ ఆనందరావు అనే వ్యక్తి 1986లో తెనాలి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దావా వేశారు. ఇదే సమయంలో హిందూ వారసత్వ సవరణ చట్టం ప్రకారం తమ తండ్రి ఆస్తిలో తమకు సమాన వాటా ఉందని, ఆ మేర తీర్పునివ్వాలని కోరుతూ రామమూర్తి కుమార్తెలు సీతారావమ్మ మరో ఇద్దరు ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు 2009లో వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ ఉత్తర్వులను సమీక్షించాలంటూ రామమూర్తి కుమారుల్లో కొందరు, వారి వారసులు తెనాలి కోర్టులో అనుబంధ పిటిషన్ వేశారు. విచారణ జరిపిన కోర్టు 2010లో కుమారులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. వారసత్వ సవరణ చట్టం ఆస్తి వాటాల విషయంలో కుమార్తెలకు వర్తించదని కోర్టు చెప్పింది. సవరణ చట్టాన్ని పూర్వం నుంచి వర్తింపజేయడానికి వీల్లేదని చెప్పింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ముగ్గురు కుమార్తెలు అదే ఏడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి తుది విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున చింతలపాటి పాణినీ సోమయాజి వాదనలు వినిపించారు.

టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ తాగునీరు

నారా లోకేశ్



కలువాయి(తిరుపతి జిల్లా)/ఆత్మకూరు: టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి కాలనీలో రోడ్లు వేయించడంతో పాటు ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు సరఫరా చేస్తామని టీడీపీ నేత నారా లోకేశ్ గిరిజనులకు హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్రలో భాగంగా శనివారం సాయంత్రం కలువాయి మండలం వెంటరెడ్డిపల్లి క్యాంప్ వద్ద గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి 40 వేల పరిశ్రమలు తీసుకొచ్చాం.. ఆరు లక్షల ఉద్యోగాలిచ్చాం.. ఈ దఫా టీడీపీ అధికారంలోకొస్తే ప్రభుత్వ, ప్రైవేటు, స్వయం ఉపాధి ద్వారా 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తాం.. అని చెప్పారు. ఈ ప్రభుత్వం గతంలో ఉన్న 100 సంక్షేమ పథకాలను రద్దు చేసిందని లోకేశ్ ఆరోపించారు. 14 కి.మీ సాగిన లోకేశ్ పాదయాత్ర.. ఉయ్యాలపల్లి గ్రామ శివార్ల వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి చేరింది.

ఉరుగ్వే చేరుకున్న పార్లమెంటరీ కమిటీ

- రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతంపై చర్చలు
- కమిటీ సభ్యుడు, తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి



ఉరుగ్వేలో వివిధ అంశాలపై చర్చిస్తున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : వివిధ అంశాలపై అధ్యయనం కోసం కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి నేతృత్వంలో పది మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ కమిటీ శనివారం బ్రెజిల్ నుంచి ఉరుగ్వే చేరుకుంది. ఉరుగ్వేలో తమకు ఘన స్వాగతం లభించిందని కమిటీ సభ్యుడు, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. ఉరుగ్వే దేశ ముఖ్యులతో పార్లమెంటరీ కమిటీ సమావేశమై ఇరు దేశాల మధ్య వ్యాపార, స్నేహ సంబంధాల బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు. యూఎన్‌వోలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ఇవ్వాలని కోరామని వివరించారు. ఉరుగ్వేలో అతిపెద్ద సంస్థ మన దేశానికి చెందిన టీసీఎస్ కావడం గర్వకారణమని, అక్కడ ఉద్యోగుల్లో తెలుగువారు ఉన్నారని, వారందరినీ కలవడం సంతోషంగా ఉందన్నారు.

● తెలంగాణ

వర్షాభావంపై ఇప్పుడే మాట్లాడటం సరికాదు

- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్
- ముగిసిన జీ–20 వ్యవసాయ మంత్రుల సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో వ్యవసాయానికి అత్యంత కీలకమైన రుతుపవనాలు ఆలస్యం అవుతుండటంపై ఇప్పుడే స్పందించడం సరికాదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ వ్యాఖ్యానించారు. రుతుపవనాలు ఆలస్యమైన విషయం, దేశంలోని సగం జిల్లాల్లో తగినన్ని వానలు లేకపోవడం తన దృష్టిలో ఉందని ఆయన అన్నారు. అయితే ఈ అంశంపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటవుతుందని పేర్కొన్నారు. జీ20 సమావేశాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ మంత్రుల సమావేశాల ముగింపు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగిన వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశాల్లో అన్ని దేశాల ప్రతినిధులు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు భారత్ చేపడుతున్న చర్యలను పూర్తిస్థాయిలో సమర్థించారని తెలిపారు. అన్ని దేశాల ప్రతినిధులు ప్రపంచ ఆహార భద్రతకు కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తించారని, ఈ దిశగా భారత్ ప్రతిపాదించిన దక్కన్ సిద్ధాంతానికి, సిరిధాన్యాల ప్రోత్సాహానికి చేపట్టనున్న మహర్షి కార్యక్రమానికి పూర్తిస్థాయిలో ఆమోదం తెలిపారని చెప్పారు. వ్యవసాయం, ఆహార సంబంధిత రంగాల్లో మహిళలు, యువత భాగస్వామ్యాన్ని మరింత పెంచాలన్న ప్రతినిధుల సూచన కూడా ఆమోదం పొందిందని మంత్రి వెల్లడించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా ఆహార భద్రతను సాధించాలని ఆయన రైతులకు సూచించారు. ఈ విషయంలో జీ20 సభ్యదేశాలతో కలసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు.

పెరిగిన ప్రపంచ దేశాల బాధ్యత..

ప్రకృతి ప్రకోపాల కారణంగా రైతులు చాలాసార్లు నష్టపోవాల్సి వస్తుందని, వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్న ఈ తరుణంలో ప్రపంచ దేశాల బాధ్యత మరింత పెరిగిందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. పెరుగుతున్న జనాభాకు తగినంత ఆహారం, పోషకాలు అందించడం, ఆహార ఉత్పత్తులు, ఉత్పాదకత, నాణ్యతలను కాపాడుకోవడం సవాలుగా మారుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కరువు కాటకాలను తట్టుకునే కొత్త వంగడాలను సృష్టించడంపై శాస్త్రవేత్తలు ఇప్పటికే కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. అయితే జీ20 ద్వారా ప్రపంచం మొత్తమ్మీద ఈ ప్రయత్నాలను ముమ్మరం చేసేందుకు ఒక కొత్త ప్రణాళిక సిద్ధమవుతోందని వివరించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీ ఇళ్లల్లో ముగిసిన ఐటీ సోదాలు

- మూడు రోజులపాటు తనిఖీలు
- ఇళ్లు, కార్యాలయాల్లో పలు పత్రాల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో గత మూడు రోజులుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీ ఇళ్లు, కార్యాలయాల్లో అలజడి సృష్టించిన ఐటీ అధికారుల సోదాలు ముగిశాయి. బుధవారం ఉదయం ప్రారంభమైన ఈ సోదాలు శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగినట్టు సమాచారం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రిజనార్దన్ రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాలతో పాటు వారితో స్థిరాస్తి వ్యాపార సంబంధాలున్నాయన్న ఆరోపణలపై మరికొన్ని కంపెనీల్లోనూ ఈ సోదాలు జరిగాయి. పదుల సంఖ్యలో ఐటీ అధికారులు.. దాదాపు 60కిపైగా ప్రాంతాల్లో మూడు రోజుల సోదాల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. పన్ను ఎగవేతలు, ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలపై ఆరా తీసిన అధికారులు, సదరు నాయకులకు నోటీసులు జారీ చేశారు. సంబంధిత వివరాలు, ఆధారాలతో ఫతేమైదాన్‌లోని ఐటీ ఆఫీస్‌లో మంగళవారం హాజరుకావాలని సూచించినట్టు సమాచారం. హైదరాబాద్‌లో కొత్తపేట గ్రీన్‌హిల్స్ కాలనీలోని శేఖర్‌రెడ్డి ఇళ్లు, ఆఫీసులు, జూబ్లీహిల్స్‌లోని మర్రి జనార్దన్‌రెడ్డి ఇళ్లు, ఆఫీసులో సోదాల సందర్భంగా వారి అనుచరుల ఆందోళనలు కొంత ఉద్రిక్తతకు దారితీశాయి. ఇద్దరు ఎమ్మెల్యేలు బ్యాంకు ఖాతాలతోపాటు బ్యాంకు లాకర్లను సైతం తెరిపించి సోదాలు చేపట్టారు. శుక్రవారం లైఫ్‌స్టైల్ సంస్థ డైరెక్టర్ ఇల్లు, కార్యాలయాల్లోనూ ఈ సోదాలు కొనసాగాయి.

మేఘానికి షాకిస్తే..

- వర్షం నీటితో విద్యుత్ ఉత్పత్తి చేయడంపై పరిశోధనలు
- రెయిన్ డ్రోన్ల సాయంతో వినూత్న ప్రయోగాలు
- భారత్‌లోనూ ఆ దిశగా పడుతున్న అడుగులు



సాక్షి, అమరావతి: వర్షం నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేయడం గురించి విన్నారా? ఇప్పుడు దీనిపై ప్రయోగాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. భవిష్యత్తులో వర్షం ప్రధాన విద్యుత్ ఉత్పత్తి వనరుగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ దిశగా ఇప్పటికే దుబాయ్ వంటి కొన్ని దేశాలు తమ ప్రయత్నాలను విజయవంతంగా పూర్తి చేశాయి. రెయిన్ డ్రోన్ల సాయంతో వానలు కురిపించాయి. దుబాయ్ దేశంలో వర్షపు నీటితో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంపై ప్రయత్నాలు జరిగాయి. ప్రత్యేకంగా తయారు చేసిన రెయిన్ డ్రోన్ల ద్వారా మేఘాలకు షాక్ ఇచ్చి ఎడారిలో వానలు కురిపించారు ఆ దేశ శాస్త్రవేత్తలు. వర్షపు నీటితో విద్యుత్ ఉత్పత్తిపై ప్రయోగాలు చేశారు.

రెయిన్‌డ్రాప్ విద్యుత్ ఉత్పత్తి..

చిన్న టర్బైన్‌లను నడపడానికి వర్షపు నీటిని ఉపయోగించడాన్ని రెయిన్‌డ్రాప్ విద్యుత్ ఉత్పత్తి అంటున్నారు. దీని ద్వారా ఇళ్లు, చిన్న నీటి శుద్ధీకరణ వ్యవస్థలకు విద్యుత్‌ను అందించవచ్చు. పియెజోఎలక్ట్రిక్ పదార్థాలు వర్షపు చినుకులు ఉపరితలంపైకి వచ్చినప్పుడు విడుదలయ్యే శక్తి ఆధారంగా విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. హాంకాంగ్‌లో సిటీ యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ పరిశోధకుల బృందం (డీఈజీ) బిందువుల ఆధారిత విద్యుత్ జనరేటర్‌ని రూపొందించింది. వర్షపాతాన్ని విద్యుత్‌గా మార్చడానికి 'ఫీల్డ్–ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్–స్టైల్ స్ట్రక్చర్'ను ఉపయోగించింది. వీటి సాయంతో ఒక్కో వర్షపు బిందువు దాదాపు 140 వోల్ట్‌లను ఉత్పత్తి చేయగలదని బృందం పేర్కొంది. అంటే ఇళ్లకు సరఫరా చేయగలిగే విద్యుత్‌ను వాన నీటితో ఉత్పత్తి చేయవచ్చు. మన దేశంలోనూ ఆ దిశగా ప్రయోగాలు జరుగుతున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)–ఢిల్లీ పరిశోధకులు నీటి చుక్కలు, వర్షపు చినుకులు, నీటి ప్రవాహాలు, సముద్రపు అలల నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయగల పరికరాన్ని రూపొందించారు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేయవచ్చు. ఇందుకోసం లిక్విడ్–సాలిడ్ ఇంటర్‌ఫేస్ ట్రైబోఎలక్ట్రిక్ నానోజనరేటర్‌ను ప్రత్యేకంగా తయారు చేశారు. ఇది కొన్ని మిల్లీవాట్ (ఎండబ్ల్యూ) శక్తిని ఉత్పత్తి చేయగలదు. దీంతో వాచీలు, డిజిటల్ థర్మామీటర్‌లు, రేడియో ఫ్రీక్వెన్సీ ట్రాన్స్‌మిటర్‌లు, హెల్త్‌కేర్ సెన్సార్‌లు, పెడోమీటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు విద్యుత్‌ను అందించవచ్చు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీ చోరీ

- తిరుపతికి చెందిన మహిళ నుంచి రూ.40 లక్షల విలువైన ఆభరణాలు, నగదు చోరీ..

సికింద్రాబాద్: తిరుపతికి చెందిన మహిళ నుంచి రూ.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి వాస్తవ్యురాలు ఎస్.స్రవంతి అనే మహిళ ఏపీ సాంఘిక సంక్షేమ శాఖలో అధికారిగా పని చేస్తున్నారు. ఆమె హైదరాబాద్ నగర శివారులోని గుండ్లపోచంపల్లిలో శుభకార్యానికి హాజరయ్యేందుకు వచ్చారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుపతికి తిరుగు ప్రయాణం చేసేందుకు శనివారం ఉదయం 5 గంటల సమయంలో స్రవంతి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 1వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్నారు. రైలు 4వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు వస్తుందన్న ప్రకటన వెలువడడంతో అక్కడికి వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కే క్రమంలో తన లగేజీలోని ఒక సూట్‌కేసు జిప్ తెరిచి ఉన్నట్టు స్రవంతి గుర్తించింది. సూట్‌కేసు మొత్తంగా తెరిచి చూడగా అందులోని బంగారు ఆభరణాలు గల మరో బ్యాగ్ కనిపించలేదు. తన సూట్‌కేసులోని రెండు డైమండ్ నెక్లెస్‌లు, రెండు ఉంగరాలు, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్టు స్రవంతి సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీకి గురైన ఆభరణాలు విలువ రూ.40 లక్షలు ఉంటాయని అంచనా. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ప్యాసింజర్ రైళ్లకు మంగళం

స్వాతంత్రోద్యమ కాలం నుంచి రైళ్లు ప్రజల జీవితాలతో ముడిపడి ఉండేవి. రోడ్డు మార్గాలు, రవాణా సాధనాలు అంతంతమాత్రంగా ఉన్న రోజుల్లో పేద, మధ్య, ఎగువ తరగతి ప్రజలకు ప్రయాణ సాధనం రైలు మాత్రమే. దీంతో రైల్వే శాఖ నిరంతరం ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో పనిచేసేది. కాలక్రమేణా ఆధునికత సంతరించుకున్న రైల్వే శాఖ సేవామార్గాన్ని విస్మరించి లాభార్జనే పరమావధిగా పనిచేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలో ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి, వాటిని ఎక్స్‌ప్రెస్‌లుగా మార్పు చేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయాణం భారంగా మారింది.

ఎక్స్‌ప్రెస్‌లుగా మారిపోయిన మూడు ప్యాసింజర్లు

- సామాన్యులు, పేదలకు భారంగా రైలు ప్రయాణం
- ఎక్స్‌ప్రెస్‌ల్లో స్లీపర్ బోగీల కుదింపుతో దొరకని బెర్త్
- అంతంతమాత్రంగా విజయవాడ–విశాఖ మధ్య రైళ్లు

ఏలూరు (టూటౌన్): ఒక నాడు అధికంగా కనిపించే ప్యాసింజర్ రైళ్లు క్రమేణా కనుమరుగయ్యాయనే చెప్పవచ్చు. ఎక్కడో కొన్ని మార్గాల్లో మినహా ప్యాసింజర్ రైళ్లు అనేవి కనిపించని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా విజయవాడ డివిజన్ పరిధిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా రాజమండ్రి–విజయవాడ ప్యాసింజర్ రైలు ప్రతి రోజు అప్ అండ్ డౌన్‌గా తిరిగేది. ఇది పేద ప్రజలకు, నిత్యం ప్రయాణించే చిరు వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులకు అక్కరకు వచ్చేది. ఉదాహరణకు ఏలూరు నుంచి కేవలం రూ.15 చార్జీతో విజయవాడ ప్రయాణం చేసి మళ్లీ సాయంత్రం తిరిగి వచ్చే వెసులుబాటు ఉండేది. అంటే ఒక ప్రయాణికుడు కేవలం రూ.30 ఖర్చుతో ఏలూరు నుంచి విజయవాడ వెళ్లి వచ్చే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఈ రైలు ఎక్స్‌ప్రెస్‌గా మార్చివేశారు. అలాగే చార్జీలు పెద్ద ఎత్తున పెంచి వేశారు. దీంతో గతంలో కిక్కిరిసి ఉండే ప్రయాణికులు ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ రైలుగా మార్చిన తరువాత నామమాత్రంగానే కనిపిస్తున్నారు. కాకినాడ పోర్టు నుంచి విజయవాడ వచ్చే ఫాస్ట్ ప్యాసింజర్ రైలు సైతం నేడు ఎక్స్‌ప్రెస్ రైలుగా రూపాంతరం చెందింది. సుదూర ప్రాంతం నుంచి వచ్చే రాయగడ–గుంటూరు ప్యాసింజర్ సైతం ఎక్స్‌ప్రెస్‌గా మార్చివేశారు. దీంతో ఈ ప్రాంతం నుంచి విశాఖపట్టణం, శ్రీకాకుళం, రాయగడ ప్రాంతాలకు వెళ్లే వలస కూలీలు, సాధారణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పాత సీసాలో కొత్త సారా నింపినట్లు గతంలో నడిచే ప్యాసింజర్ రైళ్లనే ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి వేసి పెద్ద ఎత్తున చార్జీలు వసూలు చేస్తున్నారే తప్ప ఆ రైళ్లల్లో అదనంగా ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



స్లీపర్ బోగీలు కుదింపు.. ఏసీ బోగీలు పెంపు

రైళ్లలో ప్రయాణించే జనరల్, స్లీపర్ క్లాస్ బోగీల విషయంలో రైల్వే శాఖ పట్టించుకోవడం లేదనేది ప్రయాణికుల వాదనగా ఉంది. రద్దీ ఉండే అనేక రైళ్లలో ఏసీ బోగీల సంఖ్యను ఇబ్బడిముబ్బడిగా పెంచుతున్నారు. ఇదే సమయంలో జనరల్, స్లీపర్ బోగీల సంఖ్యను కుదిస్తున్నారు. భువనేశ్వర్ నుంచి బెంగుళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో గతంలో స్లీపర్ బోగీలు 10, ఏసీ బోగీలు 3 ఉండేవి. తాజాగా స్లీపర్ బోగీలను ఆరుకు తగ్గించి, ఏసీ బోగీలను ఆరుకు పెంచారు. అలాగే విశాఖపట్టణం–హైదరాబాద్ మధ్య నడిచే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో గతంలో స్లీపర్ బోగీలు 12 ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య ఏడుకు తగ్గించి, ఏసీ బోగీలను మూడు నుంచి ఏడుకు పెంచారు. ఇలా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ బోగీలను తగ్గించి, ఏసీ బోగీలను పెంచడం వల్ల సాధారణ ప్రజలకు రైలు ప్రయాణం అందని ద్రాక్షలా చేస్తున్నారనేది ప్రయాణికుల వాదనగా ఉంది.

రైళ్ల రద్దుతోనూ తప్పని అవస్థలు

ఇటీవల ఒడిశాలో జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంతో పాటు ట్రాక్‌ల మెయింటెనెన్స్ పేరుతో విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేశారు. నిత్యం ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండే విజయవాడ–విశాఖపట్టణం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు–విశాఖపట్టణం మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్టు–విజయవాడ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును పలు పర్యాయాలు రద్దు చేస్తుండటంతో వాటిలో ప్రయాణించేందుకు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇవన్నీ రెగ్యులర్ ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు నిత్యం ప్రయాణించే రైళ్లే. వీటిని పలు కారణాలతో ఎక్కువ సార్లు రద్దు చేస్తుండటంతో నిత్యం ప్రయాణించే వారి బాధలు వర్ణనాతీతంగా చెప్పుకోవచ్చు.

ఆదాయం బాగుంటేనే గ్రీన్‌సిగ్నల్

పలు కారణాలతో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్న రైల్వే శాఖ అంతరాష్ట్ర సర్వీసులను, రైల్వేకు అధిక ఆదాయం తెచ్చే వందేభారత్ వంటి రైళ్లను మాత్రం యధావిధిగా నడపడంపై సాధారణ ప్రయాణికులు విమర్శలు చేస్తున్నారు. భిన్నమతాలు, భాషలు, ప్రాంతాలను కలిపే రైళ్లు నేడు లాభాలు తెచ్చే మార్గాల వైపే దృష్టి సారించడం శోచనీయమంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్లీపర్ బెర్త్ దొరకడమే కష్టమే

స్లీపర్ క్లాస్ బోగీల సంఖ్యల తగ్గించి వేస్తుండటంతో రిజర్వేషన్ దొరకడమే కష్టంగా మారింది. నెల ముందు రిజర్వేషన్ కోసం ప్రయత్నించినా వెయిటింగ్ లిస్ట్ వస్తోంది. గతంలో నాలుగు రోజుల ముందు ప్రయత్నిస్తే స్లీపర్ క్లాస్‌లో రిజర్వేషన్ దొరికేది. సామాన్య, మధ్యతరగతి ప్రయాణికుల పట్ల రైల్వే శాఖ శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

– కొరబండి బాబూరావు, సామాజిక కార్యకర్త, ఏలూరు

నేడు ఫాదర్స్ డే



వైరల్

నాన్న పాటలు మాటలు

అంతర్జాల ప్రపంచంలో 'ఫాదర్స్ డే' సందడి మూడు నాలుగు రోజుల క్రితమే మొదలైంది. 'ఫాదర్స్ డే రోజు వినాల్సిన బాలీవుడ్ ఫేమస్ పాటలు'

'తండ్రి అడుగు జాడల్లో నడుస్తున్న కథానాయికలు'

'ఫాదర్స్ డే రోజు తండ్రితో కలిసి చూడాల్సిన సినిమాలు'...

ఇలా ఎన్నో విషయాలపై నెటిజనుల పోస్ట్‌లు చక్కర్లు కొడుతున్నాయి. వాటిలో కొన్ని...

'ఫాదర్స్ డే' రోజు వినాల్సిన పాటల విషయానికి వస్తే... అమీర్‌ఖాన్ సినిమా 'ఖయామత్ సే ఖయామత్'లోని 'పప్పా కెహ్తాహై'... అక్షయ్ కుమార్ 'బాస్' సినిమాలోని 'పితా సే హై నామ్ తేరా' 'యారా దిల్ దారా' సినిమాలోని 'హమారా పప్పా ఔర్ హమ్'... ఆలియాభట్ 'రాజీ' సినిమాలోని 'దిల్‌బరో'... ఇలా ఎన్నో పాటలు ఉన్నాయి. ఇక తెలుగు పాటల విషయానికి వస్తే 'నాన్నా నీ మనసే వెన్నా' ఆల్‌టైమ్ ఫేవరెట్. జూనియర్ ఎన్టీఆర్ 'నాన్నకు ప్రేమతో...' పాట, చిరంజీవి 'డాడీ' సినిమాలోని 'గుమ్మాడి గుమ్మాడీ', విక్రమ్ 'నాన్న' సినిమాలో 'పప్పా పప్పా' కమల్‌హాసన్ 'ఇంద్రుడు-చంద్రుడు'లో 'లాలిజో లాలీజో చెప్పవే పాపాయి'... మొదలైన పాటలు 'ఫాదర్స్ డే' రోజు వినిపించే పాటలు.

తండ్రీ కూతుళ్ల బంధాన్ని ప్రతిబింబించే 'దంగల్' 'అంగ్రేజీ మీడియం' 'పికు' 'తప్పడ్'... మొదలైన బాలీవుడ్ సినిమాల గురించి కొందరు పోస్ట్‌లు పెట్టారు.

తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న అందాల కథానాయికలు శ్రద్ధా కపూర్, అనన్య పాండే, కరీనా కపూర్, ఆలియాభట్, సోనాక్షి సిన్హా, సోనాల్ కపూర్... మొదలైన వారి గురించి ప్రశంసాపూర్వకంగా రాశారు.

నాన్న అనిల్‌కపూర్‌తో...



నాన్న నాకు ప్రపంచంలోని అత్యంత విలువైన కానుక ఇచ్చాడు. ఆ కానుక పేరు... ప్రేమ.
- సోనాల్ కపూర్

నాన్న శతృఘ్నసిన్హాతో...




నువ్వు ఎంచుకున్న మార్గం, నువ్వు ఏర్పర్చుకున్న అభిప్రాయం సరియైనది అనిపిస్తే ఎప్పుడూ వెనకడుగు వేయ వద్దు... అని నాన్న చెప్పే మాట నాకు చాలా ఇష్టం.
- సోనాక్షి సిన్హా

నాన్న షారుఖ్‌తో...



స్కూల్లో డ్రాప్ చేసిన, పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడు మెచ్చుకున్న, సరదాగా నాతో ఆడుకున్న నాన్నతో నా ప్రతీ జ్ఞాపకం అపురూపం.
- సుహానా ఖాన్

నాన్న మహేశ్‌భట్‌తో...



మా నాన్న చాలా భిన్నంగా ఆలోచిస్తారు. వాటిని అర్థం చేసుకుంటే జీవితం లోతుపాతులు అర్థం అవుతాయి. జీవితంలో ఎలా ముందుకు వెళ్లాలి అనేది తెలుస్తుంది. పిల్లలను సినిమాలు, పార్క్‌లకు తీసుకెళ్లడమే తండ్రి బాధ్యత అని ఆయన అనుకోలేదు. చిన్న చిన్న మాటలతోనే గొప్ప విషయాలు చెప్పడం ఆయన ప్రత్యేకత.

'యూ మస్ట్ ఫెయిల్' అని ఏ తండ్రి అయినా అంటాడా? మా నాన్న అనేవాడు! ఒక్క ఫెయిల్యూర్ ఎన్ని పాఠాలు నేర్పుతుంది!!
- ఆలియా భట్

నాన్న చుంకీపాండేతో...



బాగా కష్టపడాలి. మంచి ఫలితాన్ని ఆశించాలి. ఓటమికి చేరువ అవుతున్నాను... అనే భయంలోనూ ధైర్యాన్ని కోల్పోవద్దు... అని నాన్న తరచు చెప్పేవారు.
- అనన్య పాండే



నాకు నచ్చిన ఇద్దరు పిల్లలు... మా నాన్న రణ్‌ధీర్‌కపూర్, మా అబ్బాయి జె అలీఖాన్!
- కరీనా కపూర్

నాన్నలాంటి అమ్మకు ప్రేమతో... తాజ్‌మహల్

చెన్నైకి చెందిన అమృద్దీన్ షేక్ దావూద్ తన తల్లి జ్ఞాపకార్థం తిరువూరుకు సమీపంలో కోట్లు వెచ్చించి మినీ తాజ్‌మహల్ నిర్మించాడు. ఈ నిర్మాణం కోసం రాజస్థాన్ నుంచి మార్బుల్స్ తెప్పించాడు. ఈ 'మినీ తాజ్‌మహల్' నిర్మాణానికి రెండు సంవత్సరాలు పట్టింది.

తండ్రి చనిపోయినప్పుడు అమృద్దీన్ వయసు 11 సంవత్సరాలు.





నలుగురు కూతుళ్లు, కొడుకుకు ఏ చిన్న కష్టం రాకుండా తానే తల్లీదండ్రీ అయింది అమ్మ.

తల్లి చనిపోయిన రోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు అమృద్దీన్.

ఈ మినీ తాజ్‌మహల్ ఇమేజ్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

'ఈ తాజ్‌మహల్‌లో అణువణువునా తల్లిపై ప్రేమ కనిపిస్తుంది' అంటూ నెటిజనులు స్పందించారు.

బీఎండబ్ల్యూ అంటే... బ్యూటీఫుల్ మంజు వారియర్!



అందాల కథానాయిక మంజు వారియర్‌కు బైక్ రైడింగ్ సాహసాలు అంటే ఇష్టం. తాజాగా ఒక అడవిలో తన బీఎండబ్ల్యూ బైక్ రైడింగ్‌కు సంబంధించిన ఫొటోలను 'యూ గాట్ ఇట్ గర్ల్' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయ్యాయి. సెలబ్రిటీ-నాన్ సెలబ్రిటీ అనే తేడా లేకుండా మంజు వారియర్‌ను ప్రశంసలతో ముంచెత్తారు.

'ఐరన్ గర్ల్ ఆఫ్ సౌత్ ఇండియా' 'వావ్ అమేజింగ్. కీప్ ఇట్ అప్'లాంటి ప్రశంసల మాట ఎలా ఉన్నా, కొద్దిమంది మాత్రం మంజూకు జాగ్రత్తలు కూడా చెప్పారు.

'నేను కూడా రైడర్‌ని. మీకు ఒక సలహా ఇవ్వాలనుకుంటున్నాను. ఫుల్‌ఫేస్ హెల్మెట్ ధరించండి' అని శ్రీరామ్‌గోపాలక్రిష్ణన్ అనే యూజర్ సలహా ఇచ్చారు. మరి కొందరు ఫారెస్ట్ ఏరియాలో ఎలాంటి రైడింగ్ బూట్స్ ధరించాలనే దాని గురించి చెప్పారు. బైక్ రైడింగ్‌లో మంజు వారియర్‌కు హీరో అజిత్ స్ఫూర్తి. ఆయనతో కలిసి బైక్ రైడింగ్ చేస్తుంటుంది.

127 గంటలు... డ్యాన్స్!

127 గంటల లాంగెస్ట్ డ్యాన్స్ మారథాన్‌తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లోకి ఎక్కింది మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాకు చెందిన సృష్టి జగ్‌తాప్. తన గిన్నిస్ లక్ష్యం కోసం ఎన్నో నెలలపాటు కష్టపడింది సృష్టి. రాత్రి పదికి పడుకొని తెల్లవారుజామున మూడుగంటలకే నిద్ర లేచేది. నాలుగు గంటలు ధ్యానం, ఆరు గంటల పాటు కథక్ నృత్యం సాధన చేసేది. మూడు గంటల పాటు రకరకాల వ్యాయామాలు చేసేది. నృత్యం ద్వారా ప్రపంచ వేదికపై భారతీయతను ప్రతిఫలించాలనేది తన కలగా చెబుతుంది సృష్టి.



హెల్త్

ఎవాస్క్యులార్ నెక్రోసిస్ అంటే?



మన దేహంలోని నడుము భాగంలో కటి ఎముకలో రెండు గిన్నెల (సాకెట్స్) వంటి ఖాళీ భాగాలుంటాయి. ఆ రెండింటిలో తొడ ఎముక చివరన బంతిలా గుండ్రంటి భాగం (బాల్) సరిగ్గా అమరి ఉంటుంది. ఈ బంతి వంటి భాగాన్ని 'ఫీమోరల్ హెడ్' అంటారు. గిన్నె వంటి భాగంలో బంతి అమరి ఉండటం వల్లనే దీన్ని బంతి గిన్నె కీలుగా చెబుతారు. ఈ నిర్మాణమూ, ఈ అమరికే మనల్ని నిలబెడుతుంది, నిటారుగా ఉంచుతుంది, కదిలేందుకు ఉపకరిస్తుంది. కొంతమందిలో తొడ ఎముక చివర్న ఉండే ఆ బంతి వంటి భాగానికి ఆహారం, పోషకాలు, ఆక్సిజన్ అందక చచ్చుబడినట్లుగా అవుతుంది. ఆ కండిషన్‌ను 'ఎవాస్క్యులార్ నెక్రోసిస్' అంటారు. అలా అయినప్పుడు దాన్ని చక్కదిద్దడానికి తుంటి ఎముక సర్జరీ చేయాల్సి వస్తుంది. భారత్‌లోని తుంటి ఎముక సర్జరీల్లో ఈ కారణంగా జరిగేవే చాలా ఎక్కువ. ఈ ఎవాస్క్యులార్ నెక్రోసిస్ గురించి అవగాహన కోసమే ఈ కథనం.

తొడ ఎముకలోని బంతి వంటి భాగం (ఫీమోరల్ హెడ్) చచ్చుబడిపోయిపోవడం వల్ల వచ్చే ఎవాస్క్యులార్ నెక్రోసిస్ కేసులు ఇటీవల ఎక్కువగా వస్తున్నాయి. ఇలా చచ్చుబడ్డాక తుంటి ఎముక కూడా క్రమంగా అరుగుతూ ఉంటుంది. గతంలో (ఇప్పటికీ) ఏ మూత్రపిండాల జబ్బుల కారణంగానో లేదా ఏ ఇతర ఆరోగ్య సమస్యల వల్లనో స్టెరాయిడ్స్ ఎక్కువగా వాడినప్పుడు ఎవాస్క్యులార్ నెక్రోసిస్‌కు దారితీయడానికి అవకాశాలు ఎక్కువ. అయితే ఇటీవల కోవిడ్-19 వచ్చినప్పుడు స్టెరాయిడ్స్‌తో చికిత్స చేయడం చాలా ముమ్మరంగా జరగడంతో 20 - 30 ఏళ్ల వారిలో సైతం ఈ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. వీళ్లలోనూ యువతులతో పోలిస్తే యువకులే ఎవాస్క్యులార్ నెక్రోసిస్‌కు ఎక్కువగా గురవుతున్నారు (యువకులు, యువతుల నిష్పత్తి 3 : 2గా ఉంది). ఈమధ్య ఈ కేసులు గతంతో పోలిస్తే ఐదు నుంచి పదింతలు ఎక్కువ కావడం ఆందోళన కలిగించే అంశం.

చికిత్స
ఎవాస్క్యులార్ నెక్రోసిస్ సమస్య స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3, స్టేజ్-4 అనే నాలుగు దశల్లో జరుగుతుంది. అంటే... ఫీమోరల్ హెడ్ అనే బంతి లాంటి నిర్మాణానికి ఏమేరకు రక్తసరఫరా, పోషకాలు, ఆక్సిజన్ తగ్గుతాయనే అంశాన్ని బట్టి ఎవాస్క్యులార్ నెక్రోసిస్ తీవ్రత, స్టేజ్ అనేవి ఆధారపడి ఉంటాయి.

ఎందుకు వస్తుందంటే...?

● ఏదైనా ప్రమాదంలోగానీ లేదా ఏదైనా కారణంతో తుంటి ఎముకకు గాయం కావడం. ఎసెటాబ్యులర్ ఫ్రాక్చర్ (అంటే బాల్ అండ్ సాకెట్ ప్రాంతంలోని స్కెలిటల్ స్ట్రక్చర్‌లో ఎక్కడైనా ఫ్రాక్చర్ కావడం) వంటి కారణాలతో ఫీమోరల్ హెడ్‌కు రక్తసరఫరా సరిగా జరగకపోవడం. ● ఇతర ఆరోగ్య సమస్యలను మాయం చేయడానికి స్టెరాయిడ్స్ వాడాల్సి రావడంతో... ఆ దుష్ప్రభావం ఫీమోరల్ హెడ్‌పై పడి, దానికి పోషకాలు, ఆక్సిజన్ ఆగిపోవడం. ● ముందుగా చెప్పుకున్నట్లు కోవిడ్ సమయంలో కొందరు రోగులను ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు స్టెరాయిడ్స్ ఎక్కువగా వాడాల్సి రావడం... రెండేళ్ల తర్వాత ఆ దుష్ప్రభావాలు ఈ రూపంలో ఇప్పుడు కనిపించడం. ● కొన్ని సందర్భాల్లో నిర్దిష్టంగా ఏ కారణమూ కనిపించకుండా కూడా ఈ పరిణామం చోటు చేసుకోవచ్చు.

చికిత్స స్టేజ్-1, స్టేజ్-2 లలో...

సాధారణంగా స్టేజ్-1, స్టేజ్-2 లలో ఫీమోరల్ హెడ్ కొంతవరకు నొక్కుకుపోయినట్లుగా కావడంతో దానికి మందులతోనే చికిత్స చేస్తారు. ఇలా ఫీమోరల్ హెడ్ నొక్కుకుపోవడంతో కొంతమంది బాధితుల్లో చాలా తీవ్రమైన నొప్పి, కదలలేకపోవడం, కుంటటం వంటివి జరుగుతుంటే తొలిదశలో 'కోర్ డికంప్రెషన్' అనే శస్త్రచికిత్స చేస్తారు. దీంతోపాటు దెబ్బతిన్న / నశించిపోయిన అక్కడి కణాలు తిరిగి పుట్టేందుకు స్టెమ్‌సెల్స్‌ను పంపించి చికిత్స అందిస్తారు. అయితే ఈ తరహా 'కోర్ డి-కంప్రెషన్' శస్త్రచికిత్స గానీ, స్టెమ్ సెల్ థెరపీగానీ అందరిలోనూ ఒకేలాంటి ఫలితాలు ఇవ్వదు. కేవలం 65% మాత్రమే సక్సెస్ రేటు ఉంటుంది. అందునా ఫీమోరల్ హెడ్ పూర్తిగా దెబ్బతినక ముందు మాత్రమే ఈ 'కోర్ డి-కంప్రెషన్' శస్త్రచికిత్స సాధ్యమవుతుంది.

లక్షణాలు...

● తుంటి ఎముక ప్రాంతంలో, గజ్జెల్లో నొప్పి రావడం. ● తుంటి ప్రాంతంలో తీవ్రమైన నొప్పితో నడకకష్టం కావడం. ● కొన్ని సందర్భాల్లో కనీసం నిలబడలేకపోవడం లేదా ఏమాత్రం కదల్లేకపోవడం. ● ఎక్కువ సేపు కూర్చుని, ఆ తర్వాత నిలబడ్డప్పుడు కీళ్లు స్టిఫ్‌గా అయినట్లు అనిపించడం. ● నడిచే సామర్థ్యం క్రమక్రమంగా తగ్గిపోతుండటం.... ఎక్కువ దూరం నడవలేక కుంటుతున్నట్లుగా నడవడం. ● వ్యాధి బాగా ముదిరాక... పై కారణాలతో బాధితులు తమ రోజువారీ పనులు కూడా చేసుకోలేకపోవడం.



చికిత్స స్టేజ్-3, స్టేజ్-4 లలో...

స్టేజ్-3, స్టేజ్-4 స్థాయి బాధితుల్లో సమస్య తీవ్రత చాలా ఎక్కువగా ఉండటం, ఫీమోరల్ హెడ్ అనే ఆ బాల్ పూర్తిగా దెబ్బతినడంతో 'హిప్ రీప్లేస్‌మెంట్' అనే తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స అవసరమవుతుంది. పైగా ఆ దశలో ఆ శస్త్రచికిత్స తప్పక అవసరం. ఒకవేళ సరైన సమయంలో చికిత్స జరగకపోతే అది ఆ తర్వాత 'ఆస్టియో ఆర్థరైటిస్' అనే ఎముకల తీవ్రమైన అరుగుదల, అవి బోలుగా మారిపోవడం వంటి కండిషన్స్ ఏర్పడతాయి. నిజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో 20, 30 ఏళ్ల యువత 'ఎవాస్క్యులార్ నెక్రోసిస్' బారిన పడుతున్న తరుణంలో, ఈ వయసువాళ్లను కదల్లేకుండా ఒకే చోట కుదురుగా ఉంచే పరిస్థితులు ఉండవు. అది సరికాదు కూడా. ఇప్పుడు అందుబాటులో ఉన్న సాంకేతికత, తుంటి ఎముక మార్పిడికి దోహదపడేందుకు వాడే సిరామిక్, పాలీ సిరామిక్ వంటి నాణ్యమైన పదార్థాలు, రోబోటిక్ సర్జరీ వంటి ప్రక్రియల వల్ల ఈ యువత బాగా కోలుకునేలా చేసే అవకాశాలున్నాయి. ఎవాస్క్యులార్ నెక్రోసిస్ రాకమునుపు ఉన్న పరిస్థితే పునరావృతమయ్యేలా, నొప్పి ఏమాత్రం లేకుండా పూర్తిగా బాసిపట్లు వేసుకుని కూర్చునేలా చేయగలగడం ఇప్పుడు సాధ్యమే. అయితే లక్షణాలు కనిపించగానే, ముందు దశల్లోనే డాక్టర్‌ను సంప్రదించడం అవసరం.

నిర్ధారణ
ఎవాస్క్యులార్ నెక్రోసిస్‌కు సంబంధించిన లక్షణాలు కనిపించినప్పుడు... వారికి ఎక్స్-రే, ఎమ్మారై స్కాన్ పరీక్షలు చేసి, ఎవాస్క్యులార్ నెక్రోసిస్‌ను నిర్ధారణ చేస్తారు.

నివారణ

నిజానికి దీనికి నివారణ అంటూ లేదు. ఎందుకంటే ఫీమోరల్ హెడ్‌గా పేర్కొనే ఆ బాల్ వంటి ప్రాంతానికి రక్తప్రసరణలో అంతరాయం కలగడం లేదా ఆగిపోయాక మాత్రమే లక్షణాలు బయటపడతాయి. అందుకే ముందుగా నివారణ అన్నది సాధ్యం కాదు. అయితే స్టెరాయిడ్స్ ఎక్కువగా తీసుకునేవారిలో ఇది కనిపిస్తుందన్న అంశాన్ని బట్టి... ఈ విషయంలో కాస్త నియంత్రణ పాటిస్తే నివారణకు కొంతవరకు అవకాశం ఉంటుంది. ఉదాహరణకు... స్టెరాయిడ్స్ తీసుకునే బాధితులు రోజుకు 20 మి.గ్రా. నుంచి 30 మి.గ్రా. వాడేవారూ, అలాగే చాలాకాలం పాటు స్టెరాయిడ్స్ తీసుకోవాల్సిన అవసరం ఉన్నవారు తమ ఫిజీషియన్‌ను సంప్రదించి, ముమ్ముందు తమకు హానికరం కాని మోతాదుల్లో మాత్రమే స్టెరాయిడ్స్ తీసుకునేలా జాగ్రత్త వహించవచ్చు.



డాక్టర్ కృష్ణ కిరణ్
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

ప్యాంక్రియాటైటిస్ వస్తే?

దేహంలోని జీవక్రియల్లో ప్యాంక్రియాస్ (క్లోమ గ్రంథి)ది కీలక పాత్ర. దీని నుంచి అవసరమైనప్పుడు రక్తంలోని గ్లూకోజ్ నుంచి శక్తిని తీసుకుని వినియోగించుకునేలా, అలాగే అవసరం లేనప్పుడు అదే మళ్లీ అదే గ్లూకోజ్‌ను రక్తం నుంచి తొలగించి, కాలేయంలో భద్రపరచుకునేలా హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. అవసరమైనప్పుడు శక్తిని తీసుకునేందుకు గ్లూకగాన్, అవసరం లేనప్పుడు మళ్లీ నిల్వ చేసుకునేందుకు ఇన్సులిన్ అనే హార్మోన్లను ఈ ప్యాంక్రియాస్ గ్రంథి ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇన్సులిన్ లోపం వల్లనే డయాబెటిస్ వస్తుందన్న సంగతి తెలిసిందే. ఇది సొమాటోస్టాటిన్ అనే హార్మోన్‌ను కూడా ఉత్పత్తి చేస్తుంది. ప్యాంక్రియాస్ గ్రంథి నుంచి ఓ చిన్న గొట్టం ద్వారా జీర్ణప్రక్రియకు అవసరమైన క్లోమ రసం కూడా వచ్చి చిన్నపేగుల దగ్గర కలుస్తుంది.

ఏవైనా కారణాల వల్ల ఈ క్లోమరసం తాలూకు స్రావాల్లోని ప్రొటీన్లు ఉండల్లాగా మారి, క్లోమరసాన్ని తీసుకెళ్లే గొట్టానికి అడ్డుపడ్డప్పుడు ప్యాంక్రియాస్ గ్రంథికి ఇన్ఫెక్షన్ రావచ్చు. కొన్నిసార్లు ప్యాంక్రియాస్ గ్రంథిలోనే రాళ్లలా ఏర్పడవచ్చు. ఇలా జరగడాన్ని 'ప్యాంక్రియాటైటిస్' అంటారు. నిజానికి ఇది అంత ప్రాణాంతకం కానప్పటికీ, కొందరిలో మాత్రం తీవ్రమైన నొప్పి కలిగిస్తుంది. అలాంటి సందర్భాల్లో మాత్రమే దీనికి చికిత్స అవసరమవుతుంది.

లక్షణాలు : ▸ తిన్నది జీర్ణం కాకపోవడం ▸ ఏదైనా తిన్నవెంటనే కడుపులో తీవ్రమైన మంట, నొప్పి ▸ స్వల్పంగా జ్వరం ▸ పొట్టభాగం ఎడమ వైపున పైభాగంలో లేదా మధ్య భాగంలో నొప్పి మొదలై కొన్ని సందర్భాల్లో అది వీపుకు వైపునకు పాకుతుండటం ▸ కామెర్లు ▸ పొట్ట ఉబ్బరం ▸ వాంతి అవుతున్నట్లు అనిపిస్తుండం (వికారం) ▸ కొందరిలో విరేచనాలు కావడం ▸ కడుపుపైన తాకితే భరించలేనంత బాధ (టెండర్‌నెస్) ▸ కొందరిలో కళ్లు తిరుగుతున్నట్లుగా అనిపించడం... వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే కొందరిలో ఎలాంటి లక్షణాలూ ఉండవు.



కారణాలు : ఏ కారణం లేకుండానే పాంక్రియాస్‌లో రాళ్ల వంటివి రావడం జరుగుతుంది. అయితే కొందరిలో మితిమీరిన మద్యపానం చాలావరకు పాంక్రియాటైటిస్‌కు కారణమవుతుంది.

నిర్ధారణ పరీక్షలు : బాధితులకు కొన్ని రక్తపరీక్షలు, సీరమ్ లైపేజ్ పరీక్షలు, సీటీ స్కాన్ లేదా ఎమ్మారై స్కాన్, ఎండోస్కోపిక్ అల్ట్రా సౌండ్, ప్యాంక్రియాటిక్ ఫంక్షన్ టెస్ట్ వంటి పరీక్షలు చేసి, పాంక్రియాస్ నుంచి వచ్చే నాళం ఎంత దెబ్బతిన్నదీ, ఆ గ్రంథి ఏ మేరకు ఉబ్బి ఉంది అన్న విషయాలు తెలుసుకుని చికిత్స ప్రారంభిస్తారు.

చికిత్స : పాంక్రియాటైటిస్ తీవ్రత చాలా తక్కువగా ఉంటే కొన్ని రకాల మందులతో దాన్ని తగ్గించడానికి డాక్టర్లు ప్రయత్నిస్తారు. మందులతో తగ్గనప్పుడు తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఉంటుంది. ఇటీవల ల్యాపరోస్కోపిక్ / కీహోల్ శస్త్రచికిత్సలతో కడుపుపై కత్తితో కోయకుండానే, చిన్నపాటి గాట్లతోనే శస్త్రచికిత్స చేసి, ప్యాంక్రియాస్ గ్రంథిలోని దెబ్బతిన్న ప్రాంతాన్ని తొలగించే అవకాశం ఉంది. దీనివల్ల హాస్పిటల్‌లో ఉండాల్సిన సమయం, ఇతర ఇన్ఫెక్షన్లు, సర్జరీ తర్వాత వచ్చే దుష్పరిణామాలు బాగా తగ్గిపోతాయి.



డా. వి. పవన్ కుమార్
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

మెడి టిప్

మెడ పట్టేసినప్పుడు... త్వరగా నార్మల్ కావాలంటే?

నిద్రలో మెడపట్టేయడం చాలామందికి అనుభవంలోకి వచ్చే విషయమే. అలాగే ప్రయాణాల్లో మెడను అసహజ భంగిమలో ఉంచి వాహనాల్లో నిద్రపోయేవారిలో కూడా ఇది కనిపిస్తుంది. మెడ పట్టేయడాన్ని ఇంగ్లిష్‌లో రై నెక్ అంటారు. మెడపట్టేసినప్పుడు ఆ పరిస్థితి త్వరగా నార్మల్ అయ్యేందుకు పాటించాల్సిన సూచనలివి...



✦ నిద్రలో చాలా పలచటి తలగడను వాడుతూ దాన్ని మెడ భాగంలోనే కాకుండా... భుజాల వరకు సపోర్ట్‌గా ఉంచాలి. తలగడకు బదులుగా మెత్తటి టర్కీ టవల్‌నూ గుండ్రంగా చుట్టి (రోల్ చేసి) మెడ కింద సపోర్ట్‌గా ఉంచవచ్చు. ✦ మెడ మీద భారం పడేలా ఎక్కువ బరువున్న వాటిని అకస్మాత్తుగా ఎత్తకూడదు. ఇలా చేయడం వల్ల నొప్పి ఇంకా పెరుగుతుంది. ✦ కొందరు సెలూన్స్‌లో మెడను రెండువైపులా విరిచేసినట్లుగా టక్కున తిరిగేలా చేస్తుంటారు. ఇలా ఎంతమాత్రమూ చేయకూడదు. ✦ నొప్పి మరీ ఎక్కువగా ఉంటే ప్రమాదకరం కాని నొప్పినివారణ మందును రెండు రోజుల పాటు వాడవచ్చు. అప్పటికీ తగ్గకపోతే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించాలి.



పోరాడి ఓడిన బోపన్న-ఎబ్డెన్ జోడీ

బాస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పోరాటం ముగిసింది. జర్మనీలోని స్టుట్‌గార్ట్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (6/8), 7-6 (14/12), 4-10తో 'సూపర్ టైబ్రేక్'లో కెవిన్ క్రావిట్జ్-టిమ్ ప్యుయెట్జ్ (జర్మనీ) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటా 52 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో బోపన్న-ఎబ్డెన్ జంట 15 ఏస్‌లు సంధించింది. తొలి రెండు సెట్‌లలో రెండు జోడీలు తమ సర్వీస్‌లను కాపాడుకున్నాయి. నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం జర్మనీ ద్వయం పైచేయి సాధించింది. సెమీస్‌లో ఓడిన బోపన్న-ఎబ్డెన్‌లకు 11,910 యూరోల (రూ. 10 లక్షల 69 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

తెలుగు టాలన్స్ జోరు



జైపూర్: ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్)లో హైదరాబాద్‌కు చెందిన తెలుగు టాలన్స్ జట్టు అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తెలుగు టాలన్స్ 33-22 పాయింట్ల తేడాతో రాజస్తాన్ పేట్రియాట్స్ జట్టును ఓడించింది. కైలాష్ పటేల్ ఏడు గోల్స్ చేయగా... దవిందర్ భుల్లర్ ఐదు గోల్స్ సాధించి తెలుగు టాలన్స్ విజయంలో కీలకపాత్ర పోషించారు. దవిందర్‌కు 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డు దక్కించుకున్నాడు. కంకణాల అభిషేక్ రెడ్డి యజమానిగా ఉన్న తెలుగు టాలన్స్ జట్టుకిది ఐదో విజయం కావడం విశేషం. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో ఏడు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తెలుగు టాలన్స్ పది పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో మహారాష్ట్ర ఐరన్‌మెన్ 33-32తో గర్విత్ గుజరాత్ జట్టును ఓడించి 12 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

సెమీస్‌లో భారత్ 'ఎ'

హాంకాంగ్: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 మహిళల టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత 'ఎ' జట్టు సెమీఫైనల్ చేరింది. భారీ వర్షం కారణంగా భారత్ 'ఎ', పాకిస్తాన్ 'ఎ' జట్ల మధ్య శనివారం జరగాల్సిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్ రద్దయింది. దాంతో రెండు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు. లీగ్ మ్యాచ్‌లు ముగిశాక భారత్, పాక్ జట్లు నాలుగు పాయింట్లతో గ్రూప్ 'ఎ' నుంచి సెమీఫైనల్‌కు చేరాయి. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లకు సెమీఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. సోమవారం జరిగే సెమీఫైనల్స్‌లో శ్రీలంకతో భారత్; బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ తలపడతాయి.

ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో... ఆసియా చాంపియన్‌షిప్‌లో... కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించి తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మరో అతి గొప్ప టైటిల్‌కు విజయం దూరంలో నిలిచింది. ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. వరల్డ్ టూర్ సూపర్-1000 స్థాయి టోర్నీలో ఈ జంట టైటిల్ పోరుకు అర్హత సాధించడం ఇదే తొలిసారి.



చిరాగ్, సాత్విక్ విజయ సంబరం

- టైటిల్‌కు విజయం దూరంలో భారత ద్వయం
- సెమీస్‌లో కొరియా జంటపై అద్భుత విజయం
- సింగిల్స్‌లో ముగిసిన ప్రణయ్ పోరు

జకార్తా: అంచనాలకు మించి రాణిస్తూ భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఇండోనేసియా ఓపెన్ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 67 నిమిషాల్లో 17-21, 21-19, 21-18తో మిన్ హిక్ కాంగ్-సియో సెంగ్ జె (దక్షిణ కొరియా) జంటను ఓడించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టి వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. నేడు జరిగే ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా) జోడీతో సాత్విక్-చిరాగ్ ద్వయం తలపడుతుంది. అయితే ఇప్పటి వరకు ఆరోన్ చియా-సో వుయ్ యిక్‌లతో ఎనిమిదిసార్లు తలపడిన సాత్విక్-చిరాగ్ జంట ఒక్కసారి కూడా గెలవలేదు. తొమ్మిదో ప్రయత్నంలోనైనా సాత్విక్-చిరాగ్ విజయం సాధిస్తారో లేదో వేచి చూడాలి.



ప్రణయ్

భారత కాలమానం ప్రకారం సాత్విక్-చిరాగ్ జోడీ ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలయ్యే అవకాశముంది. ఫైనల్ మ్యాచ్‌లన్నీ స్పోర్ట్స్-18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ పోరాటం ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో జరిగిన సెమీఫైనల్లో ప్రణయ్ 15-21, 15-21తో ఓడిపోయాడు. సెమీఫైనల్లో నిష్క్రమించిన ప్రణయ్‌కు 17,500 డాలర్ల (రూ. 14 లక్షల 33 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 8400 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

8 బీడబ్ల్యూఎఫ్ టూర్ టోర్నీలలో సాత్విక్-చిరాగ్ జోడీ ఫైనల్ చేరడం ఇది ఎనిమిదోసారి. ఐదు టోర్నీలలో నెగ్గిన సాత్విక్-చిరాగ్ రెండు టోర్నీలలో రన్నరప్‌గా నిలిచారు.

ఈ సీజన్‌లో గొప్ప ఫామ్‌లో ఉన్న సాత్విక్-చిరాగ్ మరోసారి మెరిశారు. కొరియా జోడీపై గతంలో రెండుసార్లు నెగ్గిన సాత్విక్-చిరాగ్‌కు ఈసారి గట్టిపోటీ లభించింది. తొలి గేమ్‌ను కోల్పోయిన భారత జంట రెండో గేమ్‌లో నెమ్మదిగా తేరుకుంది. ఆరంభంలోనే 4-0తో ముందంజ వేసి ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని నిలబెట్టుకొని గేమ్‌ను దక్కించుకుంది. నిర్ణాయక మూడో గేమ్‌లో ఆరంభంలో రెండు జోడీలు ప్రతి పాయింట్‌కు హోరాహోరీగా పోరాడాయి. స్కోరు 5-5తో సమంగా ఉన్నపుడు సాత్విక్-చిరాగ్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఏడు పాయింట్లు గెలిచి 12-5తో ఆధిక్యంలోకి వచ్చింది. అయితే కొరియా జంట పట్టుదలతో ఆడి స్కోరును 16-16 వద్ద సమం చేసింది. ఈ దశలో సాత్విక్-చిరాగ్ సంయమనం కోల్పోకుండా ఆడి వరుసగా మూడు పాయింట్లు నెగ్గి 19-16తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత రెండు పాయింట్లు కోల్పోయిన భారత జోడీ వెంటనే రెండు పాయింట్లు నెగ్గి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

జ్యోతికి రెండో స్వర్ణం

100 మీటర్ల హర్డిల్స్‌లోనూ విజేత



భువనేశ్వర్: జాతీయ సీనియర్ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ రెండో స్వర్ణ పతకంతో మెరిసింది. శుక్రవారం 100 మీటర్ల విభాగంలో బంగారు పతకం నెగ్గిన జ్యోతి... శనివారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ రేసులోనూ విజేతగా నిలిచి తన ఖాతాలో రెండో పసిడి పతకాన్ని జమ చేసుకుంది. విశాఖపట్నం జిల్లాకు చెందిన 23 ఏళ్ల జ్యోతి అందరికంటే వేగంగా 12.92 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. తెలంగాణ అమ్మాయి అగసార నందిని (13.55 సెకన్లు) కాంస్య పతకాన్ని గెల్చుకుంది. మహిళల 4×100 మీటర్ల రిలే ఫైనల్లో జ్యోతి యర్రాజీ, భగవతి భవాని యాదవ్, బొడ్డిపల్లి దుర్గా, చెలిమి ప్రత్యూషలతో కూడిన ఆంధ్రప్రదేశ్ బృందం (46.61 సెకన్లు) రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన అగసార నందిని 5703 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఆసియా క్రీడల అర్హత ప్రమాణాన్ని (5654 పాయింట్లు) కూడా అధిగమించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సౌమ్య మురుగస్ (5323 పాయింట్లు) కాంస్యం సాధించింది.

ఖ్వాజా సెంచరీ: ఆస్ట్రేలియా 311/5

ఇంగ్లండ్‌తో 'యాషెస్' తొలి టెస్టు



బర్మింగ్‌హామ్: ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా (279 బంతుల్లో 126 బ్యాటింగ్; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) మొండి పట్టుదలతో ఆడటంతో... ఇంగ్లండ్‌తో జరుగుతున్న యాషెస్ సిరీస్ తొలి టెస్టులో ఆస్ట్రేలియా కోలుకుంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 94 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 311 పరుగులు సాధించింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు (393/8 డిక్లేర్డ్)కు ఆస్ట్రేలియా మరో 82 పరుగుల దూరంలో ఉంది. ఖ్వాజాతో కలిసి అలెక్స్ క్యారీ (80 బంతుల్లో 52 బ్యాటింగ్; 7 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 14/0తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియాను ఇంగ్లండ్ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ దెబ్బ కొట్టాడు. ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో తొలి రెండు బంతుల్లో డేవిడ్ వార్నర్ (27 బంతుల్లో 9; 2 ఫోర్లు), లబుషేన్ (0)లను బ్రాడ్ అవుట్ చేశాడు. కాసేపటికి స్టీవ్ స్మిత్ (59 బంతుల్లో 16) కూడా పెవిలియన్ చేరడంతో ఆస్ట్రేలియా 67 పరుగులకే మూడు వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడింది. ఈ దశలో ట్రావిస్ హెడ్ (63 బంతుల్లో 50; 8 ఫోర్లు, 1 సిక్స్)తో ఖ్వాజా నాలుగో వికెట్‌కు 81 పరుగులు... గ్రీన్ (68 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్)తో ఐదో వికెట్‌కు 72 పరుగులు జత చేసి ఆదుకున్నాడు. గ్రీన్ అవుటయ్యాక వచ్చిన క్యారీ ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. ఖ్వాజాతో ఆరో వికెట్‌కు అజేయంగా 91 పరుగులు జోడించాడు.

546 పరుగుల తేడాతో...

బంగ్లాదేశ్ భారీ విజయం

మిర్పూర్: ఆద్యంతం ఆధిపత్యం కనబరిచిన బంగ్లాదేశ్ జట్టు తమ టెస్టు క్రికెట్ చరిత్రలోనే అతి పెద్ద విజయాన్ని నమోదు చేసింది. అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో లిటన్ దాస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ఏకంగా 546 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది. 662 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ 33 ఓవర్లలో 115 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 45/2తో ఆట నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్గానిస్తాన్ మరో 70 పరుగులు జోడించి మిగతా ఎనిమిది వికెట్లను కోల్పోయింది. బంగ్లాదేశ్ బౌలర్లు తస్కిన్ అహ్మద్ (4/37), షోరిఫుల్ ఇస్లాం (3/28) అఫ్గానిస్తాన్‌ను దెబ్బ తీశారు. రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు చేసిన బంగ్లాదేశ్ బ్యాటర్ నజ్ముల్ హుస్సేన్ షాంతో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్నాడు. మొత్తం టెస్టు క్రికెట్ చరిత్రలో పరుగుల తేడా పరంగా బంగ్లాదేశ్‌ది మూడో అతి పెద్ద విజయం కావడం విశేషం. ఈ జాబితాలో ఇంగ్లండ్ (1928లో ఆస్ట్రేలియాపై 675 పరుగుల తేడాతో గెలుపు), ఆస్ట్రేలియా (1934లో ఇంగ్లండ్‌పై 562 పరుగుల తేడాతో గెలుపు) జట్లు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.





జింబాబ్వేలో నేటి నుంచి వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీ జరగనుంది. 2 బెర్త్‌ల కోసం 10 జట్లు (వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఐర్లాండ్, నేపాల్, స్కాట్లాండ్, నెదర్లాండ్స్, అమెరికా, ఒమన్, యూఏఈ) బరిలో ఉన్నాయి.

సినిమా

- ఫాదర్స్ డే స్పెషల్



- తండ్రి కమల్‌హాసన్‌తో శ్రుతి

'మా నాన్న నా బెస్ట్ హ్యూమన్' అన్నారు శ్రుతీహాసన్. 'మా నాన్న నా బలం' అంటున్నారు పాయల్ రాజ్‌పుత్. 'ఫాదర్స్ డే' సందర్భంగా తండ్రి కమల్‌హాసన్ గురించి శ్రుతి, తండ్రి విమల్‌కుమార్ రాజ్‌పుత్ గురించి పాయల్ చెప్పిన విశేషాలు ఈ విధంగా...



- తండ్రి విమల్‌కుమార్‌తో పాయల్

మంచి తండ్రులందరికీ శుభాకాంక్షలు

\- శ్రుతీహాసన్

- మా చైల్డ్‌హుడ్ చాలా కంఫర్టబుల్. నాన్నగారు నన్ను, చెల్లి (అక్షరా హాసన్)ని చెన్నైలో మంచి ప్రైవేట్ స్కూల్లో చదివించారు. ఆ తర్వాత అమెరికాలో బెస్ట్ కాలేజీలో చేర్చారు. మంచి ఫుడ్, మంచి బట్టలు, ఖరీదు గల కార్లు, మంచి ఇల్లు... ది బెస్ట్ ఇచ్చారు. 21ఏళ్లకే నేను హీరోయిన్ అయి, సంపాదించడం మొదలుపెట్టాను. నిజానికి నాన్న చాలా స్వేచ్ఛ ఇస్తారు. ఆయనతో ఏ విషయాన్నయినా చెప్పుకునేంత స్వేచ్ఛ మాకుంది. తండ్రి మీద ప్రేమతో పాటు చాలా గౌరవం కూడా ఉంటుంది కాబట్టి... ఆ గౌరవంతో మాకు మేముగా కొన్ని హద్దులు పెట్టుకుంటాం. మన నాన్న మనకు బెస్ట్ ఫ్రెండ్ అయినప్పుడు ఆ కూతురికి అంతకన్నా కావాల్సినది ఏముంటుంది? ఆయన కేవలం తండ్రి మాత్రమే కాదు.. నా ఫేవరెట్ హ్యూమన్ కూడా.
- ఎవరి దగ్గరైతే జీవితం గురించి చాలా విషయాలు నేర్చుకుంటామో, ఎవరైతే మనల్ని బాగా నవ్విస్తారో ఆ వ్యక్తే మన తండ్రి అయితే ఇక అదే పెద్ద ఆశీర్వాదం. అలాంటి ఆశీర్వాదం దక్కినందుకు నాకు ఆనందంగా ఉంది. ఎప్పటికీ నాకు 'డియరస్ట్ డాడ్'గా ఉంటున్నందుకు మా నాన్నకి థ్యాంక్స్. 'హ్యాపీ ఫాదర్స్ డే'.
- బర్త్ డే, ఫాదర్స్ డే.. అంటూ ముందుగా ప్లాన్ చేసుకుని మా ఇంట్లో ప్రత్యేకంగా సెలబ్రేట్ చేయం. సో.. ఎప్పటిలానే ఈ ఏడాది కూడా మా నాన్నకు శుభాకాంక్షలు చెబుతాను. మా నాన్నగారు సాధించిన విజయాలకు నేనెప్పటికీ గర్వపడుతుంటాను. ఇప్పటికీ ఆయన అదే ఎనర్జీతో కొనసాగుతున్నారు. ప్రొఫెషన్ అంటే అదే ప్యాషన్. ఒక మంచి ఉదాహరణగా నిలుస్తున్నారు. మా నాన్న పరంగా నేను గర్వించే విషయాల్లో ఇవి. జీవితం పట్ల ఆయనకు ఉన్న ప్యాషన్ నాకే కాదు... నాలాంటివారికెందరికో స్ఫూర్తి. మా నాన్నలా తమ ఇళ్లలో సమానత్వాన్ని పాటిస్తూ, ప్రోత్సహిస్తున్న గుడ్ ఫాదర్స్ అందరికీ ఈ ఫాదర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు.

మా నాన్న నా బలం

\- పాయల్ రాజ్‌పుత్

- తండ్రీకూతుళ్ల అనుబంధం అపురూపమైనది.. మాటల్లో వర్ణించలేనిది. నాన్నతో ఉన్న ప్రతి మూమెంట్ నాకు స్పెషలే. అర్ధరాత్రివరకూ సాగే కబుర్లు, సరదా ఆటలు, చిన్నపాటి సాహసాలు వంటివి తండ్రీకూతుళ్ల అనుబంధాలను చాలా స్పెషల్‌గా మార్చుతాయి. మా లైఫ్‌లో అలాంటి ప్రత్యేక సమయాలు చాలా ఉన్నాయి. మా నాన్నగారే నా బలం. నా బెస్ట్ ఫ్రెండ్ కూడా ఆయనే.
- జీవితం అంటే ఏంటో మా నాన్న నాకు నేర్పించారు. అలాగే మనతో మనం నిజాయతీగా ఉండటం ఎంత ముఖ్యమో చెప్పారు. ప్రతి ఒక్కరి జీవితం ఒక్కో డైరెక్షన్‌లో వెళుతుంది. తండ్రీ కూతురి జీవితం కూడా అంతే. మా లైఫ్ వెళ్లే డైరెక్షన్ ఏదైనా మా బంధం ఎప్పటికీ అలానే ఉంటుంది. అది 'అన్‌బ్రేకబుల్'.
- చాలా విషయాల్లో మా నాన్న నాకు స్ఫూర్తిగా ఉంటారు. ముఖ్యంగా క్లిష్టమైన పరిస్థితులను ధైర్యంగా, సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి? వాటి నుంచి తిరిగి ఎలా పుంజుకోవాలి? అనే విషయాలు మాత్రం నాన్న నుంచే నేర్చుకున్నాను. అలాగే తోటివారితో ఎలా మసులుకోవాలో కూడా ఆయన్ను చూసే తెలుసుకున్నాను. హార్డ్‌వర్క్ చేసేవారికి ఉండే విలువ ఏంటో నాన్న నాకు చెప్పారు. అలాగే మనం నమ్మిన విషయానికి కట్టుబడి ఉండటం ఎంత ముఖ్యమో చెప్పారు. నా కలల విషయంలో రాజీ పడకుండా నన్ను నేను ఓ బెటర్ పర్సన్‌గా తీర్చిదిద్దుకోవడానికి మా నాన్నగారి మాటలు, ఆచరణ విధానాలే నాకు దోహదపడ్డాయి.
- మా నాన్న చాలా ట్రెడిషనల్. నేను యాక్టింగ్‌ని కెరీర్‌గా ఎంచుకున్నా.. నటనపై నాకు ఉన్న ప్యాషన్‌ను, సినిమా ఇండస్ట్రీ పంథాను అర్థం చేసుకున్నాక నన్ను సపోర్ట్ చేయడం మొదలుపెట్టారు. వృత్తిపరంగా నిరూపించుకునే విషయంలో అసలు ఏ మాత్రం తగ్గొద్దు అని అంటుంటారు. అంతేకాదు..కొన్ని సూచనలు, సలహాలు కూడా ఇస్తున్నారు. నిజానికి మా నాన్న ఒకప్పుడు యాక్టర్ కావాలనుకున్నారు. అయితే కుదరలేదు. ఇప్పుడు ఆయన కలను నేను నిజం చేసినందుకు గర్వంగా ఉంది.
- ఓ నటిగా నా కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నప్పుడు మా నాన్న నాతో మరింత ఆప్యాయంగా మాట్లాడతారు. 'నీ ప్రయాణంలో జయాపజయాలు ఓ భాగం మాత్రమే. వైఫల్యాలు ఎదురైతే వాటిని మైండ్‌కు ఎక్కించుకోకు. ఏదైనా తాత్కాలికమే. ఏదీ శాశ్వతం కాదు. సో.. జీవితం ఎలా వస్తే అలా ఉండు.. హ్యాపీగా ఉండు' అంటారు.

స్పై వస్తున్నాడు



- 'స్పై' పోస్టర్

నిఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'స్పై'. కె. రాజశేఖర్ రెడ్డి కథ అందించి, నిర్మించిన చిత్రం ఇది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వర్తించారు గ్యారీ బీహెచ్. స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ మరణానికి సంబంధించిన అంశాల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించినట్లు చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ''భారతదేశ అత్యుత్తమమైన రహస్య కథగా 'స్పై' మూవీ ఉంటుంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, కన్నడ భాషలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను జూన్ 29న విడుదల చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఐశ్వర్యా మీనన్ హీరోయిన్‌గా, ఆర్యన్ రాజేష్ ఓ ముఖ్య పాత్రలో నటించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్.

తిరగబడరా...



- రాజ్ తరుణ్ మాల్వీ

రాజ్ తరుణ్ హీరోగా, మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా కథానాయికలుగా నటిస్తున్న చిత్రం 'తిరగబడరా సామీ'. ఎస్. రవికుమార్ చౌదరి దర్శకత్వంలో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్‌పై మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ వీవీ వినాయక్ విడుదల చేసి, సినిమా మంచి విజయం సాధించాలని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జేబీ, కెమెరా: జవహర్ రెడ్డి.

ఆమె నమ్మింది



- హెబ్బా పటేల్

సుమన్ వూటుకూరు హీరోగా, హీరోయిన్ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటించిన లవ్ అండ్ ఎంగేజింగ్ థ్రిల్లర్ 'సందేహం'. 'షి బిలీవ్' (ఆమె నమ్మింది) అనేది ట్యాగ్ లైన్. సతీష్ పరమవేద దర్శకత్వంలో పర్చా సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఓ డిఫరెంట్ పాత్రలో హెబ్బా పటేల్ కనిపిస్తారు. ఈ చిత్రంలో ఆమె పాత్ర ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, కెమెరా: ప్రవీణ్ వనమాలి.

ఓ యువకుడి పోరాటం



- శ్రీ సింహా

అనుకున్నది సాధించడానికి ఓ యువకుడు ఎలాంటి సాహసాలు చేశాడు? అతను ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అనే అంశాల నేపథ్యంలో తెరకెక్కిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'భాగ్ సాలే'. శ్రీ సింహా కోడూరి, నేహా సోలంకి జంటగా అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించారు. ఈ సినిమాను జూలై 7న విడుదల చేయనున్నట్లు శనివారం యూనిట్ వెల్లడించింది. ''లక్ష్యాన్ని సాధించాలనుకునే ఒక యువకుడి పాత్ర చుట్టూ తిరిగే ఈ కథ ఆద్యంతం థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, కెమెరా: రమేష్ కుషేందర్.

ప్రేమ.. వినోదం



- సదన్, రేఖ

సదన్, దీపికా రెడ్డి, రేఖ నిరోషి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భారీ తారాగణం'. శేఖర్ ముత్యాల దర్శకత్వంలో బీవీ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ మాట్లాడుతూ- ''సినిమాపై నమ్మకంతో విడుదలకు నెల రోజుల ముందే డిస్ట్రిబ్యూటర్స్‌కు షో వేస్తే పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. కథ బాగా రావడంతో పీవీఆర్ ఉదయ్‌గారు విడుదల చేయడానికి ముందుకు వచ్చారు'' అన్నారు. ''లవ్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ఇది. చిన్న సినిమాలను ఆదరిస్తే ఇంకా మంచి చిత్రాలు వస్తాయి'' అన్నారు బీవీరెడ్డి. 'అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు సదన్, దీపికా రెడ్డి, రేఖ.

ఉద్యమ కెరటాలు



- చందు

తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో స్వీయదర్శకత్వంలో పిడమర్తి రవీంద్ర రూపొందించనున్న చిత్రం 'ఉద్యమ కెరటాలు'. చందు హీరోగా నటించనున్న ఈ చిత్రం షూటింగ్ ఈ నెల 27న ఆరంభం కానుంది. ''ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపించిన పెద్దలు కేసీఆర్‌గారి జీవితం, తెలంగాణ మలి దశ ఉద్యమంలో అమరులైన విద్యార్థుల జీవితాలు, ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు పిడమర్తి రవీంద్ర.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

\- టీఎస్ఎఫ్‌సీసీ అధ్యక్షుడు సునీల్ నారంగ్




''తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎస్ఎఫ్‌సీసీ) అధ్యక్షునిగా నన్ను ఎన్నుకున్నవారికి కృతజ్ఞతలు. గత ఏడాది కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఈ అసోసియేషన్‌కి పూర్తి సమయం కేటాయించలేకపోయాను.. ఈ ఏడాది కచ్చితంగా సమయం కేటాయించి అందరితో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను'' అని నిర్మాత సునీల్ నారంగ్ అన్నారు. కొత్తగా ఎన్నికైన 'తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి' పాలక మండలిని శనివారం ప్రకటించారు. 'టీఎస్ఎఫ్‌సీసీ' అధ్యక్షునిగా సునీల్ నారంగ్ ఎన్నికవగా, ఉపాధ్యక్షులుగా వీఎల్ శ్రీధర్, వాసుదేవ రావు చౌదరి, సెక్రటరీగా కె. అనుపమ్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా బాలగోవింద్ రాజ్ తడ్ల, ట్రెజరర్‌గా చంద్ర శేఖర్ రావు ఎన్నికయ్యారు. అలాగే 15 మంది ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం మాట్లాడుతూ- ''టీఎస్ఎఫ్‌సీసీ' పాలక మండలి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషంగా ఉంది. అందరూ చిత్ర పరిశ్రమ, కార్మికుల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి'' అన్నారు. ఇంకా నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్, కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడారు.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



గౌడ/M.Tech/C.Govt. లోకో పైలట్/ రైల్వేస్/1 Lakh. PM/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14680]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/C.Govt. ఎలక్ట్రిక్ ఇంజినీర్/BHEL/85000/-PM/ 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-14680]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తిలేదు /B.Tech/ Govt. Asst. Exq. ఇంజినీర్/R&B Dept./ 80,000/- pm/ 5'8" ఎత్తు 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14681]

రజక/కట్నం ప్రసక్తిలేదు/B.Tech/ C. Govt. బ్యాంక్ మేనేజర్/SBI/ 80,000/- pm/ 5'10" ఎత్తు 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14681]

మాదిగ/B.Tech/ Govt. AE/ జెన్‌కో/ 90,000/- pm/ 5'9" ఎత్తు 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9642459724 [HA-14681]

గంగపుత్ర(బెస్త)/ 27/5'9"/ B.Tech MBA/SWE/ 18L P/A సొంత ఇల్లు వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. Ph: 6301621607 [H-781229]

కాపు: CNB/ II మ్యారేజ్ / 45 సం॥ / 5'10"/ C.Govt Job/ 12L P/A సొంత ఇల్లు, పొలాలు, బాగా స్థిరపడిన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6281925716 [H-781229]

SC క్రిస్టియన్/ 28/5'8"/ B.Tech Govt. ఎంప్లాయి/ 80K.PM/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి గల వరునికి వధువు కావలెను. Ph: 8125548806, 7386715262 [H-14686]

వడ్డెర: M.Tech/ C Govt. ఇంజనీర్ / BEL/ 1Lakh. Pm/ 5'8" ఎత్తు/ 31 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9618579861 [H-14686]

క్రిస్టియన్ మాల/ 38/5'7"/ M.Tech చీఫ్ డేటా ఆఫీసర్/ 90,000/- pm/ వెల్‌సెటిల్డ్ వరునికి వధువు కావలెను. Ph: 8790016395 [H-14686]

SC మాల క్రిస్టియన్ / ఏకైక కుమారుడు B.Tech/ C.Govt. గ్రూప్-A ఆఫీసర్ మినిస్ట్రి యూత్ అఫైర్ & స్పోర్ట్స్ / 1 Lakh. Pm/ 5'11 ఎత్తు/ 30 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8897389698 [H-14686]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen Residency Doctor, 31, 6' 1", Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK BE (BITS), 28, 5' 10", SWE, 150 K Pounds, 6 Crores. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen BS, 27, 5' 10", Cloud Architect, 170 K, 20 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5'7", SWE, 150 K, 4 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BS, 24, 5' 5", Analyst, 75 K, H1 USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 5" Fair & Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 4", SWE, 200 K, 2 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 7", SWE, 129 K, 4 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



AVINASH REDDY MARRIAGES
USA, UK వివాహ సంబంధాలకు సంప్రదించండి
98480 11818
D.V. Koti Reddy

రెడ్డి UK BE, MBA (IIM), 29, 6' 1", Sr. Consultant, 300 K Pounds, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 31, 5' 11", SWE, 138 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", SWE, 130 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK MBBS, MRCP, 5' 6", 46, Doctor, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK BE, MS, 24, 5' 8", 20 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 5", Analyst, 95 K, 25 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 5", SWE, 120 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 7", Developer, 84 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC మాల & క్రిస్టియన్ / కట్నప్రసక్తి లేదు/ B.Tech/ IT/ Govt. AEE/ ట్రాన్స్‌కో/ 14 Lakhs, PA/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [H-14686]

SC మాదిగ & క్రిస్టియన్ / కట్నప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt. Asst.మేనేజర్/ యూనియన్ బ్యాంక్/ 85,000/- Pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [H-14686]

2వ పెళ్ళి/43Y, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి, 1,20,000/-PM, 5Cr ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. Any FC/BC Only. Ph: 9701605100 [H-788757]

36 సం.ల/బిజినెస్ చేస్తున్న ప్రాపర్టీ ఉన్న వరుడుకి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయినా సంప్రదించండి. డౌరీ, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 7396730091 [HA-30884]

రెడ్డి /40/5'10"/MBA/రెండవ పెళ్ళి/ Pvt జాబ్/ 60K/Own House/2 కోట్ల ప్రాపర్టీ ఉన్న వరునికి OC 1 or 2 మ్యారేజ్ పిల్లలు లేని వధువు కావలెను (డైరెక్ట్) , 9133857101. [T-1148502]

వైశ్య/ICICI బ్యాంక్ మేనేజర్/Age:25/ 5.7/ గల అబ్బాయికి వధువు కావలెను. వైశ్య/ సాఫ్ట్‌వేర్ Age : 25/ 5.2 గల అమ్మాయికి అబ్బాయి కావలెను. సంప్ర: 95503 82139 [L-799082]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/32y/నెలకు లక్ష రూపాయల ఆదాయం సొంత ఇల్లు కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి కుల, కట్న ప్రసక్తి లేని అమ్మాయి కావలెను. డైవర్సీ/విడో అయినా OK. డైరెక్ట్. Ph: 7989079290 [H-781441]

SC మాల/కుల, కట్న ప్రసక్తి లేదు/లేటు/46/ 5'1"/ B.Tech,MBA,LLB, PhD/40K PM కొంచెం శారీరక వైకల్యం కాలు/హైదరాబాద్‌లో స్థిరపడిన వరునికి 1st/2nd వధువు కావలెను. డైరెక్ట్ ఫోన్: 7702438915 [HA-11251]

అమ్మాయి కావలెను. 1వ కోమట్ల అబ్బాయి వయస్సు: 35, M.Sc., M.Ed., ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం 30 వేలు, ఆస్తి 50 లక్షలు నల్లగొండ. సెల్: 9121325068. నో బ్రోకర్స్ [Y-772537]

SC-Mala/Hindu /2nd Marriage /39/ 5'10" /PG /SWE /1,20,000/-PM /wants good looking bride (urgently). 8187861989 Direct, No Brokers [H-781232]

★★

దూదెకుల (చెవి పోగు) B.Tech ఎత్తు 5'9' వైట్, సౌదీ అరేబియా (రియాద్) సామ్‌సంగ్ కంపెనీలో ప్లానింగ్ మేనేజర్‌కు వధువు (B.Tech, డిగ్రీ) కావలెను. 9959215917. [C-785867]

మాల, హిందు 2nd మ్యారేజ్ వయస్సు : 39, 5:5'9", B.Tech, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెలకు 2 లక్షల జీతం వరుడికి వధువు మాల, హిందు, క్రిస్టియన్ కావలెను. వరుడుకుని ఉండాలి. వయస్సు: 35 సం॥, 36 సం॥ ఉండాలి. ✆ 77949 11019 [R-64]

రాజులు 36/5'10", M.Tech, / 2.35 PM / బిజినెస్ చేయు వరుడికి తగిన వధువు కావలెను. 1వ, 2వ, విడో కావలెను. పిల్లలు ఉన్న ok. ఫోన్: 87906 41404 [V- 778139]

డైరెక్ట్/40/5.5/ M.Com/ B.Ed,Own Shop ఉన్న వరుడికి కుల, వయసు, ఆస్తి ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. ఇల్లరికం అయినా OK డైరెక్ట్. 85199 34926 [L-799081]

వరుడు కావలెను



SC హిందూ మాదిగ/M.Sc(Agri)/Govt. Jr.Asst./అగ్రికల్చర్ Dept/ 50,000/-PM/5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9963410191 [HA-14680]

రజక/ఏకైక కుమార్తె/B.Tech/C.Govt. బ్యాంక్ P.O/బ్యాంక్ ఆఫ్ బరోడా/50,000/- PM/5'5ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618006271 [HA-14680]

ముదిరాజ్/40 లక్షల ఆస్తి/B.Sc/C.Govt. స్టెనోగ్రాఫర్/రైల్వేస్/45000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-14680]

రెడ్డి/విడో/60y/రిటైర్డ్ పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్/ఆంధ్రాలో పొలాలు ఏ బాదరబందీ లేని వెల్‌సెటిల్డ్ సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 9010484478 [H-788902]

రెడ్డి/విడో/60y/5'5"/V.Fair/Govt (HM) రిటైర్డ్/ సొంత ఇల్లు/ బిజినెస్/20 ఎకరాల మాగాణి గల సాంప్రదాయమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-788902]

తెలగ/కాపు/విడో/58y/తెల్లనిచాయ/డిగ్రీ/ప్రభుత్వ పెన్షనర్/2 ఇళ్ళు గల ఒంటరి వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9121509718 [H-788902]

రెడ్డి/విడో/55y/Fair/Hydలో Own House (Rents) Own Business, పాప USAలో సెటిల్డ్, ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. (సపోర్ట్ ఉండును) Ph: 8519883423 [H-788902]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తిలేదు/ A:30, Qly: డిగ్రీ/బిజినెస్ లు కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను. (ఇల్లరికం Ok). Ph: 9515673252 [HA-14681]

మాల/27/5'3"/ B.Tech, Central Govt. Railway J.E (Junior Engineer), 12 Lakhs P/A వధువుకి తగిన వరుడు కావలెను. No Brokers. Ph: 9493285326 [HA-14681]

పద్మశాలి/60yrs/5'4", V.Fair, డైవర్సీ, సొంత ఇల్లు, రెంట్లు, బిజినెస్, 25 ఎ॥ పొలం, పెన్షన్ గల వధువుకు కుల ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 7660088694 [HA-14681]

కాపు/వయస్సు: 28, చదువు: డిగ్రీ/ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్న అందమైన వధువుకి 1st (or) 2nd సంబంధం మంచి వరుడు కావలెను. Ph: 9121300377 [HA-14681]

SC మాల/ B.Tech/ C.Govt. ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్/ 60,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14681]

క్రిస్టియన్ మాల/ B.Tech/ SWE/60,000/-pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14681]

గంగపుత్ర (బెస్త)/ 23/5'4"/ M.Sc/ SWE/ 10LP/A గల అందమైన వధువుకు వరుడు కావలెను (నో బ్రోకర్స్) Ph: 6301621607. [H-781229]

పద్మశాలి(CNB)/ డైవర్సీ/ 46/5'3"/ Govt Job/ AEE/ 12LP/A పిల్లలు లేరు /Own House గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8897091964. [H-781229]

క్రిస్టియన్ మాల/ MBBS/ మెడికల్ ఆఫీసర్/ 98000/- pm/ 5'6" ఎత్తు / 30 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8790016395. [H-14686]

యాదవ/ B.Tech(సివిల్)/ C.Govt. Asst. మేనేజర్/ కెనరా బ్యాంక్ / 75,000/- pm / 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [H-14686]

Govt ఎంప్లాయ్/38 years, 3,00,000/-(PM), 2వ పెళ్లి, కుల ప్రసక్తి లేదు, కోట్ల ప్రాపర్టీ, సొంత అపార్ట్‌మెంట్, బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలున్నా OK) సంప్ర : 9502046384 [H-788757]

కమ్మ/విడో/53y/5'3"/ప్రాపర్ ఆంధ్ర, Hydలో సొంత బిజినెస్/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (ఇల్లరికం) వారికి ప్రాధాన్యత (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-788757]

కుల పట్టింపు లేదు/45yrs/BC/డిగ్రీ/Govt ఎంప్లాయ్ 60K (PM) విడో 1 పాప మ్యారేజ్ వెల్ సెటిల్డ్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి తగిన వరుడు కావలెను (పిల్లలున్నా ఓకే అడ్జెంట్) సంప్ర : 7286031653 [H-788757]

2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/35yrs/M.Sc, M.Ed/Govt టీచర్/1 లక్ష(PM), 20 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని తెల్లని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్న ఇల్లరికం OK) సంప్ర : 7396213324 [H-788757]

SC మాల క్రిస్టియన్/24/5'5"/Fair/ B.Tech(NIT)/AEE పంచాయతీరాజ్/60,000/-PM అందమైన Well Settled వధువుకి తగిన Govt/Software వరుడు కావలెను. Ph: 8978880072 [H-780709]

బ్రాహ్మణ/33yrs/5'2"/ఇంటర్/29yrs/ 5'4"/డిగ్రీ/25yrs/5'2"/MBA వధువులకు వరులు కావలెను/రిటైర్/Pvt, Govt జాబ్ & పురోహితం అయినా OK. 9391158083 [H-780709]

పద్మశాలి/27yrs/5'4"/కలర్‌Fair/B.Tech/Software Job/80K Per Month. Open Plots/2 Own Houses/వెల్ సెటిల్, ఇల్లరికం/Any Caste అయినా OK. వధువుకు వరుడు కావలెను. Ph: 79958 25318 [H-780709]

రెండో పెళ్ళి/58y/ &56y & 54y & 52y & 50y & 48y & 46y & 44y & 42y & 40y & 39y & 38y & 36y & 35y & 33y & 32y & 31y & 30y & 29Y & 28y &26y/"మానేవ" : PH/WA : 9291503949 [H-780709]

Govt టీచర్/Age 46yr, Sal: 75K, పద్మావతి 54y, Hyd, రాజీ గౌడ్ 49Yr, చౌదరి కమ్మ 51Yr, దీప 43yr టీచర్ ప్రైవేట్ Any OC/BC వరుడు కావలెను. Ph: 9063855739 [H-780709]

No Caste bar, 1,2 వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారికోసం మాత్రమే Ph: W: 7794960803 [H-781322]

బ్రాహ్మణ: 26/5'4"/B.Tech/ "28/5'3"/ B.Sc "30/5'4"/MBA/27/5'3"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను కట్నాలు ఆశించని/ మధ్యతరగతి/ పురోహితులకు ప్రత్యేకం. Ph: 7207634758 [H-14686]

Sunni Muslim/30/5'6"/Parents Invite Correspondence for their Beautiful Daughter, Looking for a Well Settled Groom Working in Hyd. 9949344520 [H-792895]

★★

క్రిస్టియన్ మాదిగ 28 Yrs/5.3"/ M.B.B.S/ MD చదివిన అందమైన వధువుకు MD/MS చదివిన వరుడు కావలెను. ✆ 98851 85466. [O-758388]

వేదికలు



వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-14681]

కులపట్టింపులేని అన్ని కులములవారికి ఒకటవ, రెండవ సంబంధములు చూడబడును 21సం॥-60 సం॥ వరకు. సంబంధములు చూపబడును. 8897091964 [H-781229]

ఆషాఢం అదిరే ఆఫర్. కమ్మ, రెడ్డి, కాపు, వైశ్య ఇతర OC, BC, SC, ST 1వ, 2వ, లేటు, డాక్టర్, SWE, Govt, NRI, డైవర్సీ, విడో మ్యారేజెస్ త్వరగా కుదిర్చే ఏకైక సంస్థ. సంప్ర: Ph: 9247217621 [H-14686]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Shyam, Ph: 6281389448/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14688]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14688]

Kamma-Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 6281389448/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14688]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14688]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Shyam, Ph: 6281389448/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14688]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-780919]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM / Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-781497]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/PG/NRI /PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15సం॥ Exp. Ph: 8712384555 [HA-29502]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-788902]

పెళ్లి-పెళ్లి-పెళ్లి. ఎక్కడ ! ఎప్పుడు!! ఎలా!!! సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్,రిచ్ వారికి ప్రత్యేక శ్రద్ధతో ఫాస్ట్ సెటిల్‌మెంట్.20years, పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1455]

15 రో॥ అన్ని కులముల వారి తగిన సంబంధములు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com ✆ 94418 29644, 98490 58673, 94920 33897, 94407 85888 W [B-605]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-147]

పద్మశాలి వధూవరుల స్వయంవరం (Online) 9th July Free Registration. bhavanimatrimony.com. Hyderabad. Ph: 9704656103, 9533608887 [HA-195]

★★

గాంధర్వ మ్యారేజెస్ : ఆంధ్ర మరియు తెలంగాణ అంతటా అన్ని కులముల మతముల వారికి సంబంధాలు చూడబడును. 8985611100. [C-785857]

'స్కూళ్ల' యూనిఫాంపై వీడియోలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలో భాగంగా అందిస్తున్న స్కూల్ యూనిఫాంను ఎలా కుట్టాలనే అంశంపై సమగ్ర శిక్షా విభాగం ప్రత్యేక వీడియోలు రూపొందించి యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచింది. ఒక్కో విద్యార్థికి మూడు జతల చొప్పున 39,95,992 మందికి ప్రభుత్వం యూనిఫాం సరఫరా చేసింది. గతేడాది కంటే ఈసారి విద్యార్థులందరికీ ఇచ్చే క్లాత్‌ను 25 నుంచి 60 శాతం పెంచి అందిస్తోంది. బాలికలకు ముదురు లావెండర్ రంగులో గౌను, లావెండర్ రంగులో చెక్స్‌తో టాప్.. అబ్బాయిలకు ముదురు నీలంపై నల్ల రంగు చెక్స్ చొక్కా, డార్క్ మిడ్‌నైట్ బ్లూ రంగులో ప్యాంటు/నిక్కర్ క్లాత్ అందజేస్తోంది. బాలబాలికల కొలతలు తీసుకోవడం నుంచి క్లాత్ కటింగ్, యూనిఫాం కుట్టడం వరకు 3 నుంచి నాలుగు నిమిషాల నిడివి గల వీడియోలను రూపొందించి 'దీక్ష ఏపీ' యూట్యూబ్ చానల్‌లో అందుబాటులో ఉంచారు. ఒకటి నుంచి 7వ తరగతి వరకు అబ్బాయిలకు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, నిక్కర్.. 8 నుంచి 10వ తరగతి వరకు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, ప్యాంట్ కుట్టించాల్సి ఉంటుంది. బాలికలకు ఒకటి, రెండు తరగతులకు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, గౌను.. 3, 4, 5 తరగతులకు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, స్కర్టు.. ఆరు నుంచి 10వ తరగతికి చుడిదార్ కుట్టించాలి. ఇందుకోసం సమగ్ర శిక్ష రూపొందించిన వీడియోలను https://www.youtube.com/channel/UCC&WWoPgBZ1RkZ3 pbQEgx7 లో చూడవచ్చు.

నీట్ ఫలితాల్లో 'ఆకాష్‌కు' ఉత్తమ ర్యాంకులు

హైదరాబాద్: ఇటీవల వచ్చిన నీట్ 2023 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఆకాష్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచి జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఆకాష్ విద్యా సంస్థకు చెందిన 145 మంది విద్యార్థులకు నీట్‌లో 700ప్లస్ స్కోరు సాధించారు. అఖిల భారత స్థాయిలో అన్ని కేటగిరీల్లోనూ 100 లోపు ర్యాంకుల్ని 57 మంది విద్యార్థులు సాధించగా...టాప్ 50 ర్యాంకులు సాధించినవారిలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఆకాష్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు అఖిల భారత స్థాయిలో కౌస్తవ్ బౌరి 3వ ర్యాంకు, ధ్రువ్ అద్వానీ 5వ ర్యాంకు సూర్య సిద్ధార్థ్ 6వ ర్యాంకు, స్వయం శక్తి 8వ ర్యాంకు సాధించినట్లు ఆకాష్ విద్యాసంస్థల యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

హ్యాట్సాఫ్.. ఏపీ పోలీసులు

కరడుగట్టిన దోపిడీ దొంగల డెన్‌లోకి వెళ్లి ముగ్గురు చోరుల పట్టివేత

- దొంగల ముఠా సభ్యులు వెంబడించినా చాకచక్యంతో వారికి చెక్
- తమిళనాడులో మన పోలీసుల ధైర్యసాహసం
- దొంగల్ని అరెస్టుచేసి, సొత్తు రికవరీ చేసిన 'ప్రకాశం' పోలీసులు



మూలకొండపాడులో చోరీ జరిగిన ఇంట్లో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

సింగరాయకొండ :ఏపీ-తమిళనాడు సరిహద్దులోని ఆ ఊరు నేర సామ్రాజ్యానికి అడ్డా.. అది పోలీసులు కూడా ఛేదించలేకపోయిన ఘరానా దొంగల గడ్డ.. అలాంటి చోటుకు మన ఏపీ పోలీసులు ఎంతో ధైర్యసాహసాలతో ప్రాణాలకు తెగించి వెళ్లారు. వెళ్లడమే కాదు.. పద్మవ్యూహంలాంటి ఆ చోర సామ్రాజ్యం నుంచి కరడుగట్టిన ముగ్గురు దొంగల్ని పట్టుకున్నారు. ఇది పసిగట్టిన అక్కడి దొంగల ముఠా సభ్యులు పోలీసులను వెంబడించారు. ఈ ఛేజింగ్‌లో మన పోలీసుల చాకచక్యంతో పైచేయి సాధించి ముగ్గురు నేరస్తుల్ని పట్టుకొచ్చేశారు. క్రైమ్ థ్రిల్లర్‌ని తలపించిన ఈ ఘటన వివరాలు ఏమిటంటే.. ప్రకాశం జిల్లా ఒంగోలు, సింగరాయకొండలో వరుస చోరీలకు పాల్పడిన ముగ్గురు ఘరానా దొంగలను తమిళనాడులోని మింజూరులో ప్రకాశం జిల్లా పోలీసులు వలపన్ని సినీ ఫక్కీలో అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ నెల 11న ప్రకాశం జిల్లా ఒంగోలు టీచర్స్ కాలనీకి చెందిన పోతిరెడ్డి కృష్ణారెడ్డి ఇంట్లో 60 సవర్ల బంగారం, రూ.6 లక్షల నగదు చోరీకి గురైంది. ఈ నెల 12వ తేదీన సింగరాయకొండ పరిధిలోని మూలగుంటపాడులో ముమ్మడిశెట్టి చంద్రశేఖర్ ఇంట్లోకి చొరబడి భారీ చోరీకి పాల్పడ్డారు. ఎస్పీ మల్లికాగర్గ్ ఆదేశాల మేరకు డీఎస్పీ నారాయణస్వామి పర్యవేక్షణలో సింగరాయకొండ సీఐ రంగనాథ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. సీసీ టీవీ ఫుటేజీలు ఆధారంగా ఒంగోలు టీచర్స్ కాలనీ, సింగరాయకొండలో చోరీలకు పాల్పడిన ముఠా ఒకటేనని నిర్ధారణకు వచ్చారు. ఇదే ముఠా నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోనూ గతంలో దోపిడీలకు పాల్పడినట్టు గుర్తించారు.

నేర సామ్రాజ్యంలోకి వెళ్లి మరీ అరెస్ట్?

ఈ ముఠా తమిళనాడులోని మింజూరు ప్రాంతానికి చెందినదని గుర్తించిన పోలీసు బృందాలు నిందితుల్ని అదుపులోకి తీసుకునేందుకు పథకం పన్నారు. మింజూరు ప్రాంతం నేర సామ్రాజ్యానికి అడ్డా కావడం.. గతంలో పోలీసులు వీరిని అరెస్ట్ చేసేందుకు వెళ్లిన క్రమంలో దొంగల ముఠాకు చెందిన వ్యక్తులు పోలీసులపై విరుచుకుపడటం వంటి పరిస్థితులు తలెత్తాయి. గతంలో చిత్తూరు, నెల్లూరు జిల్లాల పోలీసులు ఈ ముఠాను పట్టుకునేందుకు ప్రయత్నించి తమవల్ల కాక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈ పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకున్న సింగరాయకొండ సీఐ ఆధ్వర్యంలోని పోలీస్ టీమ్ దొంగలను అదుపులోకి తీసుకునేందుకు రెండు కార్లలో పక్కా ప్రణాళికతో వెళ్లారు. మింజూరు స్టేషన్ మహిళా ఎస్సై సహకారంతో దొంగల కోసం రోజంతా అక్కడ మాటు వేశారు. చివరకు శనివారం తెల్లవారుజామున అందరూ గాఢ నిద్రలో ఆదమరచి నిద్రిస్తున్న సమయంలో ముగ్గురు దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులపైనే దాడికి యత్నం

చోరీ సొత్తును రికవరీ చేసే క్రమంలో ఆంధ్రా నుంచి పోలీసులు వచ్చారని తెలుసుకున్న దొంగల ముఠాకు చెందిన కొందరు వ్యక్తులు పోలీసులపై మూకుమ్మడి దాడికి యత్నించినట్టు సమాచారం. అప్పటికే కొంత సొత్తును రికవరీ చేసిన పోలీసులు వెంటనే అప్రమత్తమై నిందితులు ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని వెంటనే తాము వచ్చిన వాహనాల్లోనే తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో దొంగల ముఠాకు చెందిన వ్యక్తులు మరో రెండు కార్లలో పోలీసుల్ని వెంబడించినట్టు తెలిసింది. ఆ తరువాత పోలీసుల వాహనాలు హైవేపైకి రావడంతో ముఠా తరఫు వ్యక్తులు వెనుదిరిగినట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

శరవేగంగా ప్రాధాన్యత పనులు

- సచివాలయాల పరిధిలో రూ.239 కోట్ల విలువైన 6,504 ప్రాధాన్యత పనులు పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మంత్రులు, ఎమ్మెల్యేలు గుర్తించిన అత్యంత ప్రాధాన్యత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రూ.239 కోట్ల విలువైన 6,504 పనులు పూర్తయ్యాయి. విశాఖపట్నం, వైఎస్సార్, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాల్లో అత్యధిక పనులు పూర్తి చేశారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మౌలిక సదుపాయాల అంతరాలను గుర్తించి ప్రాధాన్యత పనులుగా చేపడుతున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో ఈ ప్రాధాన్యత పనుల కోసం రూ. 20 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తం కార్యక్రమానికి రూ.3000 కోట్లు మంజూరు చేసింది. పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపునకు తొలి విడతగా రూ.500 కోట్లు విడుదల చేసింది. ఇప్పటివరకు 7,165 సచివాలయాల పరిధిలో గుర్తించిన రూ. 1,441 కోట్ల విలువైన 37,117 ప్రాధాన్యత పనులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందులో 6,694 సచివాలయాల పరిధిలోని రూ. 1,309 కోట్ల విలువైన 33,781 పనులను మంజూరు చేశారు. వీటిలో 6,051 సచివాలయాల పరిధిలో రూ.1,144 కోట్ల విలువైన 30,481 ప్రాధాన్యత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమైన అత్యంత ముఖ్యమైన పనులను మంత్రులు, ప్రజాప్రతినిధులు గుర్తించిన వెంటనే వాటి వివరాలను గడప గడపకు మన ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత పనుల పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అన్నమయ్య, బాపట్ల జిల్లాల్లో అత్యధికంగా 98% పనులు మంజూరయ్యాయి. వైఎస్సార్ జిల్లాలో 96 % పనులు మంజూరు చేశారు. పనులు మంజూరు, ప్రారంభించడంలో వెనుకబడిన జిల్లాల్లో కలెక్టర్లు వాటిపై సమీక్షించి త్వరితగతిన పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. పనులు వేగంగా పూర్తి చేయడానికి కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించింది. పూర్తయిన పనుల బిల్లులను సీఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి నిబంధనల ప్రకారం చెల్లించాలని డీడీవోలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అత్యంత ప్రాధాన్యత పనుల పురోగతి, బిల్లుల చెల్లింపును పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లకు సూచించినట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు.

అమర్‌నాథ్ హత్యపై టీడీపీ శవరాజకీయం

- కుటుంబ ఘర్షణలను రాజకీయం చేస్తున్న ఆ పార్టీ నేతలు
- అమర్‌నాథ్ కుటుంబానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం
- పరామర్శకు వెళ్లిన ఎంపీ మోపిదేవిని అడ్డుకున్న టీడీపీ నేతలు
- మృతుడి కుటుంబానికి సీఎం జగన్ రూ.10 లక్షల సాయం
- గంటల వ్యవధిలోనే ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సీఎం జగన్ రూ.10 లక్షల సాయం

ఇక మృతుడు అమర్‌నాథ్ కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి అండగా నిలబడేలా రూ.10 లక్షల చెక్కును పంపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా బాధిత కుటుంబానికి సాయం అందిస్తుందని స్పష్టం చేశారు. చెక్కును ఆదివారం అందజేస్తారు.

సాక్షి, ప్రతినిధి, గుంటూరు :రెండు కుటుంబాల మధ్య చెలరేగిన ఘర్షణను రాజకీయం చేసి.. తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేందుకు టీడీపీ నేతలు చేసిన శవ రాజకీయాలు బెడిసికొట్టాయి. అడుగడుగునా అడ్డంకులు సృష్టించి లేనిపోని ఆరోపణలు చేద్దామనుకున్న టీడీపీ నేతల ఆటలు సాగలేదు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెంకు చెందిన యువకుడు ఉప్పాల అమర్‌నాథ్‌ను కొందరు వ్యక్తులు కుటుంబ వివాదాల నేపథ్యంలో పెట్రోల్ పోసి తగులబెట్టి హత్యచేసిన విషయం తెలిసిందే. టీడీపీ నేతలు ఈ ఘటనకు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా.. అమర్‌నాథ్ మృతదేహంతో చెరుకుపల్లి సెంటర్‌లో ధర్నా చేపట్టారు. విద్యార్థి మృతిని తమకు అనుకూలంగా మార్చుకుని అలజడి సృష్టించేందుకు యత్నించారు. కానీ, నిందితులను గంటల వ్యవధిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎంపీ మోపిదేవి అడ్డగింత..


అమర్‌నాథ్ మృతదేహాన్ని చూసి అతని కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావును అడ్డుకున్నారు. టీడీపీ స్వార్థ రాజకీయాలను గమనించిన ఎంపీ మోపిదేవి ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని కోరారు. మృతుడి కుటుంబానికి ఎంపీ వ్యక్తిగతంగా రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తున్నా.. వారికి వద్దంటూ టీడీపీ నేతలే అడ్డుకోవటం గమనార్హం. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీ చెప్పారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వోద్యోగం ఇప్పిస్తామని చెప్పారు.

అది రెండు కుటుంబాల మధ్య ఘర్షణే : ఎస్పీ

రెండు కుటుంబాల మధ్య ఘర్షణే ఈ హత్యకు దారితీసిందని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే హత్య జరిగిన గంటల వ్యవధిలోనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసులో ఎటువంటి రాజకీయ కోణంలేదని ఆయన తేల్చిచెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకున్నప్పటికీ టీడీపీ నేతలు వారిని అరెస్టుచేయలేదని వ్యాఖ్యలు చేయటం వివాదాస్పదమయ్యాయి. మరో నిందితుడిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ అమలులో ఏపీ భేష్

- కేంద్ర పాఠశాల విద్య కార్యదర్శి సంజయ్‌కుమార్ ప్రశంస



సంజయ్‌కుమార్‌కు ఏపీ విద్యా విధానంపై వివరిస్తున్న సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి : ఫౌండేషనల్ లెర్నింగ్ అండ్ న్యూమరసీ(ఎఫ్‌ఎల్‌ఎన్) ద్వారా ప్రాథమిక స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించడంలో ఆంధ్రప్రదేశ్ పనితీరు అద్భుతంగా ఉందని కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్య-అక్షరాస్యత శాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ ప్రశంసించారు. పుణేలోని సావిత్రిబాయి పూలే విశ్వవిద్యాలయంలో జరుగుతున్న జి-20 'జన్ భాగీదారీ' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను శనివారం ఆయన సందర్శించారు. సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సంజయ్‌కుమార్‌కు వివరించారు. రాష్ట్రం తరఫున ఏర్పాటు చేసిన స్టాల్‌ను వివిధ రాష్ట్రాల సమగ్ర శిక్షా ప్రాజెక్టు సంచాలకులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు ప్రశంసించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంచేందుకు అందిస్తున్న పిక్టోరియల్ డిక్షనరీని పరిశీలించిన ఉత్తరాఖండ్ పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.రవికుమార్ అభినందించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా డిజిటల్ విద్యా బోధన అందిస్తున్న ఏపీ బృందాన్ని సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని తమ సిబ్బందిని ఆదేశించారు. రాజస్థాన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌జైన్ ఫౌండేషనల్ స్కూళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేట్ అకడమిక్ మోనిటరింగ్ డైరెక్టర్ బి.విజయభాస్కర్, స్టేట్ అకడమిక్ మోనిటరింగ్, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా పీఎంయూ బృందం పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.